ANDHRA JYOTI, Vijayawada Regd. No. 375 ఉదయం ★★ Telephone: 1343

ఆంధ్రజ్యోతి

ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు

చందారేట్లు

	ఏజెంట్ ద్వారా	పోస్టు ద్వారా
	రు. న. పై.	రు. న. పై.
ఒక మాసానికి	2-65	2-75
మూడు మాసాలకు	7-75	8-00
ఆరు మాసాలకు	15-50	16-00
సంవత్సరానికి	31-00	32-00

సర్క్యులేషన్ మేనేజర్,
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2.

ప్రాసెస్
బ్లాకులు
ఆఫ్‌టోన్, లైన్ బ్లాకులు
సకాలంలో చేసియివ్వగలము
[illegible]
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2

120490

సంపుటి 4 :: సంచిక 274 || విజయవాడ, ఏప్రిల్ 7, 1964 మంగళవారం || 6 పేజీలు :: 8 నయాపైసలు

“లడఖ్‌లోని ఆక్సాయ్‌చిన్ ప్రాంతం మనదే”

చైనా అధీనంలో వున్న భారత భూభాగాలను తిరిగి స్వాధీనపరచుకొనడమే ప్రభుత్వ లక్ష్యమని లోకసభలో ప్రధాని నెహ్రూ ప్రకటన

మన రక్షణ వ్యవస్థ నిస్సందేహంగా అభివృద్ధి చెందుతున్నదని వివరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6—

లడఖ్‌లోని ఆక్సాయ్‌చిన్ ప్రాంతం మనదేనని ప్రధాని నెహ్రూ నేడు లోకసభలో ప్రకటించారు.

మనవిగా భావిస్తున్న భూభాగా లన్నింటినీ చైనా నుంచి తిరిగి స్వాధీన పరచుకొనడమే భారత ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

చైనా-ఇండియా సరిహద్దు పొడవునా చైనీస్ సేనల కేంద్రీకరణ కొనసాగుతున్న దన్న విషయంపై సభ్యులు అడిగిన పెక్కు ప్రశ్నలకు శ్రీ నెహ్రూ సమాధాన మిస్తూ కొలంబో ప్రతిపాదనలను చైనా ఆమోదించినట్టయితే దానితో చర్చలు జరపడానికి ఇండియా సంసిద్ధంగా వున్నదని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆయన చెప్పారు.

చైనాకు సంబంధించినంత వరకు ఇండియా రక్షణ వ్యవస్థ అభివృద్ధిచెందుతున్నదని, ఇందులో ఏ మాత్రం సందేహపడ నవసరం లేదని ఆయన సభ్యులకు హామీ నిచ్చారు.

చైనా ఆక్రమణలో వున్న మన భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసికొనడానికి, చైనా దురాక్రమణ తిరిగి జరిగితే సమర్థవంతంగా త్రిప్పి కొట్టడానికి రక్షణ వ్యవస్థ పెంపుదల ఉద్దేశించబడినదని ఆయన వివరించారు.

ఆక్సాయ్‌చిన్ ప్రాంతం భవిష్యత్తును గురించి ఆఫ్రో - ఆసియన్ రాజ్యాల మహాసభ నిర్వహణపై జకర్తాలో జరిగే సన్నాహక సమావేశంలో ఇండియా పాల్గొనవచ్చునాఅన్న విషయాన్ని గురించి, కొలంబో ప్రతిపాదనలను గురించి సభ్యులు అనేక ప్రశ్నలు వేశారు.

భారతీయ భూ భాగం ఆక్రమణను చైనా కొనసాగిస్తుండగా బాండుంగ్ సభ లాంటి వాటికి ఇండియా ఎందుకు హాజరుకావాలని శ్రీయుతులు హెచ్. వి. కామత్, ఎన్. జి. రంగాగార్లు ప్రశ్నించారు.

దీనిని దేశ ద్రోహకర విధానమని తాను పిలవ దలచుకో లేదని అయితే మన భూభాగంపై దురాక్రమణ చేసిన చైనీయులతో కరచాలనం చేసే వైఖరి మంచిది కాదని శ్రీ రంగా అన్నారు.

దీనికి ప్రధాని సమాధాన మిస్తూ రెండవ బాండుంగ్ మహాసభ సమస్యను గురించి చర్చించడానికి ఉద్దేశించిన జకర్తా సమావేశంలో పాల్గొనాలన్న ఇండియా నిర్ణయానికి చైనా సమస్యకు సంబంధమేమీ లేదని చెప్పారు.

అంతకు ముందు శ్రీ డి. సి. శర్మ అడిగిన ప్రశ్నకు రక్షణ మంత్రి శ్రీ వై. బి. చావన్ సమాధాన మిస్తూ 1962లో కన్న ఇప్పుడు సరిహద్దు పొడవునా చైనా సేనల సైనిక సన్నాహాలు హెచ్చుగా జరుగుతున్నదన్నమాట వాస్తవమేనని, ఇది ఇండియా భద్రతకు ప్రమాదహేతువని అన్నారు.

సరిహద్దు పొడవునా ఇండియా రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి, ప్రభుత్వం. తనకు వీలయిన చర్యల నన్నింటిని తీసుకొన్నదని ఆయన చెప్పారు.

చైనా, ఇండియా సైనికుల సంఖ్య 3:1 నిష్పత్తిలో ఉన్నదని చైనా రక్షణ మంత్రి బెదిరిస్తూ చేసిన ప్రకటనను తాను చూశానని అయన అన్నారు.

భారతీయ సైనికుల శిక్షణపట్ల ప్రభుత్వం తగు శ్రద్ధతీసికొంటున్నదని ఆయన చెప్పారు.

ఆక్సాయ్‌చిన్, తదితర ఆక్రమిత ప్రాంతాలు చైనా సామ్రాజ్యంలో అంతర్భాగాలుగా మారిపోయిన దృష్ట్యా వాటిని తిరిగి రాబట్టుకొనడానికి ఆదేశంతో యుద్ధం తప్ప మరొక మార్గం లేదు కదా అని శ్రీ కపూర్ సింగ్ ప్రశ్నించారు.

శ్రీ నెహ్రూ : ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. ఆక్సాయ్ చిన్ చైనా సామ్రాజ్యంలో ఒక భాగంగా మారినట్లైనా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం సులభంకాదు అయితే ఆ ప్రాంతాన్ని చైనా ఆక్రమించుకున్న మాట నిజమేకదా అయితే దాని భవిష్యత్తు ఎప్పుడు, ఏ విధంగా వుండగలదో ఇప్పుడు చెప్పజాలము. కాని మనదనుకున్న మొత్తం భూభాగాన్ని తిరిగి రాబట్టుకొనడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాము.

రాజ్యాంగం 17వ సవరణ బిల్లు

ఉపసంహరించాలని లోకసభలో స్వతంత్ర పార్టీ వర్గం విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6—రాజ్యాంగం 17వ సవరణ బిల్లును ఉపసంహరించాలని కోరుతూ స్వతంత్ర పార్టీ వర్గం నాయకుడు శ్రీ ఎన్. జి. రంగా నేడు లోకసభకు ఒక పిటిషన్ సమర్పించారు.

పిటిషన్‌దారుడు శ్రీ సి. ఎల్. నరసింహారెడ్డి (ఎం. పి.) గత నెలలో స్వతంత్రపార్టీ అధ్వర్యాన న్యూఢిల్లీలో జరిగిన అఖిల భారత కిసాన్ సమ్మేళనంలో చేసిన నిర్ణయాలను గురించి ప్రస్తావిస్తూ, రాజ్యాంగాన్ని పలుమార్లు సవరించడం ద్వారా ప్రజలకు ఇచ్చిన ప్రాథమిక హక్కులను కాంగ్రెసుపార్టీ ప్రభుత్వం స్వాహా చేసివేస్తున్నదని విమర్శించారు.

ఇప్పుడు పార్లమెంటు ముందు గల రాజ్యాంగం 17వ సవరణ బిల్లుకూడా దీనికి ఉద్దేశించినదేనని ఆయన అన్నారు.

భారత ప్రభుత్వం డాక్టర్ వెరియర్ ఎల్విన్ మరణంవల్ల ఏర్పడిన ఖాళీలో గిరిజన సంక్షేమ కాంగ్రెసు సంఘంలో సభ్యురాలిగా శ్రీమతి వెరియర్‌ఎల్విన్‌ను నియమించినట్టు న్యూఢిల్లీ వార్త.

ఉత్తరప్రదేశ్ హైకోర్టుకు, శాసనసభకు మధ్య వివాదం - జులై 27 న విచారణకు సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6—

ఉత్తర ప్రదేశ్ శాసన సభకు, హైకోర్టుకు మధ్య ఏర్పడిన వివాదం విషయంలో కొన్ని న్యాయశాస్త్ర అంశాలపై తన అభిప్రాయాలను కోరుతూ ప్రెసిడెంట్ చేసిన ప్రకటనపై జులై 27వ తేదీన విచారణ జరపడానికి నేడు సుప్రీం కోర్టు నిశ్చయించింది.

ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి.బి. గజేంద్రగడ్కర్ ఈ విషయాన్ని నేడు ప్రకటించారు.

మేనెల 15వ తేదీలోగా తమ ప్రకటనలను ఉత్తర ప్రదేశ్ శాసనసభలో ఈ వివాదంపై జరిగిన చర్చకు సంబంధించిన వివరాలను కోర్టుకు అందజేయాలని కూడా పార్టీలకు ఆయన ఆదేశించారు.

వివిధ సంఘాలకు న్యాయ సంస్థలకు ప్రాతినిధ్యం వహించగోరుతున్న పెక్కుమంది న్యాయవాదులు విచారణకు హాజరు కావడానికి అనుమతి నివ్వాలని కోరగా ప్రెసిడెంట్ సూచించిన అంశాలు మినహా ఇతర విషయాలలో దేనిని కోర్టు పరిశీలించబోదని ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారు.

ఈ వివాద ప్రాధాన్యాన్ని వివరించడానికి. అసంఖ్యాకమైన సంస్థల తరఫున ప్రతినిధులు సుప్రీం కోర్టుకు హాజరు కావలసిన అవసరం లేదని కూడా ఆయన తెలిపారు.

భారత న్యాయవాద సంఘం పెక్కు అసోసియేషన్‌లకు ప్రాతినిధ్యం వహించగలదని ఆయన వివరించారు.

కాగా, లక్నో న్యాయవాద సంఘం ఈ విచారణకు ఒక పార్టీగా వుండడానికి అంగీకరించాలని న్యాయవాది శ్రీ ఎస్. ఎస్. శుక్లా చేసిన వాదాన్ని ప్రధాన న్యాయమూర్తి అంగీకరించారు.

నేడు కోర్టుకు హాజరైన పెక్కుమంది న్యాయవాదులలో అటార్నీ జనరల్ శ్రీ సి. కె. దఫ్తరీ, శ్రీ ఎం. సి. సెతల్వాద్, శ్రీ జి.ఎస్. పాఠక్, శ్రీ ఎన్. సి. ఛటర్జీ, ఉత్తరప్రదేశ్ అడ్వకేట్ జనరల్ శ్రీ కె.ఎల్. మిశ్రా కలరు.

ఈ వివాదాన్ని పరిశీలిస్తున్న సుప్రీం కోర్టు బెంచిలో ప్రధాన న్యాయమూర్తితో పాటు న్యాయమూర్తులు శ్రీయుతులు కె. ఎన్. వాంచూ, ఎం. హిదయతుల్లా, కె. సి. దాస్ గుప్తా, ఎన్. రాజగోపాల అయ్యంగార్‌లు వున్నారు.

ప్రారంభంలో ఉత్తరప్రదేశ్ విధాన సభ స్పీకర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ సుప్రీంకోర్టు వేసవి సెలవుల తర్వాత సమావేశమైనప్పుడు - జులై 19వ తేదీన విచారణ ప్రారంభించాలని కోరారు,

ఈ వివాదంలో అనుసరించదగిన విధానాన్నిగురించి అసెంబ్లీలో సంప్రతింపులు జరపడానికి స్పీకర్‌కు వ్యవధి అవసరమని ఆయన చెప్పారు.

అసెంబ్లీ తరఫున కోర్టుముందు ఎవరు హాజరు కావలెనన్న విషయమై సభవారి అభిప్రాయాన్ని స్పీకర్ తెలుసుకొనవలసివున్నదని ఆయన అన్నారు.

అటార్నీ-జనరల్ శ్రీ సి. కె. దఫ్తరీ మాట్లాడుతూ, అసెంబ్లీ చర్చకు సంబంధించిన కాగితాలలో కోర్టు పరిశీలించవలసినవి ఒకటిన్నర పుటలకంటె ఎక్కువగా వుండవని, కావున ఎక్కువ వ్యవధి అనవసరమని వాదించారు.

ఈ వివాదంలో పార్టీలు కోరగల పైళ్ళను దాచివేయడానికి ప్రయత్నాలు జరపరాదని. ఈ వివాదంలో ఏది ప్రధానమైన విషయమో అన్ని పార్టీలకు తెలుసునని, కావున వాటిని సంపాదించడంలో ఎట్టి చిక్కు వుండబోదని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు,

పాక్ రైల్వే సిబ్బందికి రక్షణ

తూర్పు రైల్వే హామీ

కలకత్తా, ఏప్రిల్ 6— పాకిస్తాన్ రైల్వే సిబ్బంది భారత భూభాగంలోనికి వచ్చినప్పుడు వారికి అవసరమైన రక్షణ ఏర్పాట్లుచేయగలమని తాము హామీ నిచ్చినట్టు తూర్పురైల్వే ప్రతినిధి నేడిక్కడ ప్రకటించారు.

ఏప్రిల్ రెండవతేదీన న్యూఢిల్లీలో ద్వితీయ అఖిలభారత క్రీడా మహాసభకు విద్యామంత్రి శ్రీ చాగ్లా ప్రారంభోత్సవం చేసినప్పటి చిత్రం. శ్రీ చాగ్లాకు ఎడమవైపున వున్నవారు అఖిల భారత క్రీడామండలి అధ్యక్షుడు పాటియాలా మహారాజా

అతివాదుల కార్యకలాపాలు

కమ్యూనిస్టు పార్టీ కేరళ సమితి హెచ్చరిక

త్రిచూర్, ఏప్రిల్ 6—పార్టీ క్రమ శిక్షణకు కట్టుబడి వుండి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి చెప్పని పక్షంలో కమ్యూనిస్టు పార్టీలోని ప్రత్యర్థి వర్గంపై తీవ్ర చర్యలు తీసుకొనటం జరుగుతుందని కేరళ రాష్ట్ర కమ్యూనిస్టు సమితి నిన్న హెచ్చరించింది.

పార్టీలో క్రమశిక్షణను నెలకొల్పడానికై విచ్ఛిన్నకర శక్తులతో పోరాటం సాగించవలసిందిగా కమ్యూనిస్టు పార్టీ సంఘా లన్నింటికి రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది.

భారత కమ్యూనిస్టు పార్టీ ఇప్పుడు అత్యంత క్లిష్ట స్థితిలో వున్నదని. తీవ్రమైన భేదాభిప్రాయాలు, క్రమ శిక్షణ ఉల్లంఘన పార్టీలో పొడసూపినవని ఈ సమితి ఒక తీర్మానంలో పేర్కొన్నది.

పాకిస్తాన్ కాందిశీకులకు కేంద్రం ఋణ సహాయం

ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు ఇవ్వడానికి నిర్ణయించినట్టు లోకసభలో శ్రీ ఖన్నా ప్రకటన

దీనివల్ల భారత ప్రభుత్వానికి కనీసం రు 50 కోట్లు ఖర్చు కాగలదని వివరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6—

తూర్పు పాకిస్తాన్ నుంచి వచ్చిన కాందిశీకులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున ఋణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం నిశ్చయించినదని గృహ నిర్మాణ, పునరావాస శాఖ మంత్రి శ్రీ మెహర్‌చంద్ ఖన్నా నేడు లోకసభలో ప్రకటించారు.

అయితే, ఎట్టి పరిస్థితులలోను ఏ కాందిశీకునికి రెండువేల రూపాయలకు మించి ఋణం మంజూరు చేయబోమని ఆయన చెప్పారు.

ఈ నిర్ణయంవల్ల కేంద్ర ప్రభుత్వానికి మొత్తం 50 కోట్ల రూపాయల మేరకు ఖర్చు కాగలదని శ్రీ ఖన్నా తెలియ జేశారు.

తూర్పుపాకిస్తాన్‌నుంచి కాందిశీకులనునిలిపి వేయడానికి సాధ్యపడే అవకాశాలు లేనందువల్ల కేంద్రంలో ప్రత్యేకంగా పునరావాస మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని తాను ప్రధాని నెహ్రూను అభ్యర్థించనున్నట్టు శ్రీ ఖన్నా వివరించారు.

ఇండో-పాకిస్తాన్ చర్చలకు ఇక్కడకు రానున్న పాక్ హోంమంత్రి ఖాన్ హబీబుల్లాఖాన్ సోదర పఠాన్ జాతీయుడని పేర్కొంటూ కాందిశీకుల సమస్య పరిష్కారానికి తోడ్పడవలసిందిగా శ్రీ ఖన్నా ఆయనకు విజ్ఞప్తి చేశారు.

శ్రీ కామరాజ్ కారుకు ముందు వెడుతున్న పైలట్ వ్యాన్ బోల్తా

కొత్తగూడెం సమీపంలో

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

భద్రాచలం, ఏప్రిల్ 6—రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి. కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్, శ్రీ సంజీవరెడ్డి ప్రభృతులు ప్రయాణం చేస్తున్న కారుకు ముందు వెడుతున్న పైలట్ కారు తల్లాడ, కొత్తగూడెంల మధ్య నేటి సాయంత్రం బోల్తా పడింది, పైలట్ కారులో వున్నవారు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కొత్తగూడెం ఆసుపత్రిలో చేర్పారు,

భారతీయ జాలర్లపై సింహళం నౌకాదళం కాల్పులు

భారత ప్రభుత్వం ఆందోళన తెలిపినట్టు లోకసభలో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6—మార్చి 20వ తేదీన రామేశ్వరానికి దూరంగా భారతీయ జాలరుల బృందంపై సింహళం నౌకా దళానికి చెందిన లాంచి కాల్పులు జరిపిన సంఘటనపై భారత ప్రభుత్వం తన వ్యాకులతను వ్యక్తం చేసిందని విదేశాంగ వ్యవహారాల శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ దినేష్‌సింగ్ నేడు లోకసభలో చెప్పారు.

ఈ విషయం సింహళ ప్రభుత్వానికి తెలియజేయ బడినట్టుకూడా ఆయన తెలిపారు.

ఒక సభ్యుని కాల్ అటెన్షన్ నోటీసుకు సమాధాన మిస్తూ శ్రీ దినేష్ సింగ్ పై ప్రకటన చేశారు.

జాలరులు భారతీయ భూభాగంలోనే వున్నారని అనవసరంగా వారిపై కాల్పులు జరిగినవన్న విషయం వాస్తవం కాదా: అని సభ్యుడు ప్రశ్నించాడు,

ఈ సంఘటనకు సంబంధించిన వివరాలన్ని మద్రాసు ప్రభుత్వం నుంచి తనకు అందినవని, మద్రాసు ప్రభుత్వం ఈ విషయమై దర్యాప్తు జరుపుతున్నదని శ్రీ దినేష్ సింగ్ చెప్పారు.

దీనిపై ఇంకా సమాచారం అందినపుడు సభవారికి తెలుపవచ్చునని స్పీకర్ ప్రకటించారు.

భారత గస్తీ దళంపై పాక్ కాల్పులు

జమ్ము నుంచి వచ్చిన వార్త నిజం కాదని శ్రీ చావన్ వెల్లడి

న్యూఢిల్లీ: ఏప్రిల్ 6— ఏప్రిల్ 2వ తేదీన పాకిస్తాన్ దళాలు జమ్ముకు పశ్చిమంగా 50మైళ్ళ దూరంలోవున్న మోలె గ్రామం వద్ద భారతీయ గస్తీ దళంపై కాల్పులు జరిపినవని, ఇద్దరు వ్యక్తులు మరణించారని జమ్ము నుంచి వచ్చిన వార్త సరియైనది కాదని రక్షణ మంత్రి శ్రీ వై. బి. చావన్ నేడు ప్రకటించారు.

అటువంటి సంఘటన అసలు జరుగలేదని ఆయన చెప్పారు,

నేడు లోకసభలో ఈ కాల్పుల సంఘటనపై. వాయిదా తీర్మానం ప్రతిపాదనకు శ్రీ హెచ్. వి. కామత్‌కు అనుమతి ఇచ్చే విషయంలో అభ్యంతరం చెబుతూ శ్రీ చావన్ పైవిధంగా ప్రకటించారు.

అంతకుముందు స్పీకర్ శ్రీ హుకుంసింగ్ మాట్లాడుతూ, జమ్ము సమీప గ్రామంలో కాల్పుల సంఘటనపై వాయిదా తీర్మానానికి అనుమతించవలసిందిగా కోరుతూ శ్రీ కామత్ నుంచి నోటీసు వచ్చిందని ప్రకటించి. ఈ తీర్మానంపై సభవారి అనుమతి కోరవలసిందిగా శ్రీ కామత్‌కు సూచించారు.

శ్రీ కామత్ ఈ తీర్మానం చదవగానే, ఈ వార్త అసత్యమని శ్రీ చావన్ తెలిపారు.

ఆఫ్రో-ఆసియన్ రాజ్యాల మహాసభ సన్నాహక సమావేశం

19 దేశాలు పాల్గొన గలవట

జకర్తా, ఏప్రిల్ 6 — ఏప్రిల్ 10వ తేదీన ప్రారంభం కావలసివున్న ఆఫ్రో-ఆసియన్ రాజ్యాల మహాసభ సన్నాహక సమావేశంలో 19 ఆఫ్రో-ఆసియన్ దేశాలు పాల్గొన గలవని ఇండొనేసియా ఉప విదేశాంగ మంత్రి సువిటో కుసుమోవిడాగ్నో నిన్న ఇక్కడ వెల్లడించారు.

మహాసభలో ఇంకా ఎక్కువ దేశాలు పాల్గొనగలవని భావిస్తున్నామని ఆయన చెప్పారు.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితిలో ఈ ఏడాదే ఆఫ్రో-ఆసియన్ రాజ్యాల మహాసభను ఏర్పాటు చేయడం అవసరమని ఆయన అన్నారు.

అంతర్జాతీయ శాంతి పరిరక్షణకు ఇతరత్రా జరుగుతున్న కృషిని వ్యతిరేకించే ఉద్దేశంతోనే ఈ మహాసభ జరుగుతున్నదన్న విదేశీ ఆరోపణలను ఆయన ఖండించారు.

బస్తర్ జిల్లాలో వీరవిహారంచేసి ప్రజలను భయోత్పత్తులను చేస్తున్న నాలుగు పెద్దపులులను వధించడానికిగాను మధ్యప్రదేశ్ పోలీస్ సిబ్బందికి చెందిన ఎనిమిది మంది అయిదవ తేదీ నుంచి గాలింపు ప్రారంభించినట్టు రాయపూర్ వార్త.

“భూటాన్ ప్రధాని మృతి దిగ్భ్రాంతి కలిగించింది”

ఆయన భారత ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న వ్యక్తి అని రాష్ట్రపతి జోహార్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6—

భూటాన్ ప్రధాని జిగ్మీ డోర్జీ దారుణ హత్య వార్త తనకు దిగ్భ్రాంతిని కలుగజేసిందని, ఆయన తన ఉత్తమ వ్యక్తిత్వం ద్వారా భారత ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న వ్యక్తి అని రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ నేడు జోహార్లర్పించారు.

డాక్టర్ రాధాకృష్ణన్ నేడు శ్రీమతి డోర్జీకి ఒక సంతాప సందేశాన్ని పంపుతూ ఆమెకు, వారి పిల్లలకు తన సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రధాని నెహ్రూ సంతాపం

ప్రధాని నెహ్రూ నేడు లోకసభలో ఒక ప్రకటనచేస్తూ భూటాన్ ప్రధాని హత్య వార్త చాల సంతాపాన్ని, దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు.

శ్రీ డోర్జీ భూటాన్‌లో ప్రముఖ [illegible] వేత్త అని, మనకు [illegible] వని. ఆయన ఆకస్మిక మరణ వార్త మనకు అత్యంత విషాదాన్ని కలిగించిందని ఆయన చెప్పారు.

శ్రీ డోర్జీ జీవిత విశేషాలు

శ్రీ డోర్జీ 1919 లో జన్మించారు. ఆయన డార్జిలింగ్ స్కూలులో విద్యాభ్యాసం చేశారు. ఆయన తండ్రి కొంతకాలం భూటాన్ ప్రధాని పదవిలో వుండి మరణించిన అనంతరం డోర్జీ ఆ స్థానాన్ని అలంకరించారు.

ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు వున్నారు. ప్రస్తుత భూటాన్ రాజు [illegible] సతీమణి డోర్జీ సోదరి,

శ్రీ డోర్జీ భూటాన్ ప్రధానిగా వుండి భారత ప్రభుత్వంతో ఆర్థిక ఒప్పందాలు కుదుర్చుకొని భూటాన్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు.

ఆయన భారత దేశానికి మంచి మిత్రుడు. చాలా పర్యాయాలు న్యూఢిల్లీ సందర్శించారు. చైనా దురాక్రమణ సందర్భంలో ఇండియాను గట్టిగా బలపరచారు.

భూటాన్ ప్రభుత్వ సలహాదారు [illegible] పయనం

కలకత్తా, ఏప్రిల్ 6—భూటాన్ ప్రభుత్వ సలహాదారు శ్రీ ఎస్. డి. [illegible] నేడిక్కడ నుంచి భూటాన్‌లోని ఫుంట్సోలింగ్ పయనమై వెళ్ళారు. భూటాన్ ప్రధాని డోర్జీ నిన్న ఈ పట్టణంలో హత్య చేయబడ్డారు.

ప్రస్తుతం జూరిచ్‌లో వున్న భూటాన్ మహారాజు ఏప్రిల్ 13వ తేదీన కలకత్తావచ్చి అక్కడి నుంచి భూటాన్ వెళ్లగలరని ఇక్కడ తెలియవచ్చింది.

బ్రిటన్‌లో చదువుకొంటున్న డోర్జీ పెద్ద కుమారుడు కూడా స్వగృహానికి బయలుదేరారు.

అమ్మకము
గుంటూరు
కేంద్ర ప్రాంతంలో
భవనాలకు
మంచి స్థలాలు
ఇతర వివరములకు :—
మెసర్స్. సౌత్ ఇండియా
మర్కంటైల్స్ (ప్రై) లిమిటెడ్,
బండ్ల బజార్, గుంటూరు-1.
వారిని సంప్రదించండి.

1964 ఏప్రిల్ 7 మంగళవారం
శ్రీ క్రోధినామ సంవత్సర
అధిక చైత్ర బహుళ దశమి
దశమి : రా॥ 2-20
శ్రావణం : రా॥ 11-43
వర్జ్యం : రా॥ 3-51 నుంచి 5-23 వరకు

1964 ఏప్రిల్ 8 బుధవారం
శ్రీ క్రోధినామ సంవత్సర
అధిక చైత్ర బహుళ ఏకాదశి
ఏకాదశి : రా॥ 2-09
ధనిష్ఠ : రా॥ 12-19
వర్జ్యం : లేదు

ఆంధ్రజ్యోతి

"తమసో మా జ్యోతిర్గమయ"

చైనా విధానాలు

రష్యా, చైనాల మధ్య విభేదాలు ఇక ఎన్నటికి— బహుశా ఆ రెంటిలో ఏదో ఒక దేశంలో ప్రస్తుత నాయకత్వం పూర్తిగా మారిపోతే తప్ప—పరిష్కారం కాబోవు. సోవియెట్ నాయకులేమి, పత్రికలేమి ఇటీవల చేస్తున్న ప్రకటనలీ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. ఆ రెండు దేశాల మధ్య ఏర్పడిన అగాథం ఎంతగా పూడ్చరానిదో ప్రపంచానికి తెలియజెప్పడానికే, గడచిన ఫిబ్రవరిలో సోవియెట్ కమ్యూనిస్టు నాయకుడు మైకేల్ సుస్లోవ్ చేసిన ప్రసంగాన్ని "ప్రావ్దా" ఇప్పుడు ప్రచురించింది.

చైనాపై సుస్లోవ్ చేసిన విమర్శలో కొత్త విశేషమేమీ లేకపోవచ్చు. కాని, ఇండియా-చైనా సరిహద్దు యుద్ధంపట్ల సోవియెట్ దృక్పథాన్ని అది పూర్వంకంటె స్పష్టంగా, ఖచ్చితంగా ప్రతిబింబిస్తుండడం మనం ప్రత్యేకంగా గమనించదగింది. ఈ వివాదం సందర్భంలో రష్యా చైనాను మందలించినట్టు మనకు తెలిసినదేగాని, ఇంత నిర్మొగమాటంగా అది చైనా విధానాన్ని ఖండిస్తున్నట్టుగాని, ఇంత స్పష్టంగా ఇండియా వాదాన్ని సమర్థిస్తున్నట్టుగాని తెలియదు. హిమాలయాలలో కొన్ని శతాబ్దాలనుంచి వివాదరహితంగావున్న భూభాగాల కోసం ఇండియాతో యుద్ధానికి దిగినందుకు అది చైనాను తీవ్రంగా విమర్శించింది.

ఇదేవిధంగా పాకిస్తాన్‌తో చైనా చెలిమి చేయడాన్నికూడా సుస్లోవ్ గర్హించడం గమనించదగింది. ఇరుగు పొరుగునున్న రెండు దేశాలు స్నేహ సంబంధాలేర్పరచుకొనడంలో తప్పులేదు. కాని ఆ స్నేహం మరొక పొరుగు దేశానికి వ్యతిరేకంగా ఉద్దేశించినదైతే అది ఎంతైనా గర్హించదగిందే. కమ్యూనిస్టు వ్యతిరేక కూటాలలో సభ్యదేశమైన పాకిస్తాన్‌తో చైనా స్నేహం చేయడం ఇండియా పట్ల ద్వేషంతోనే ననడంలో సందేహంలేదు. ఒకవంక అమెరికాతో రష్యా పొత్తు కుదుర్చుకొంటున్నదని విమర్శిస్తూ, తాను అమెరికాకు సైనికంగా మిత్రరాజ్యమైన పాకిస్తాన్‌తో పొత్తు కుదుర్చుకొనడానికి ఇండియా పట్ల కక్ష సాధించాలన్న కోరికే తప్ప మరొక కారణం లేదు.

ఇండియా-చైనా వివాదానికి సంబంధించినంతవరకు తటస్థంగా వుండిపోయిన కొన్ని ఆఫ్రో-ఆసియన్ దేశాలకు మొన్న రష్యా చేసిన ప్రకటన కనువిప్పు కాగలదనే ఆశించవచ్చు. చైనాతో బహిరంగంగా వివాదం పెట్టుకొనడం ఇష్టంలేకనైతేనేమి, యథార్థం తెలియకపోవడంవల్లనైతేనేమి, ఈ దేశాలలో కొన్ని తటస్థంగా వుండిపోయాయి. వీటి తటస్థ వైఖరి చైనా దుందుడుకుతనాన్ని పరోక్షంగా ప్రోత్సహించినట్టే అయింది. వివాదానికి ప్రధాన కారణం చైనా దురాక్రమణ విధానమేనని రష్యా విమర్శ చేసిన తరువాతనైనా ఈ దేశాలు నిజాన్ని గ్రహించగలిగితే మంచిదే.

చైనా, పాకిస్తాన్‌లు కొత్తగా కుదుర్చుకున్న మైత్రిని ఇంతవరకు బహిరంగంగా ఖండించకపోవడాన్నిబట్టి, అది నిరపాయకరమనే అమెరికా భావిస్తున్నట్టు కనబడుతుంది. కాని, ఆ మైత్రి ఇండియాకు వ్యతిరేకంగా ఉద్దేశించినదేనని రష్యా గ్రహించినంత మాత్రమైనా అమెరికా గ్రహించకపోవడం శోచనీయం. అంతేకాదు, కాశ్మీర్ వంటి విషయాలలో పాకిస్తాన్‌ను సమర్థించడంద్వారా అది ఆ మైత్రిని పరోక్షంగా ప్రోత్సహించడం ఎంతైనా విచారించదగింది.

"షేక్ అబ్దుల్లా విడుదల అనివార్యం"

శ్రీ పీటర్ అల్వారిస్ వివరణ

అమృతసర్, ఏప్రిల్ 6— పార్లమెంటు సభ్యుడు శ్రీ పీటర్ అల్వారిస్ నిన్న ఇక్కడొక పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రస్తుత విధానం దృష్ట్యా షేక్ అబ్దుల్లాను విడుదల చేయడం అనివార్యమని అన్నారు.

ఇండియాలో కాశ్మీర్ విలీనీకరణ జరిగే విషయంలో షేక్ అబ్దుల్లా తోడ్పడగలరన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు.

కాశ్మీర్ సమస్య పాకిస్తాన్ సంబంధాలతో ముడిపడి వున్నందువల్ల, మత సామరస్య సాధనకు, భారత రాజ్యాంగంలో పేర్కొన్న మత రహిత విధానం పరిరక్షణకు అనుకూల వాతావరణాన్ని సృజింపచేయవలసి వున్నదని శ్రీ అల్వారిస్ వివరించారు.

స్వతంత్ర పార్టీ నాయకుడు శ్రీ మసానీ హర్షం

బొంబాయి, ఏప్రిల్ 6—షేక్ అబ్దుల్లాను విడుదల చేయాలన్న కాశ్మీర్ ప్రభుత్వం నిర్ణయం పట్ల స్వతంత్ర పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. ఆర్. మసానీ నిన్న హర్షం వ్యక్తం చేస్తూ కొత్త ఎన్నికల ద్వారా నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకొనడానికి కాశ్మీర్ ప్రజలకు అవకాశం ఇవ్వాలని అన్నారు.

బొంబాయి ప్రాంతం స్వతంత్ర పార్టీ ప్రథమ మహాసభలో శ్రీ మసానీ మాట్లాడుతూ షేక్ అబ్దుల్లా విడుదలపై కాశ్మీర్ విషయంలో అవలంబించిన ఉత్తమ విధానానికి ప్రాథమిక చర్య కాగలదని అన్నారు.

రెండవ చర్య క్రింద ప్రజలు తాము కోరే ప్రభుత్వాన్ని ఎన్నుకొనడానికి వీలుగా కొన్ని మాసాల అనంతరం తిరిగి ఎన్నికలు జరపాలని ఆయన సూచించారు.

ఈ విధానంవల్ల కాశ్మీర్ వివాదం సక్రమంగా పరిష్కారమై పాకిస్తాన్‌తో మైత్రీ సంబంధాల స్థాపనకు తోడ్పడగలదని ఆయన చెప్పారు.

మహారాణి గాయత్రీదేవి ఈ మహాసభకు ప్రారంభోత్సవంచేస్తూ, స్వతంత్ర పార్టీ సందేశాన్ని గ్రామీణ ప్రజలకు అందజేయవలసిందిగా కార్యకర్తలను కోరారు.

స్వతంత్ర పార్టీ విధానాన్ని, కార్యక్రమాన్ని ప్రజలకు విడమర్చి చెప్పినట్టయితే వారు దానిని అంగీకరించగలరనడంలో తనకు ఎట్టి సందేహం లేదని ఆమె అన్నారు.

గ్రామీణ ప్రజల సమర్థనతో మాత్రమే పార్టీకి బలం చేకూరగలదని ఆమె వివరించారు.

బోర్నియోలో యుద్ధ విరమణ

చర్చలకు అనువైన వాతావరణం ఏర్పడగలదని సుకర్నో వివరణ

జకర్తా, ఏప్రిల్ 6— బోర్నియోలో యుద్ధ విరమణవల్ల మలేసియాతో చర్చలను తిరిగి ప్రారంభించి, పరిష్కారాన్ని సాధించడానికి అనువైన వాతావరణం నెలకొనగలదని ప్రెసిడెంట్ సుకర్నో మొన్న ఇక్కడ చెప్పారు.

ఇండొనేసియా ఉన్నతాధికార సంఘం సమావేశంలో శ్రీ సుకర్నో మాట్లాడుతూ, యుద్ధ విరమణ అంటే మొదట కాల్పులు, పోరాటం ముగియాలని, ఎవరి స్థానాలలో వారు వుండాలని అన్నారు.

ప్రస్తుతం ఇండొనేసియాలో పర్యటిస్తున్న థాయ్ సైనిక ప్రతినిధి వర్గం సంఘం సభ్యులతో చర్చలు జరిపింది.

భారత ఉపఖండం విభజనవల్ల ఫలితం

మత విభేదాలు తొలగక పోగా మరింత హాని చేకూరినదని శ్రీ జయప్రకాశ్ వివరణ

చయిబాసా (బీహార్), ఏప్రిల్ 6—

భారత ఉపఖండం విభజన ఇండో-పాక్ సమస్యలను పరిష్కరింపలేకపోయిందని గత 17 సంవత్సరాలనుంచి జరిగిన సంఘటనలు రుజువు చేసినవని సర్వోదయ నాయకుడు శ్రీ జయప్రకాశ్ నారాయణ్ మొన్న ఇక్కడొక బహిరంగసభలో పేర్కొన్నారు.

ఈ విభజనవల్ల ఉభయ దేశాల సమస్యలు పరిష్కరింపబడడానికి మారుగా, రెండింటికీ కూడా ఎంతోహాని చేకూరినదని ఆయన అన్నారు.

జాతీయ శ్రేయోభివృద్ధి, శాంతి పరిరక్షణ లక్ష్యంతో ఇండియా, పాకిస్తాన్ దేశాలు రెండు ఒక సమాఖ్యగా ఏర్పడడం ద్వారాగాని, లేక సమష్టి మార్కెట్ ఏర్పరచుకొనడం ద్వారాగాని రాజకీయంగా తిరిగి విలీనం సాధించుకోవడం అవసరమని ఆయన చెప్పారు.

నేటి యువకులమధ్య అంతర్గత కక్షలు, క్రమశిక్షణా రాహిత్యం భారతదేశ సమైక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదని ఆయన చెప్పారు.

కుల, మత, భాషాభేదాలు జాతీయ సమైక్యానికి పరీక్షగా నిలిచినవని, సంఘ వ్యతిరేక శక్తులు ఈ పరిస్థితిని అదనుగా ఉపయోగించుకొంటున్నవని ఆయన అన్నారు.

పాకిస్తాన్‌లోని హిందువులను ఇండియాకు-భారత దేశంలోని ముస్లింలను పాకిస్తాన్‌కు మార్పిడి చేయాలన్న కోర్కెను ఆయన వ్యతిరేకిస్తూ, ఎక్కువ మంది ముస్లింలు కల కాశ్మీర్‌కు ఈ సూత్రం ఏ విధంగా వర్తిస్తుందని ప్రశ్నించారు.

ఇటీవల సంభవించిన మత కలహాలు ఆత్మహత్యా సదృశ్యమని ఆయన పేర్కొంటూ, వీటిపట్ల తన విచారాన్ని వ్యక్తం చేశారు.

భారతదేశం పూర్వ ఔన్నత్యాన్ని శ్రీ జయప్రకాశ్ ప్రస్తావిస్తూ, ఇది రామకృష్ణ పరమహంస, వివేకానంద, టాగోర్‌వంటి మహానుభావుల జన్మభూమి అని, ఈ ఔన్నత్యాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి భారతీయునిపై కలదని అన్నారు.

భారత పౌరులు తమ బాధ్యతలను గుర్తించి అత్యంత ప్రయాసతో సంపాదించుకొన్న స్వాతంత్ర్య పరిరక్షణకు త్యాగాలు చేయాలని ఆయన ఉద్బోధించారు.

విచ్ఛిన్నకర శక్తులతో నిరంతర పోరాటం సాగించి, అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ప్రజలలో విశ్వాసాన్ని ప్రోదిచేయాలని ఆయన కోరారు.

అరాచకానికి పాల్పడే శక్తులను అరికట్టనిదే దేశానికి భవిష్యత్తులేదని ఆయన హెచ్చరించారు.

సంఘ వ్యతిరేక శక్తులతో చేతులు కలపవద్దని, శాంతిదళంలో చేరవలసిందని ఆయన ప్రజలను కోరారు.

ఆచార్య వినోబా భావేతో సమావేశం జరిపిన అనంతరం నాగపూర్‌నుంచి ఇక్కడకు వచ్చిన శ్రీ జయప్రకాశ్ నారాయణ్ మొన్న సాయంకాలం జమ్‌షెడ్‌పూర్ వెళ్లారు.

వినోబాజీతో శ్రీ జయప్రకాశ్ చర్చలు

వార్ధాగంజ్, ఏప్రిల్ 6—ప్లానింగ్ కమిషన్ సభ్యుడు శ్రీ జయప్రకాశ్ నారాయణ్ నిన్న ఉదయం ఇక్కడ ఆచార్య వినోబా భావేతో సమావేశం జరిపారు.

కాశ్మీర్ సమస్యతోసహా దేశంలో మొత్తం పరిస్థితిని గురించి వారు చర్చించినట్టు తెలుస్తున్నది.

ఈ చర్చల సందర్భంలో ఆచార్య వినోబా భావే వ్యక్తంచేసిన అభిప్రాయాలను శ్రీ జయప్రకాశ్ ప్రధాని నెహ్రూకు తెలియ పరచగలరని తెలుస్తున్నది.

మైనారిటీల పట్ల పాక్ ప్రభుత్వం వైఖరి: భారత కేథలిక్ సంఘం విమర్శ

మద్రాసు, ఏప్రిల్ 6—భారతీయ కేథలిక్ సంఘం నిన్న ఇక్కడ సమావేశమై క్రైస్తవులతో సహా తూర్పు పాకిస్తాన్‌లోని మైనారిటీల పట్ల అవలంబిస్తున్న అమానుష వైఖరిపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

తూర్పు పాకిస్తాన్ ప్రభుత్వం ప్రవర్తన అక్కడి మైనారిటీలను వెళ్ళగొట్టడానికి చేసే ప్రయత్నంగా వున్నదని ఈ సంఘం ఒక తీర్మానంలో పేర్కొన్నది.

అక్కడి అల్ప సంఖ్యాక వర్గాల వారందరికి పూర్తి రక్షణ కల్పించేటట్టు చర్యలు తీసుకోవాలని పాక్ ప్రభుత్వానికి ఈ సంఘం విజ్ఞప్తి చేసింది.

ఈ సమావేశంలో తీర్మానాన్ని ప్రతిపాదించిన రాజ్యసభ సభ్యుడు శ్రీ రత్నస్వామి పాకిస్తాన్‌లో పరిస్థితులను సహించలేక 50 వేల మంది క్రైస్తవులతో సహా అసంఖ్యాకులుగా అల్పసంఖ్యాక వర్గాలవారు వలసవచ్చి చేరారని చెప్పారు.

వారి ఆస్తులు స్వాధీనం చేసుకొనబడినవని పిల్లలు, స్త్రీలను కూడా అక్కడివారు తీవ్రంగా హింసించారని, ఈ ప్రవర్తన దిగ్భ్రాంతి కలిగించినదని, ఏ నాగరిక ప్రభుత్వం అయినా దీనికి సిగ్గుపడుతుందని ఆయన అన్నారు.

తూర్పు పాకిస్తాన్ నుంచి వచ్చిన క్రైస్తవ శరణార్థులకు సహాయం నిమిత్తం నిధుల వసూలులో తోడ్పడవలసిందిగా క్రైస్తవ సంఘాలకు, ముఖ్యంగా కేథలిక్ సంఘాలకు ఈ సభ విజ్ఞప్తి చేసింది.

శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6— జనసంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ నిన్న ఇక్కడొక ప్రకటన చేస్తూ, శ్రీ నందా పాక్ హోం మంత్రితో సమావేశం జరిపే సందర్భంలో, పాకిస్తాన్‌పై విజయం సాధించాలనే ఆతురతతో మన న్యాయమైన కోర్కెలను విడనాడరాదని అన్నారు.

తూర్పు పాకిస్తాన్‌లో మత కలహాలకు గురియైన బాధితులకు నష్ట పరిహారం ఇచ్చేటట్టు, పునరావాసపు ఖర్చును పాకిస్తాన్ భరించేటట్టు, అహింసాకాండలకు బాధ్యులైన వారిని శిక్షించేటట్టు పాకిస్తాన్‌ను భారత ప్రభుత్వం ఒత్తిడి చేయాలని ఆయన సూచించారు.

ఇండియాకు అక్రమంగా వలస వచ్చిన పాక్ పౌరులను, వారి దేశం పంపించివేసే సమస్య పూర్తిగా పేరుకనక, దానిని గురించి ఈ సమావేశంలో చర్చించవలసిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

పాలెస్తీనా పోరాటానికి అల్జీరియా మద్దతు

తమ నిర్ణయాన్ని ఎవరూ మార్చలేరని ప్రెసిడెంట్ బెన్‌బెల్లా ప్రకటన

అల్జీర్స్, ఏప్రిల్ 6— అరబ్ పాలెస్తీనా పోరాటాన్ని బలపరచాలన్న తమ నిర్ణయాన్ని ప్రపంచంలోని ఏ శక్తి - అది జాన్సన్ ప్రకటన అయినా లేక అటంబాంబులయినా - మార్చజాలవని అల్జీరియా ప్రెసిడెంట్ అహ్మద్ బెన్‌బెల్లా నిన్న ప్రకటించారు.

అల్జీరియా "వృక్ష దినోత్సవం" సందర్భంగా ఇక్కడకు 30 మైళ్ళ దూరంలోవున్న లా ఆర్బాచ్ దగ్గర జరిగిన ఒక సభలో ప్రెసిడెంట్ బెన్ బెల్లా ప్రసంగిస్తూ, అంగోలా, మొజాంబిక్, తదితర దేశాల వలంటీర్లు ఈ దేశంలో శిక్షణ పొందుతున్నారని ఆయా దేశాల విముక్తి సాధన ఉద్దేశంతో ఇది జరుగుతున్నదని చెప్పారు.

మే లో రష్యా పర్యటన

మే నెలలో తాను రష్యాను సందర్శించగలనని, బల్గేరియా, చెకొస్లొవాకియాలలో కూడా పర్యటించగలనని ఆయన తెలియజేశారు.

టునీసియా ప్రెసిడెంట్ బోర్గ్విబా మాలికి చెందిన శ్రీ మొడిబొకెయిటా అరబ్ రిపబ్లిక్ ప్రెసిడెంట్ నాసర్‌లు ఈ ఏడాది అల్జీరియాలో పర్యటించగలరని ఆయన అన్నారు.

బడుగు దేశాలకు బ్రిటన్ సహాయం

జెనీవా వాణిజ్య మహాసభలో శ్రీ హీత్ ఒక ప్రకటన చేసే సూచన

జెనీవా, ఏప్రిల్ 6— ప్రపంచ వాణిజ్య అభివృద్ధి మహాసభ రెండవ వారంలో ప్రవేశించింది.

మహాసభలో జరుగుతున్న చర్చలో పాల్గొనే అఖరి ధనిక, పారిశ్రామిక దేశమయిన బ్రిటన్ బడుగు దేశాలకు వాణిజ్యం, ఆర్థిక సహాయం రూపంలో తాను చేయగల సహాయాన్నిగురించి వివరించగలదనిభావిస్తున్నారు.

బ్రిటిష్ ప్రతినిధి శ్రీ ఎడ్వర్డ్ హీత్ ఇక్కడకు వచ్చేవరకు బ్రిటిష్ ప్రతినిధివర్గం వేచిచూచే విధానాన్ని అవలంబించింది.

శ్రీ హీత్ మొన్న శుక్రవారంనాడు జెనీవా చేరుకున్నాడు. గత రెండు రోజులలోను ఆయన పెక్కు పాశ్చాత్య దేశాల ప్రతినిధి వర్గాల నాయకులను కలుసుకొని చర్చలు జరిపారు.

బ్రిటన్‌లో ఈ ఏడాది ఎన్నికలు జరుగనున్నందువల్ల, లండన్‌లో జరిగిన కామన్వెల్తు రాజ్యాల వాణిజ్య మహాసభలో కుదిరిన ఒప్పందం దృష్ట్యా 90 బడుగు దేశాలను, బ్రిటిష్ ఓటర్లను సంతృప్తిపరిచే విధంగా శ్రీ హీత్ ఉదారమైన ప్రకటన చేయగలరని అనుకొంటున్నారు.

మదురైలో స్కూల్ భవనం కూలిన సంఘటనపై దర్యాప్తు

జిల్లా కలెక్టర్ ఉత్తర్వు

మదురై, ఏప్రిల్ 6— మదురైలో పాఠశాల భవనం కూలిపోయిన సంఘటనను గురించి దర్యాప్తు జరపవలసిందిగా రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్‌కు జిల్లా కలెక్టరు ఉత్తర్వు జారీ చేశారు.

ఈ నెల 4 వ తేదీన జరిగిన ఈ సంఘటనలో 33 మంది విద్యార్థినులు, ఇద్దరు ఉపాధ్యాయులు మరణించారు. మరి 137 మంది గాయపడ్డారు.

ఈ సందర్భంలో ఒక నివేదిక అందజేయవలసిందిగా పి. డబ్లు. డి. ఇంజినీర్‌ను కూడా తాను కోరినట్టు జిల్లా కలెక్టర్ పత్రికల వారికి చెప్పారు.

మృతుల సంఖ్య 36 మాత్రమేనట

మొన్న ఇక్కడ పాఠశాల భవనం కూలిపోయిన సంఘటనలో మరణించినవారిసంఖ్య 36 మాత్రమేనని ఎర్స్కిన్ ప్రభుత్వ ఆసుపత్రి అధికారుల లెక్కలవల్ల తెలుస్తున్నది.

ఈ సంఘటనలో గాయపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారి సంఖ్య 86 అనికూడా తెలుస్తున్నది.

విశాఖ జిల్లాలో గ్రామ స్వరాజ్య పక్షం

బుడతనపల్లి, ఏప్రిల్ 6—విశాఖ జిల్లా సర్వోదయ మండలి సంయోజకులైన శ్రీ ఆర్. బైరాగి, మరి కొందరు కార్యకర్తలు ఏప్రిల్ ఆరవ తేదీ నుంచి 18 వ తేదీ వరకు విశాఖ జిల్లాలో గ్రామ స్వరాజ్య పక్షం సందర్భంలో పర్యటిస్తారు.

గ్రామ పంచాయతీల అధ్యక్షులు, సమితి అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు, జిల్లాలోని ప్రజలు, ఉద్యోగులు సహకరించి ఈ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని శ్రీ బైరాగి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎవరి సహాయం లేకుండా సోషలిజం నిర్మాణం

సాధ్యమని నిరూపణకు ప్రయత్నించేవారు పరమ మూర్ఖులని ప్రధాని కృశ్చేవ్ విమర్శ

స్టాలినిజం పునరుద్ధరణ ఎవరితరం కాదని ప్రకటన

మిస్కోల్క్ (ఈశాన్య హంగేరీ), ఏప్రిల్ 6— సోషలిస్టు పంథాను చేబట్టి అనుభవం సంపాదించిన దేశాల, ప్రజల సానుభూతి, సహకారాలతో నిమిత్తం లేకుండా సోషలిజాన్ని నిర్మించడం తేలికని నిరూపించడానికి ప్రయత్నించడం కేవలం మూఢత్వమని ప్రధాని కృశ్చేవ్ నిన్న ఇక్కడ ప్రకటించారు.

పెకింగ్ ఇటీవల తనపై చేసిన వ్యక్తిగత విమర్శకు శ్రీ కృశ్చేవ్ పరోక్షంగా యిచ్చిన మొదటి సమాధానమిదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

80 వేల మంది ప్రజలు హాజరయిన బహిరంగ సభలో శ్రీ కృశ్చేవ్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యను చేశారు.

స్టాలిన్ మృత దేహానికి తిరిగి జీవం పోయాలని తలంచే వారిని, మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాలపై ఆధారపడదలచుకోని వారిని, ప్రజల మైత్రిలో విశ్వాసం లేని వారిని, ఆయుధాలపై ఆధారపడే వారిని గురించి ఆయన ప్రస్తావించారు.

సోవియెట్ ప్రధాని, ఆయన బృందం, హంగరీ ప్రధాని శ్రీ జానోస్ కాదర్‌తో కలిసి ప్రత్యేక రైలులో నిన్న ఇక్కడకు వచ్చారు.

రైలు మార్గం పొడవునా సబ్-మెషిన్‌గన్‌లను ధరించిన వందలాది సైనికులు రైలు ప్రయాణం చేయడానికి కొన్నిగంటల ముందు నుంచి కాపలా కాశారు.

శ్రీ కృశ్చేవ్ ప్రయాణం చేసిన రైలుకు పదినిమిషాల ముందుగా సెక్యూరిటీ రైలు ఒకటి ఇక్కడకు వచ్చింది.

హంగరీ కమ్యూనిస్టు పార్టీ స్థానిక శాఖవారు ఏర్పాటు చేసిన సభలో శ్రీ కృశ్చేవ్ మాట్లాడుతూ, చైనీయులు రష్యాలోనే తనపై వ్యతిరేకప్రచారాన్నిజరుపుతున్నారని, ఈసందర్భంలో వారు కొత్త కొత్త ఆరోపణలను కనుకొన్నారని, ఇందుకు తానెంతో గర్వపడుతున్నానని అన్నారు.

స్టాలిన్ హయాంలో పొరపాట్లు జరిగినప్పటికీ తమ దేశం అపూర్వమైన అభివృద్ధిని సాధించిందని ఆయన చెప్పారు.

ఆర్థిక పురోగతిని సాధించడంవల్ల, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంవల్ల బూర్జువా మనస్తత్వం అలవడగలదని కొందరు వాదిస్తున్నారని, అయితే తమ ప్రజలు చక్కగా జీవిస్తున్నారని, వారి జీవన పరిస్థితిని మెరుగుపరచడం కోసమే విప్లవాన్ని తీసికొని వచ్చామని ఆయన వివరించారు.

చనిపోయిన మనిషి దేహాన్ని ఇంటి ముందుకు తీసికొని రావడం ఆచారమని, ఎందువల్లనంటే ఆ వ్యక్తి మరల తిరిగి రాలేడని, అలాగే స్టాలిన్‌ను మన మధ్య నుంచి తొలగించివేశామని, అయనను ఎవరూ తిరిగి తీసికొని రాలేరని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

చైనాపై ప్రావదా విమర్శ కొనసాగింపు

మాస్కో, ఏప్రిల్ 6—శ్రీ నికిటాకృశ్చేవ్ అవలంబిస్తున్న వైఖరికి సోవియెట్ ప్రజల నుంచి పూర్తి మద్దతు లభించే నిమిత్తం రష్యన్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక ప్రావదా ఒక ప్రచారాన్ని ప్రారంభించింది.

చైనీస్ నాయకుల ధోరణిని ఖండిస్తూ పార్టీ కార్యదర్శి మైఖేల్‌సుస్లోవ్ చేసిన 30 వేల పదాల ప్రసంగం పూర్తి పాఠాన్ని ప్రావదా మొన్న శుక్రవారం నాడు ప్రచురించింది.

చైనీస్ నాయకుల విచ్ఛిన్నకర కార్యకలాపాలకు రష్యాలోని కమ్యూనిస్టులతోసహా పార్టీతో సంబంధం లేని కార్మికులు కూడా కోపోద్రిక్తులుగా వుంటున్నారని పత్రిక నిన్న ఒక సంపాదకీయాన్ని వ్రాసింది.

సోవియెట్ దేశంపైన, సోవియెట్ కమ్యూనిస్టుపార్టీపైన చైనా చేస్తున్న దుష్ప్రచారాన్ని రష్యాలోని అన్ని వర్గాల ప్రజలు నిరసిస్తున్నారని ప్రావదా పేర్కొన్నది.

కృశ్చేవ్ నాయకత్వానగల కేంద్ర సమితిని పార్టీ లెనినిస్టు భావాలను ప్రజలు పూర్తిగా అంగీకరిస్తున్నారని పత్రిక తెలిపింది.

చైనీయులను విమర్శిస్తూ 44 మంది ప్రముఖ బోల్షివిక్‌లనుంచి వచ్చిన ఒక లేఖను కూడా పత్రిక ప్రచురించింది.

"చైనీయుల వైఖరిని ఉపేక్షించడం సాధ్యంకాదు"

శ్రీ ఇలిషెవ్ ప్రకటన

కమ్యూనిజం పవిత్ర సిద్ధాంతాలపై తీవ్రమయిన దాడి జరిగినందువల్ల చైనీస్ నాయకుల కార్యకలాపాలపట్ల ప్రస్తుత పరిస్థితిలో ఉపేక్షవహించడం ఎంతమాత్రం సాధ్యంకాదని సోవియెట్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర సమితి కార్యదర్శి శ్రీ లియొనిద్ ఇలిషెవ్ ప్రకటించారు.

పెకింగ్ దుష్ప్రచారాన్ని త్రిప్పికొట్టవలసిన సమయం ఆసన్నమైనదని ఆయన చెప్పారు.

చైనా కమ్యూనిస్టు పార్టీ విద్రోహ వైఖరి

చెకొస్లొవాక్ పార్టీ ఖండన

ప్రేగ్, ఏప్రిల్ 6— చెకొస్లొవేకియా అంతటా గత రెండు రోజులలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సమావేశాలలో చైనా పార్టీ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యతకు భంగం కలిగే విధంగా చైనీస్ నాయకులు బహిరంగం చేస్తున్న విమర్శలను నిరసిస్తూ ఒక ప్రకటన కూడా వెలువడింది. సోవియెట్, చెకొస్లొవాక్ పార్టీలపట్ల చైనా విద్రోహ వైఖరిని అవలంబిస్తున్నదని ప్రకటనలో ఆరోపించారు.

ఇండియాలో కస్టమ్సు అధికారులు కిందటి సంవత్సరం ఫిబ్రవరిలో 17.54 లక్షల విలువగల వస్తువులను స్వాధీనం చేసికొనగా ఈ ఏడాది అదే నెలలో దాదాపు 21.61 లక్షల విలువగల వస్తువులను స్వాధీనం చేసికొన్నట్టు ఏప్రిల్ అయిదవ తేదీన న్యూఢిల్లీలో జారీ చేసిన అధికార ప్రకటన తెలుపుతున్నది.

★★ పుస్తక ప్రపంచం

రెండు తాత్త్విక గ్రంథాలు

విఠలరావు తండ్రివద్ద రామమంత్ర ముపదేశం పొందారు. క్రమంగా ఆయన జీవితంలో పరిణామం వచ్చింది. అనుక్షణం రామనామం జపిస్తూ సాధువుగా ఆసేతుహిమాచల పర్యంతం సంచరించారు. ఎన్నో సంవత్సరాలు తిరిగి దక్షిణ కెనరా చేరుకొన్నారు. జీవిత బంధనాల నుంచి విముక్తినంది, ఈశ్వర దర్శనం పొంది మానవాళికి సేవచేసి వారిలో ఆధ్యాత్మిక చింతనాన్ని రేపడానికి ప్రబోధం కావించారు. కిన్హన్గాడ్ వద్ద ఆనందాశ్రమాన్ని నెలకొల్పారు.

1921 సంవత్సరంలో మాంగలూరులో భగవదనుగ్రహంచేత ఆయనలో పరమేశ్వర సాధనకొరకు తృష్ణ అంకురించింది. దానితో ఆయన జీవితాన్ని పరమేశ్వరునికే అంకితం చేశారు. అందుకొరకాయన పొందిన మొదటి సంవత్సరపు అనుభూతుల నన్నింటిని "ఇన్ క్వెస్ట్ ఆఫ్ గాడ్" అన్న గ్రంథంలో వివరించారు. అదంతా కృత్యాద్యవస్థ వంటిది. ఆ తరువాత ఆయన జీవితమంతా ఈశ్వరుని కంకితమై ప్రశాంతమైపోయింది. అహమన్నది సమూలంగా తుడిచిపెట్టబడింది ఈశ్వరుడే ఆయన కంగరక్ష అయినాడు. ఈ మహత్తర జీవితానుభూతుల కథనమే "ఇన్ ది విజన్ ఆఫ్ గాడ్" అనే గ్రంథం రెండు భాగములలో నిక్షేపింపబడింది. చిన్న చిన్న అంశముల నుంచి స్వామిజీ ఈశ్వర విశ్వాసంతో సర్వమాయన యిచ్చకెలా అర్పణం చేశారో, ఈశ్వరుడాయనను చేయిపట్టుకొని నడిపించినట్టుగా రామదాసు ఎలాభావించారో ఈగ్రంథంలో చాల వివరంగా చెప్పబడింది. ఇందులో తాత్త్విక విషయాల చర్చలేదు. ఈశ్వరుని గూర్చికాని, ఆయన విధానాల గూర్చికాని ప్రజ్ఞాసూచకాలైన ప్రసంగాలు లేవు. ఒకచోట స్వామిజీ అంటారు: "స్నేహితులార, రామదాసు ఈశ్వరుని ఆస్తికతను గూర్చి హేతువాదంచేసి రుజువు చేయలేదు. ఎవరూ చేయలేరు. తన అనుభూతినిబట్టి ఈశ్వరుడున్నాడని ఉద్ఘాటించగలడు. మీకా అనుభూతి కలిగే వరకు సంశయాలుంపుట సహజం. ఒక సమయం వస్తుంది మీకు కూడా ఆ విశ్వాసం కలగడానికి" అని, జీవితంలో ఏది జరిగినా-ఎంతటి చిక్కు వచ్చినా-ఎవరెంతటి మోసం చేసినా అది ఈశ్వర విలాసమని క్షణం తటపటాయించకుండా బద్ధుడైపోవడమే రామదాసు పరమ సాధన. ఇంతా రమారమి 500 పుటలుగల యీ ఆంగ్ల గ్రంథంతో సరళ గంభీరమైన శైలిలో రచింపబడింది. ఈ గ్రంథం నిసర్గ రమణీయమైనది. ఈశ్వరార్పితమైన మహాజీవితమున కిది నిర్మలినమైన దర్పణము వంటిది.

[In the Vision of God
ప్రచురణ : భారతీయ విద్యాభవన్, బొంబాయి, ఒక్కొక్క భాగం వెల రు. 2.50 న.పై.]

వేదాంతం భారతీయ భావనా ప్రపంచంలోనే ప్రధాన స్థానం వహించింది. విభిన్న దృక్పథాల నుంచి వివిధ ప్రవక్తలు వేదాంత విషయ ప్రవచనం గావించారు. శంకర, రామానుజ, మధ్వాచార్యులు ముగ్గురు మూడు మార్గాలు నిర్మించారు. ఈ మూడు మార్గాల సమగ్రావలోకనం వేదాంతమార్గావలంబు లందరికీ అవశ్య కర్తవ్యం. మధ్వాచార్యులు ప్రవచించిన మార్గం "మధ్వాస్ టీచింగ్స్ ఇన్ హిజ్ ఓన్ వర్డ్స్" అనే ఈ గ్రంథంలో వారి మాటలలోనే విస్పష్ట పరుప బడింది.

శంకరులు, రామానుజులు వేదాంత విషయంపైని తమ తమ వ్యాఖ్యానాలు చేసి తమ సిద్ధాంతాలను సుప్రతిష్ఠం చేసిన తర్వాత మధ్వాచారు లీరంగం మీద అవతరించారు. వీరికి మూల గ్రంథాలమీద వారు చేసిన వ్యాఖ్యానాలు సంతృప్తి కలిగించలేదు. దానితో మధ్వాచార్యులు స్వతంత్రంగా తామొక మార్గాన్ని ప్రవచించారు.

ఏ ప్రవక్తపైనైనా కాల ప్రభావం ఉంటుంది. మధ్వాచార్యులు జన్మించిన పదమూడవ శతాబ్దం హిందూదేశ చరిత్రలో ఒక అశాంతికి లోనైనది. హిందూ రాజ్యాలు రాజకీయ మత స్వాతంత్ర్యాలు కోలుపోయి అపదపాలౌతున్నాయి. దేవాలయాలు, మఠాలు నేలమట్టం కానున్నాయి. హిందూ మతం మాయావాదంతోను, కర్మ సన్యాసంతోను నిండివుంది. ప్రాపంచిక యాథార్థ్యాన్ని, ధార్మిక సత్యాన్ని ప్రబోధించి హిందూ సమాజాన్ని మేలుకొల్పి సంఘటితపరచవలసిన అవసర మేర్పడింది. ఆ సమయంలోనే మధ్వాచార్యులు అవతరించి యీ పనికి పూనుకొన్నారు.

వేదాల యథార్థతను, ఉపనిషత్తుల తాత్త్వికతను, పురాణాల భక్త్యావేశాన్ని గ్రహించి ఒక నూతన దృక్పథాన్ని కల్పించి మధ్వాచార్యులు ప్రతిపాదన చేశారు. ఈ సిద్ధాంత మార్గమును వారి గ్రంథాలనుంచి, భాష్యాల నుంచి విపులంగా ఉల్లేఖిస్తూ ఈ గ్రంథకర్త యీ గ్రంథంలో విస్పష్టంగా వివరించారు. ఆంగ్లభాషలో ఈ గ్రంథ రచన కష్టసాధ్యమైనది. వేదాంతానికి సంబంధించిన సాంకేతిక పదాలలోని భావాలను భారతీయేతర భాషలు వెలువరించడం చాల కష్టం. ఈ రచన ఆంగ్లంలో భావ విస్పష్టతతో, పాండితితో, జిగితో సాగింది. గ్రంథంలో మధ్వాచార్యుల రచనలుల్లేఖింపబడి, ఆంగ్లానువాదా లీయబడినాయి. ప్రతి వాక్యం రచయిత చేసిన పరిశ్రమను,పాండితినివిస్పష్టం చేస్తున్నది. ఆచార్య త్రయంలోని మధ్వాచార్యుల వేదాంత ప్రతిపాదనం అవగాహన చేసికొనుటకీ గ్రంథ మెంతేని ప్రయోజనకారి.

[Madhva's Teachings in his own words : రచయిత : బి. ఎన్. కె. శర్మ, ప్రచురణ : భారతీయ విద్యాభవన్, బొంబాయి, వెల రు. 2/-]

—కె. రా.

జనవాక్యం

మద్య నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు జరపాలి

ఏప్రిల్ ఆరవ తేదీనుంచి 13 వ తేదీవరకు మద్య నిషేధ ప్రచారవారం నిర్వహించాలని కాంగ్రెసు సేవకులకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు ఆదేశమివ్వడం చాల సంతోషించవలసిన విషయం.

గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్యోద్యమంలో మద్య నిషేధ ప్రచారానికి ఒక ప్రధాన స్థానమిచ్చి కృషిచేశారు. ఆనాడు చేతిలో అధికారం లేకపోయినా స్వచ్ఛంద సేవకులు అనేకమంది గాంధీజీ ఆదేశానుసారం కల్లు దుకాణాల వద్ద పికెటింగు చేసి అనేక అవమానాలు, అగచాట్లు పడ్డారు. అద్భుతమైన ఫలితాలను వారు రాబట్టారు. ఆనాడు మద్య నిషేధ ప్రచారం విఫలమైనదని గాని, స్వరాజ్యం వచ్చాక మద్యనిషేధం విఫల మవుతుందని గాని ఎవరూ కలలో కూడా తలచలేదు. అనాడు చేసిన ప్రచారం ఫలితంగా వచ్చిన సత్ఫలితాలను చూస్తే, చేతిలోకి అధికారం వచ్చాక మద్యనిషేధ శాసనాన్ని నూటికి నూరుపాళ్ళు విజయవంతం చేయగలమనే విశ్వాసం ప్రతి స్వచ్ఛంద సేవకుని హృదయంలోను కలిగింది. ఆ ధైర్యంతోనే 1937లో రాష్ట్రాలలో కాంగ్రెసువారు అధికారంలోనికి రాగానే మొట్టమొదటగా మద్య నిషేధ శాసనం ప్రవేశపెట్టారు. మద్రాసు రాష్ట్రంలో శ్రీ రాజగోపాలచారి ముఖ్యమంత్రిగావుండి, ప్రప్రథమంగా మద్యనిషేధ శాసనాన్ని సేలం జిల్లాలో అమలు పర్చిననాడు దేశమంతా సంతోషించింది.

స్వరాజ్యానికి ముందు ఇంత విజయవంతమైన మద్య నిషేధం, స్వరాజ్యం వచ్చాక ఎందుకు విఫలమైందో తెలుసుకొనడం అవసరం. ప్రతిష్ఠ కోసం ప్రభుత్వాధికారులు విఫలం కాలేదని చెప్పవచ్చు. లేక మద్య నిషేధం విఫలమైంది కనుక దానిని రద్దు చేయండి అని కొందరు అనవచ్చు. కాని మానవుని నైతికంగాను, ఆర్థికంగాను, సాంఘికంగాను నాశనం చేసే మహమ్మారి మద్యపానం అని ప్రతివారు గ్రహించాలి.

ఇట్టి దురాచారాన్ని ప్రతివారు తుదముట్టించడానికి ప్రయత్నించాలి, కాని, ఏవో కబుర్లు చెప్పి, ప్రభుత్వాన్ని, కాంగ్రెసువారిని అధికారులను దుమ్మెత్తి పోయడంవల్ల లాభం లేదు, మద్యనిషేధం దురాచారమని అందరూ అంగీకరిస్తున్నప్పుడు దానిని అరికట్టడానికి ప్రయత్నించాలి కాని విఫలమైంది కనుక నిషేధం తీసివేయాలని ఆందోళన చేయడంలో అర్థమేమిటి?

మద్య నిషేధం విఫలమవడానికిగల రహస్యం ఎక్కడుందో గ్రహించాలి. ఇది నిస్సందేహంగా ప్రభుత్వ యంత్రాంగంలోను, ఇందు నిమిత్తం ఏర్పాటుచేసిన ఉద్యోగుల లోను ఉందని చెప్పక తప్పదు. వారి కండ్ల ఎదుటనే ఎన్నో సారా బట్టీలుపెట్టి నిర్భయంగా సారా సరఫరా చేస్తున్నారు కొందరు.

అధికారులు చిత్తశుద్ధిలో తమవిద్యుక్తధర్మం నెరవేర్చిననాడు ప్రభుత్వం చేసిన ఏ శాసనం విఫలంకాదు. పైగా ప్రభుత్వాధికారులలో చిత్తశుద్ధి లోపించడంవల్ల తమ విద్యుక్త ధర్మాన్ని పాటించనివారే కాకుండా, పరోక్షంగా ఒక దురాచారాన్ని ప్రోత్సాహించినవారు కూడా కాగల్గుతున్నారు. ఈ అధికారుల మనస్సులను మార్చడానికి కాంగ్రెసు అధినేతలు ఏమైనా మార్గం ఆలోచించిననాడు మద్య నిషేధం తప్పక విజయవంతం కాగలదనడంలో సందేహం లేదు.

గో. వెంకటానందం,
నిడదవోలు.

* * *

ఆంధ్ర మెట్రిక్ లెక్కల ప్రశ్న పత్రంలో అవకతవకలు

ఆంధ్ర యూనివర్సిటీవారు మార్చి 1964 లో మెట్రిక్యులేషన్ విద్యార్థులకు "ఐచ్ఛిక గణితం" లో ఇచ్చిన ప్రశ్న పత్రంలో ఈ విషయములు గమనింప దగినవి.

ప్రశ్న 1 (బి) ఈ లెక్క ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడా తప్పు. అందుచేత ఇది అచ్చు పొరపాటు కాదు.

ప్రశ్న 3 (సి) ఈ లెక్కకూడా ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ తప్పు, అందుచేత ఇది అచ్చు పొరపాటు కాదు.

ప్రశ్న 2 (బి) "కామన్" అను మాటకు "సమాన" అని తర్జుమా చేయబడినది, ఇది తప్పు "సామాన్య" అని తర్జుమా చేయవలెను.

ప్రశ్న 2 (బి) ఇది బీజ గణితంలో "నిష్పత్తి-అనుపాతం" అను విషయంమీద లెక్క. ఈ విషయం పి. యు. సి. కి ఉన్నదికాని మెట్రిక్యులేషన్ సిలబస్‌లో లేదు. ఈ సంగతి సంవత్సరానికి రెండుసారులు యూనివర్శిటీకి తెలియజేసినను సిలబస్‌లో లేని ఆ విషయం మీద ప్రశ్న ఇవ్వడం మానడంలేదు.

ప్రశ్న గ్రాఫులు : బీజ గణితంలో ముఖ్యమైన విషయాలలో "గ్రాఫులు" ఒకటి. ఆంధ్ర యూనివర్శిటీ చరిత్రలో గ్రాఫుమీద లెక్క ఇవ్వకుండడం ఇది మొదటిసారి.

కె. వెంకటరావు,
రిటైర్డు హైస్కూల్ హెడ్‌మాస్టర్,
ఆంధ్ర ట్యుటోరియల్ టీచర్స్ అసోసియేషన్
కార్యదర్శి.

ఇండియా వైద్యమండలి అధ్యక్షుడు డాక్టర్ సి. ఎస్. పటేల్ ఏప్రిల్ అయిదవ తేదీన మాట్లాడుతూ మితిమీరిన సంఖ్యలో వైద్య కళాశాలలను ప్రారంభించడం దేశశ్రేయస్సుకు అనుగుణం కాజాలదని చెప్పినట్టు న్యూఢిల్లీ వార్త.

వనితావని

ప్రతి మంగళవారం ప్రచురణ

నవభారతంలో మహిళల పాత్ర

ప్రాచీన కాలంలో స్త్రీకి గౌరవప్రదమైన ప్రత్యేక స్థానంవుండేది. ఆనాటికాలంలో స్త్రీలు పూజ్యులు. అన్ని రంగాల్లో స్త్రీలకి ప్రవేశం వుండేది. ధైర్యంగా ముందడుగు వేసి తమ శక్తి సామర్థ్యాలను వెల్లడిచేసి చాటే వారు. స్త్రీ లేందే ప్రపంచమే లేదన్నట్టుగా ఉండేది.

రాను రాను కొంతకాలం గడిచేసరికి స్త్రీస్వాతంత్ర్యాన్ని అరికట్టి ఆమెను వంటింటి కుందేలుగా తయారు చేశారు. పది సంవత్సరాలు నిండని ప్రాయంలో పెళ్ళిచ్చేసి, నాటినుంచీ వారికి గృహిణిగా శిక్షణలిచ్చేవారు. స్త్రీ ఎవరిని ఎదిరించి మాట్లాడకూడదు. చెప్పే ప్రతి పని చెయ్యవలసిందే. మగవారుచేసే ప్రతి పనిచూసిసహించివూరుకోవాలి. అదితప్పైనా, ఒప్పైనా విమర్శించి, సమర్థించే వాక్స్వాతంత్ర్యం స్త్రీకి లేదు. నీగ్రో బానిసల్లా చాకిరీ చేసే ఒక బానిస స్త్రీ- యింట్లో. పిల్లల్ని సృష్టించే ఒక యంత్రం. అదే ప్రతి స్త్రీ కర్తవ్యం. చివరికి స్త్రీ విలువ సంఘంలో అధోగతిపాలై ఆమెనొక మనిషిగా కూడా గుర్తించడం మానేశారు. ఇటువంటి కాలంలో కూడా వీరపుత్రులను కన్న మాతలేకాక, వీర పుత్రికలను కన్న మాతలుకూడా ఉండేవారు. సంసారాన్నెదిరించి తమలో ఇమిడి ఉన్న అపారమైన ధైర్య సాహసాలను సామర్థ్యంతో చూపుతూ మాతృదేశం మీద తమకున్న విశ్వాసాలను చూపేవారు. రుద్రమదేవి, లక్ష్మీబాయి, చాంద్ బీబీ మొదలైనవారు పెక్కుమంది వీర నారీమణులు ఆనాటి వారే.

శ్రీమతి బులుసు రామలక్ష్మి

రాజా రామమోహన్ రాయలు, రానడే, గోఖలే, వీరేశలింగం పంతులుగారు మొదలైన వారి సంస్కరణల మూలంగా స్త్రీలు కొంత మంది మూఢనమ్మకాలను వదిలి ముందడుగు వేస్తున్నారు. వీరి సంస్కరణ మూలంగా స్త్రీలకు కొంత స్వాతంత్ర్యం ఏర్పడింది. మొదట్లో కొందరు సిరసించినా రాను రాను వారిఅడుగు జాడల్లోనే నడిచారు చాలమంది. పురుషులతో సమానమైన హక్కులు కూడా ప్రభుత్వం ప్రసాదించింది. నేటి స్త్రీలు సర్వ స్వతంత్రులు. సర్వ సమస్తులు.

బాలికలకు ఉచిత విద్యాసౌకర్యం ఏర్పరచింది ప్రభుత్వం. ఉన్నత విద్యలలో కూడా అనేకమైన సహాయాలు చేసి వారిని ముందుకు తేవడానికి ఎంతో తోడ్పడుతోంది. స్కూళ్ళలో, ఉద్యోగాలల్లో, పదవుల్లో అన్నింటిలో కూడా స్త్రీలకై కొన్ని సీట్లు ప్రత్యేకింపబడుతున్నాయి. ఇన్ని విధాల స్త్రీల పురోభివృద్ధికై పాటుపడుతున్నా సరే స్త్రీలలో నూటికి నలభైమంది వరకు విద్యాహీనులైవుంటున్నారు. పూర్వాచారపరాయణులు తమ పిల్లలకి (బాలికలకి) చదువులు చెప్పించడం మానేస్తున్నారు. ఇది వారు చేసే చాలా తెలివి తక్కువ పని. కాలాన్నిబట్టి మనమూ మారాలి. విపరీతమైన ధరలు పెట్టి వరుణ్ని కొని, తమ బాలికనిచ్చి వివాహాలు చెయ్యలేకపోతున్నారు. కడుపుకి తిండి, కట్టగుడ్డ ఇవ్వలేకపోతున్న కుటుంబ యజమాని (తండ్రి) వరకట్నాలిచ్చి పెళ్లిళ్ల చెయ్యడం కలలోని వార్త. సనాతనాచారాల మీద గ్రుడ్డి నమ్మకంతో పిల్లల్ని చదివించడ మానేసి, పెళ్లిచెయ్యడానికి శక్తిలేక బాధపడుతున్న తల్లిదండ్రులు ఎందరో ఉన్నారు.

వరకట్నాల నిషేధం శాసనాలు చేశారు. పిల్లలు గుడ్డ ఉపన్యసించే పెద్దలు తమ కూతుళ్ళకి కట్నాలు ఇవ్వందే వివాహాలు చెయ్యలేక పోతున్నారు. ఒకరి కివ్వడం కోసం తన కొడుకులకి పుచ్చుకోక తప్పడంలేదు. ఈ ఇవ్వడం. పుచ్చుకోవడం ఆనే వ్యాపారం మధ్య ధనహీనులైన బాలికలు నలిగిపోతున్నారు. మనలో ప్రతిబాలిక చదువుకుని తనను తాను పోషించుకోగలిగిననాడు, అటు తల్లిదండ్రుల భారాన్ని కొంత తగ్గించ కల్గుతుంది. ఇటు వరకట్నాల్ని అరికట్టగలుగుతుంది. కేవలం చట్టం సభలలో ప్యాస్‌చేసినంత మాత్రాన వరకట్నాలు అదుపులోకిరావు, అవి అరికట్టే బాధ్యత నేటి బాలికల మీదనే ఉంది.

ఏ అప్పోచేసి వివాహాలు చేస్తారు. కట్నాలిచ్చి. ఇంత సామాన్య కుటుంబీకుడు తను తెచ్చే ఆదాయంతో నేటి ఆర్థిక పరిస్థితులను పట్టిచూస్తే, తన కుటుంబాన్ని పోషించలేడు. ఒక వ్యక్తి తెచ్చే జీతం ఇద్దరు, ముగ్గురు మనుష్యులకే సరిపోతుంది, ఇంక తమ పిల్లలకేం పెట్టి పెంచాలి అన్నదే సమస్యగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యావతి అయిన భార్య తాను కూడా ఉద్యోగంచేసి ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోగలదు.

నేటికీ కొన్ని కుటుంబాల్లో స్త్రీలు బైటకు రాకూడదు, ఇతరుల్ని చూడకూడదు. ఇతరుల్నేకాదు, తమ బంధువర్గంలోని వారినైనా సరే పలుకరించి మాట్లాడకూడదు పురుషులతో; స్త్రీలని నియమం వుంది. కేవలం ఈ ఆచారాలన్నీ మనంపెట్టుకున్నవేకాని వేద శాస్త్రాల్లో నిర్దేశించ బడినవికావు. ఒక వేళ నిర్దేశించబడినవే అయినా కాలమాన పరిస్థితుల్నిబట్టి మనం ఆచరణలో పెట్టలేము. ఆచరించి ఎన్నో కష్టాలకు గురౌతాము. మన పూర్వీకు లెవరూ మగవారు కూడా ఉద్యోగాలు చెయ్యలేదు కాని, "మనకు "కలం కదిలితేకాని కడుపు చల్లపడదు'' అన్నట్టు కష్టించి పని చెయ్యందే రోజు గడవదు. ఇప్పుడు మన వాళ్ళంతా ఉద్యోగాలు చేస్తున్నారు. మన జనభా లెక్కల్లో చూస్తే స్త్రీలే, పురుషుల కంటె ఎక్కువగా వున్నారు. అధిక సంఖ్యాకులైన స్త్రీలు పురుషులకంటె ఎక్కువగా దేశం పురోభివృద్ధిలోకి తేవడానికి తోడ్పడాలి. తల్లిదండ్రుల మనశ్శాంతికోసం, తన ఆత్మ సంతృప్తికోసం, దేశ సౌభాగ్యంకోసం ప్రతి స్త్రీ విద్యావతి కావాలి. అప్పుడే మన దేశంలోని వారికి దారిద్ర్యం కొంచెం దూరంగా వుండే అవకాశం కలుగుతుంది. సమానమైన హక్కులుగల స్త్రీలు పురుషులతో సమానంగా కష్టించి పనిచేసి, కలిసిమెలిసి అన్ని రంగాలలోకి దూసుకుపోయిననాడు మన దేశాన్ని పరాధీనంకాకుండా రక్షించుకునేందుకు అభ్యంతరం వుండదు.

టేబిల్ క్లాత్ మూలలకు డిజైన్

కదలి సూర్యారావు, విజయవాడ.

రాబడినిబట్టి ఖర్చు

ఈనాటి మహిళలు చాల మంది ముఖ్యంగా ఆడంబరాలయందు ఆసక్తి చూపుతారు. మనకు స్థోమత వుందా? మనకు వచ్చే ఆదాయమెంత! అని ముందు వెనుకలు ఆలోచించకుండా ఎవరే వస్తువు కొంటే వాళ్ళు కొన్నారు కదా. అని వీళ్ళు కొనేస్తారు. మంచి, చెడూ చూడరు మన నారీమణులు. ఒకరిని చూసి మరొకరుఆడంబరాలకుపోయి, సంసారాలను నాశనం చేసుకొనడమేగాని ఫలితం కనపించదు. అతిగా ఖర్చుపెట్టకుండా వున్న దానిలోనే తృప్తిపడే అతివలు చాల కొద్దిమంది వుంటారు, వాళ్ళకు రేడియో వుందనీ; ఫ్యాన్ కొన్నారని, భర్తగారు జీతం తెచ్చి యివ్వగానే భార్యామణిగారు, మేమే తక్కువా అని ముందుగానే ఎక్కువ ఖరీదులో తెస్తారు. చివరకు యింటి యజమాని అప్పులు తీర్చలేక బాధపడతాడు. కొందరు వనితలు మరీ మూరంగా ప్రవర్తిస్తారు. నగలు, చీరెలు. లేవని ప్రొద్దస్తమానం మగవారి మీద పోట్లాడుతారు. వీళ్ళ పోరు పడలేక యిల్లో, పొలమో తాకట్టు పెట్టో లేక అమ్మో వాళ్ళ గొంతెమ్మ కోర్కెలు తీరుస్తారు. ముందు ముందు ఎలా బ్రతకాలి అనే వరకు వస్తుంది వ్యవహారం. రాబడిని బట్టి పరిమితిగా ఖర్చు చేయాలి.

"అభయ"

కొందరు భాగ్యవంతులున్నా రనుకోండి. వాళ్ళకు ఆదాయం ఎక్కువ వస్తుంది. దానిని బట్టి ఖర్చు చేస్తుంటారు. దానిని చూసి తప్పుడు స్థితిలో వున్నవారు కూడా ఖర్చు చేయాలంటే ఎలా కుదురుతుంది.మనం అప్పోసప్పోచేసి, వంటి నిండా నగలు అలంకరించుకుని, కారులో బయలుదేరగానే, లేని హోదా, గౌరవం ఎక్కడ్నుంచి వస్తుంది. అదంతా మన బలహీనతను కప్పిపుచ్చుకోటానికి చేసే ప్రయత్నం. ఏ ఆఫీసరుగారి భార్య వెంట సినిమా కెళ్ళాలనుకోవాలంటే ఆవిడ బాల్కనీ కెళ్ళేదీ ప్రక్కవారు కూడా వెళ్ళాలంటే ఎలా వెళతారు. కొందరు వనితలు వెడతారు. వీరికెందుకో అంత బాధ. అంత దుబారా చేసే బదులు యింట్లోని వారంతా తక్కువ ఖర్చుతో చూడవచ్చుగదా: యింట్లో పిల్లలను శుభ్రంగా వుంచకుండా వాళ్ళ మానాన వాళ్ళ నొదిలేసి. వీరు మాత్రం చక్కగా తయారై ఏ పార్కుకో సినిమాకో ఫ్రెండ్సువెంట బయల్దేరతారు, శుభ్రంగా పిల్లలకు స్నానం చేయించి బట్టలు వేసి సరదాగా ఎక్కడికన్నా వెడితే ముచ్చటగా వుంటుంది, ప్రక్కవారికి కారుందని, వీరు ఒకరిని చూసి మరొకరు నష్టపోవడమేగాని లాభ ముండదు. ఆడంబరాల మూలంగా కుటుంబాలు కూలిపోతున్నాయి. యీ ఖర్చులు చూసి అలా అయితే ఎలా అని భర్త సర్ది చెప్పబోతే, "ఏం మాకు అన్ని రంగాలలో సమాన హక్కులున్నాయి. మీకే కాదు, మాకు ఉద్యోగాలున్నాయి. సంపాదించుకొని ఖర్చు పెట్టుకుంటాం. మాకూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వుంది అంటారు. పాపం ఆ మగ మహారాజు కిక్కురుమనకుండా వెడతాడు. యిది సహజంగా లోకంలో జరుగుతున్న సంఘటన అంటే అందరు సోదరీమణులు అలాంటి వారని నా వుద్దేశం కాదు. అందరూ ఒక రకంగా వుండరు కదా!

ప్రతి వారికి యీ యిరవయ్యో శతాబ్దంలో చేతికి వాచీ. కాళ్ళకు హైహీల్సులేని మహిళలు లేరంటే అతిశయోక్తి లేదేమో? (పెట్టుకో వద్దని కాదు) మనకు లేని గౌరవం, హోదా అవి పెట్టుకోగానే వస్తాయనుకోవడం పొరపాటు (అలంకరించుకో వచ్చు. పరిసరాలు, పరిస్థితులు, కట్టుబాట్లను గురించి ఆలోచించాలి) లేనిపోని అంతస్థులు. అధికారాల కోసం, మనం పెట్టే ఖర్చులను చూస్తే అనవసరంగా డబ్బంతా వ్యర్థం. ఆడంబరంగా వున్నంత మాత్రాన మనల్ని గౌరవిస్తారనుకోడం పొరపాటు. సంఘంలో, యింటా, బయటా అనవసర ఖర్చులు లేకుండా కాపురాలు ఒడిదుడుకు లేకుండా చూసుకోవడమే నేర్పరితనం, గొప్పతనం కూడా అందులోనే వుంది. వచ్చే రాబడిని బట్టి తగు రీతిగా జాగ్రూకతో ఖర్చు చేయడం అతివల ముఖ్య లక్షణం. "పులిని చూసి నక్క వాత పెట్టుకున్న"దన్న సామెతగా ఈ కాలపు మహిళలు పేటికయినా వెనుకాడరు. అందుకని మగువలు పైపై మోజులకు, ఆడంబరాలకు పోక సుఖంగా జీవించడం నేర్చుకోవాలి.

జ్ఞానం కలిగిన విద్యావంతులు కూడా ఒక్కోసారి యిలా ప్రవర్తిస్తారనడంలో సందియం లేదు. ప్రతి స్త్రీ సామాన్యంగా నగలపై మోజు పడతారు. అందులో పొరపాటు లేదు. అదివరకున్న అలవాటే నేటి సమాజంలో ముఖ్యంగా మహిళల మంచితనం గుణగుణాలకే ఎక్కువగా ప్రాధాన్యం వుంటుంది. అతివలు ఆడంబరాలను తగ్గించి తగురీతితో ఖర్చు పెట్టుకుంటే భవిష్యత్తులో సంసారం సుఖంగా సాగిపోతుంది.



టేబిల్ క్లాత్ మధ్యకు డిజైన్

బట్టు భాస్కరమ్మ, జాండ్రపేట.



దిండు గలేబులకు డిజైన్

— శ్రీ వేణు, (నిజామాబాద్)

గృహ వైద్యం:

ఎముకలకు ప్రమాదాలు

డాక్టర్
త్రిపురనేని వెంకటేశ్వరరావు
ఎం. బి. బి. ఎస్.

ఎముకలు బీటలు వారినా, పగిలినా రెండుగాని అంతకంటె ఎక్కువ తుంపులుగాని అయితే ఎముక విరుగుట అంటారు. ఎముకలు విరుగుటకు మూడు కారణాలు: ఏదైనా ఎత్తైన ప్రదేశమునుంచి దుమికినపుడు. క్రింద పడినపుడు ఎముకలు విరుగుతాయి. అందే చేతులమీద పడినపుడు భోరఎముకకాని భొటన వ్రేలు ప్రక్కనుండు మణిబంధ ధరాస్థి కాని విరగవచ్చు. దీనిని పరోక్ష కారణముచే (Indirect Violence) ఎముక విరుగుట అంటారు. కొన్ని ప్రత్యక్ష కారణములచే అనగా కర్రతో కొట్టినపుడు గాని, తుపాకి గుండు తగిలినపుడు గాని ఎముక విరుగ వచ్చు. ఒకొక్కప్పుడు కండరముల సంకోచం వలన ఎముకలు విరుగ వచ్చు. మోకాలి చిప్పకు అమర్చబడిన తొడ ముందుండు కండరములు, క్రింద పడబోయినపుడు ఆకస్మికముగా ముడుచుకొంటాయి. అప్పుడు మోకాలిచిప్ప విరుగ వచ్చు.

ఎముక విరుగుటను ఆరు విధములుగా విభజింప వచ్చును: ఎముక విరిగి చుట్టూ వున్న యితర జీవ కణజాలమునకు ఎట్టి నష్టం లేనిచో వట్టి ఎముక విరుగుట (Simple Fracture) అని మాత్రమే అంటారు.

ఎముక విరిగి చుట్టునున్న కండరములు దెబ్బతిని చర్మము చిట్లి ఎముక కొన బైటికి త్రోసుకొని వస్తే దానిని కాంపౌండ్ ఫ్రాక్చర్ (Compound Fracture) అంటారు.

ఎముక విరుగుటతోపాటు చుట్టు నున్న అవయవములకు హానికలిగితే దానిని కాంప్లికేటెడ్ ఫ్రాక్చర్ (Complicated Fracturs) అంటారు. తల ఎముక విరిగినపుడు మెదడుకు హాని కలుగ వచ్చు. ప్రక్కటెముకలు విరిగినపుడు ఊపిరి తిత్తులకు హాని కలుగవచ్చు. ఇట్టి పరిస్థితులను విషమ పరిస్థితులు అంటాము.

ఒకే ఎముక అనేక తుంపులు కావచ్చు. దానిని కమ్యూనిటెడ్ ఫ్రాక్చర్ (Communited Fracture) అంటారు. దీనియందు ఎముక బలమైన గాయాలు తగిలి నపుడు చిన్ని చిన్ని తునకలుగా నలగవచ్చు, లేదా విరిగిపోవచ్చు.

లేత ఎముక విరుగుట (Green Stick Fracture): పచ్చని వేపపుల్లను విరచిన రెండుగా విరుగక మధ్యకు చిట్లి వంగిపోవును. అట్లే చిన్న పిల్లల ఎముకలకు దెబ్బతగిలినపుడు రెండు తుంపులుకాక వంగి చిట్లుతుంది. దీనినే గ్రీన్ స్టిక్ ఫ్రాక్చర్ (GreenStick Fracture) అంటారు. చిన్న బిడ్డ ఎముకలు పెద్దవారి ఎముకలవలె పెళుసుగా వుండవు. కాన అవి సులభంగా విడగవు, కాని మెత్తగా నుండుటచే సులభంగా వంగుతుంది.

ఎముక విరిగినపుడు రెండు కొనలు ఒకదానిలో నొకటి చొచ్చుకొనిపోతే ఇంపాక్టెడ్ ఫ్రాక్చర్ (Impacteed Fracture) అంటారు. పెద్ద ఎముకలు విరిగినపుడు వాటి మొదటికొన రెండవ కొనలోనికి బలంగా త్రోయబడి దానియందు గట్టిగా నాటుకొని పోతుంది. ఇట్టి పరిస్థితిని సరిజేయుట వైద్యునకు చాలా కష్టము. ఒకప్పుడు ఎముక తుంపులు ఒకదానిపై ఒకటి ఎక్కి మిక్కిలి బాధను కలుగజేస్తుంది.

ఎముక విరిగినపుడు లక్షణములు, చిహ్నములు: భరింపరాని బాధ, ఎముక విరిగినచోట వాపు వుంటాయి.

ఎముక విరిగిన అవయవం పనిచేయడానికి పనికిరాదు.

అంగ వికారము కలిగి ఆకారమందు భేదమేర్పడుతుంది. అంగసౌష్ఠవం పోవడమేగాక, దాని పటుత్వంకూడ చాలావరకుతగ్గిపోతుంది.

పొడవునందు భేదముంటుంది. దెబ్బతగిలిన అవయవము పొడవు తగ్గుతుంది,

కరకర శబ్దము: విరిగిన ఎముక కొనలు రెండు ఒకటినొకటి రాచుకొనుటచే కరకరమని శబ్దము (Crepitus) కలుగుతుంది. ప్రథమ చికిత్స చేయువారు ఇట్టిశబ్దమున్నదో లేదో తెలిసికొనుటకై ఎముకలను రాపాడించడం మంచిదికాదు. అలా చేస్తే విరిగిన ఎముకల కొనలచుట్టూ వుండు కండరములయందు కాని, నరములయందు కాని, చర్మమునందుకాని, గ్రుచ్చుకొని వాటికి హాని కలుగవచ్చు.

విరిగిన ఎముక చర్మము క్రిందనే ఉన్న ఎముక విరిగినట్టుగా, స్పష్టంగా స్పర్శవల్ల తాకి తెలుసుకొనవచ్చు ఎముకకు సాధారణ కదలికలు పోయి ఆసాధారణ కదలికలు (Movements) వస్తాయి. చివరి మూడు చిహ్నములు డాక్టర్‌చే ఋజువుచేయబడవలెను కాని, ప్రథమ చికిత్స చేయువారు ఆ చిహ్నముల కొరకై ప్రయత్నము చేయరాదు. పై లక్షణములు, చిహ్నములవలననేగాక గాయము తగిలిన సంగతి సందర్భమును బట్టి కూడ ఎముక విరిగినట్టుగా భావించవచ్చు,

విజయవాడలో ఆదివారంనాడు శ్రీ కోరాడ బృందం యిచ్చిన నృత్య ప్రదర్శనలో ఒక దృశ్యం. కుడిపైపు శ్రీ జి. ఎస్. రాజు శ్రీ కోరాడకు శాలువను బహూకరించి సన్మానిస్తున్న దృశ్యం చూడవచ్చు

నాలుగవ ప్రణాళికలో ఉక్కు ఫ్యాక్టరీల నిర్మాణం

అవసరమైన యంత్రపరికరాలను దేశంలోనే తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5— నాలుగవ ప్రణాళికా కాలంలో నిర్మించే ఉక్కు ఫ్యాక్టరీలకు సాధ్యమైనంత ఎక్కువగా స్వదేశీయ వసరులనే ఉపయోగించాలని ప్రభుత్వం సంకల్పించినట్టు ఉక్కు గనులు, భారీ ఇంజనీరింగ్ మంత్రిత్వశాఖ వార్షిక నివేదికలో పేర్కొన్నారు.

ఇందుకు వీలుగా ఉక్కు ఫ్యాక్టరీల నిర్మాణానికి అవసరమైన యంత్ర పరికరాలను దేశంలోనే తయారు చేయడానికి ప్రభుత్వం ముందుగా చర్యలు తీసుకొంటున్నది. నాలుగవ ప్రణాళికా కాలంలో అవసరపు ఉక్కు ఉత్పత్తికి అవసరమైన ముడి సరకు, దాని రవాణాకుసంబంధించిన అవసరాలను గురించి అధ్యయనం చేస్తున్నారు.

నాలుగవ ప్రణాళికా పథకాలపై ఉక్కు విషయాలకు సంబంధించిన పరిశీలనా సంఘం సిఫారసులను ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

నాలుగవ ప్రణాళిక ఆఖరునాటికి దేశంలో ఏడాదికి 170 లక్షల టన్నుల దుక్క ఇనుము దూలాలు, పదిలక్షల టన్నుల ప్రత్యేక ఇనుము దూలాలు అమ్మకానికి తయారు చేయాలని ఆ కమిటీ తాత్కాలికంగా నిర్ణయించింది. ఈ లక్ష్యాన్ని ప్రస్తుతం ప్రభుత్వ ప్రయివేట్ రంగాలలో వున్న ఉక్కు ఫ్యాక్టరీలను విస్తరింప జేయడం ద్వారాను, ప్రభుత్వ రంగంలో కొత్తగా మూడు ఫ్యాక్టరీలను నిర్మించడం ద్వారా సాధించాలని ఆ సంఘం సిఫారసు చేసింది.

బొకారో, నైవేలి, సేలం ఫ్యాక్టరీలు గాక అదనంగా మరికొన్ని ఫ్యాక్టరీలను స్థాపించడం అవసరమని ఆ సంఘం సూచించింది.

టాటా ఉక్కు ఫ్యాక్టరీ వార్షిక ఉత్పత్తిని 30 లక్షల టన్నుల మేరకు పెంచడానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది

బీహార్ యూనివర్సిటీ విద్యార్థుల నిరాహార దీక్ష విరమణ

ముజఫర్‌పూర్, ఏప్రిల్ 6— మార్చి 28 వ తేదీ నుంచి నిరవధికంగా నిరాహార దీక్ష ప్రారంభించిన ముగ్గురు బీహార్ యూనివర్సిటీ విద్యార్థులు ముజఫర్‌పూర్ సమితి విజ్ఞప్తిని పురస్కరించుకొని నిన్న సాయంకాలం తమ దీక్షను విరమించారు.

యూనివర్సిటీ నిర్వహణ స్థితిని గురించి దర్యాప్తు జరిపి. మూడు నెలలలోపల నివేదిక సమర్పించడానికై ఉన్నతాధికార సంఘాన్ని ఏర్పాటు చేసేటట్టు ప్రభుత్వాన్ని ఒప్పించగలమని పౌర సమితి సభ్యులు హామీ ఇచ్చిన అనంతరం విద్యార్థులు నిరాహార దీక్ష విరమించారు,

ప్రస్తుతం వున్న వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. ఎర్. శ్రీవాత్సవను తొలగించాలని విద్యార్థులు ముఖ్యంగా పట్టుబడుతున్నారు.

"మత, నియంతృత్వ శక్తులతో పొత్తు అరిష్టదాయకం"

శ్రీ మురార్జీ హెచ్చరిక

కాలికట్, ఏప్రిల్ 6—మత, నియంతృత్వ శక్తులపట్ల జాగరూకతతో వ్యవహరించాలని, వినాశనానికి దారితీసే ఒప్పందాలు తగవని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ హెచ్చరించారు.

శ్రీ మురార్జీ నిన్న రాత్రి ఇక్కడ జరిగిన పెద్ద బహిరంగ సభలో ప్రసంగిస్తూ, కేరళలో అధికారం నుంచి కాంగ్రెసును తొలగించడానికి ముస్లిం లీగ్, కమ్యూనిస్టు పార్టీలు చేతులు కలపడానికి ప్రయత్నిస్తున్నవని, అనాలోచిత చర్యలకు ఉద్యమించే ఏ పార్టీతోనైనా కాంగ్రెసు పొత్తు కుదుర్చుకొనడాలదని స్పష్టం చేశారు,

భారత జాతీయ కాంగ్రెసు చరిత్ర గురించి పేర్కొంటూ స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుంచి పారిశ్రామికీకరణద్వారా దేశ సౌభాగ్యం కోసం కాంగ్రెసు దృఢదీక్షతో కృషి చేస్తున్నదని శ్రీ దేశాయ్ తెలిపారు,

రూర్కెలాలో మామూలు పరిస్థితి

భువనేశ్వర్, ఏప్రిల్ 6—ఇటీవల సంఘర్షణలకు గురియైన రూర్కెలా నగరంలో క్రమేణా మామూలు పరిస్థితి ఏర్పడుతున్నదని ఇక్కడ ఉక్కు కర్మాగారానికి చెందిన కార్మికులు విరివిగా పనులలోకి ప్రవేశిస్తున్నారని నిన్న రాత్రి ఇక్కడకు అందిన అధికార వార్తలవల్ల తెలుస్తున్నది.

రూర్కెలా ఉక్కు కర్మాగారంలో 14 వేల మంది కార్మికులలో నిన్న సుమారు తొమ్మిది వేలమంది పనిలోకి వచ్చినట్టు ఆ వార్తలు తెలుపుతున్నవి.

ప్రభుత్వ శిబిరాలలో ఆశ్రయం పొందిన ముస్లింలు తిరిగి తమ నెలవులకు చేరుకొంటున్నారని, ఈ శిబిరాలలో వున్న 2700 మంది ముస్లింలు మొన్న తమ గృహాలకు వచ్చివేశారని ఈ వార్తలు వివరించినవి.

ప్రజాస్వామ్యం, సోషలిజంపై తీర్మానం అమలు

న్యూఢిల్లీలో కాంగ్రెస్ నాయకుల చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6— ప్రజాస్వామ్యం, సోషలిజంపై భువనేశ్వర్ కాంగ్రెస్ మహాసభ చేసిన తీర్మానం అమలుకు తీసుకొనవలసిన చర్యలను గురించి సూచించే నిమిత్తం ఏర్పాటైన కాంగ్రెస్ కమిటీ నిన్న ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారితోను, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు శ్రీ అశోక్ మెహతాతోను చర్చలు జరిపింది.

నిన్నటి సమావేశానికి హాజరైన కమిటీ సభ్యులలో శ్రీ యు. ఎన్. ధేబర్, శ్రీ సాదిక్ అలీ, శ్రీ సి. సుబ్రహ్మణ్యం, శ్రీ ఎస్.ఎన్. మిశ్రా వున్నారు.

ఈ చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే వున్నవని, ఈ కమిటీ తిరిగి 20 వ తేదీన సమావేశమౌతుందని కమిటీ ప్రతినిధి ఒకరు చెప్పారు.

ఐ. ఏ. ఎస్. పరీక్షా ఫలితాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6— యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, నిరుడు అక్టోబర్, నవంబర్ నెలలలో నిర్వహించిన ఐ. ఏ. ఎస్.; ఐ. ఎఫ్. ఎస్. పరీక్షలలో ఉత్తీర్ణులై అర్హతాక్రమంలో మొదటి 135 స్థానాలు పొందిన అభ్యర్థుల పేర్లు మొన్న అధికార రీత్యా ప్రకటించబడినాయి. వారిలో షెడ్యూల్డు కులాలకు చెందినవారు 17 మంది, షెడ్యూల్డు జాతులకు చెందినవారు 7 మంది వున్నారు.

వారిలో ఈ క్రిందివారు కూడా వున్నారు శ్రీ యమ్. వేణు గోపాలరెడ్డి (67), శ్రీ వాడపల్లి ఆనందరావు (2758), శ్రీ ఓంకార్ రామచంద్రరావు (4063), శ్రీ పింగళి విశ్వేశ్వరరావు (1511), శ్రీ వైదిలక్ష్మయ్య సంజీవరెడ్డి (4722), శ్రీ గూడూరు రంగారావు (542) శ్రీ తిరుపాడు నాగరత్నం (4709), శ్రీ మంగళగిరి గోపాలకృష్ణమూర్తి (4684), శ్రీ దిక్కా రావప్పాలచంద్ర (6993).

పురూలియా నగరంలో కర్ఫ్యూ

పురూలియా, ఏప్రిల్ 6— పురూలియా డిప్యూటీ కమిషనర్ నిన్నటి నుంచి వారం రోజులపాటు నగర మంతటా రాత్రి 9 గంటల నుంచి ఉదయం అయిదు గంటల వరకు కర్ఫ్యూ విధించారు.

సంఘ వ్యతిరేక శక్తులు దోపిడీలు, గృహదహనాలు మున్నగు చర్యలకు పూనుకొంటున్న కారణంగా ఈ కర్ఫ్యూ విధింపబడినట్టు ఈ సందర్భంలో జారీ చేసిన అధికార ప్రకటనలో తెలుపబడింది.

కేరళ రెవిన్యూ మంత్రి శ్రీ టి. ఎ. థామస్ ఏప్రిల్ అయిదవ తేదీన మాట్లాడుతూ తమ రాష్ట్రంలో ఎదురౌతున్న పెక్కు కల్లోలాలకు బాధ్యత వార్తా పత్రికలదేనని ఆరోపించినట్టు త్రిచూర్ వార్త.

కృష్ణాజిల్లా ఉయ్యూరు బ్లాకులో 1962-63 సంవత్సరానికి చలివేంద్రపాలెం ఉత్తమ పంచాయతీగా ఎన్నికైన సందర్భంలో దాని అధ్యక్షులు శ్రీ డి. వెంకట్రామరెడ్డికి బ్లాక్ అధ్యక్షుడు శ్రీ కడియాల వెంకటేశ్వరరావు ఇటీవల వెయ్యి రూపాయల చెక్కును బహూకరిస్తున్న దృశ్యం

ప్రత్తి పంట అధికోత్పత్తి కృషి

కేంద్ర వ్యవసాయ మంత్రి డాక్టర్ రామ్ సుభగ్‌సింగ్ వివరణ

భటిండా, ఏప్రిల్ 6—ప్రత్తి అధికోత్పత్తి లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, గుజరాత్. మహారాష్ట్ర, పంజాబ్, మద్రాసు, రాజస్థాన్. ఉత్తర ప్రదేశ్‌లలో ప్యాకేజి కార్యక్రమం కింద 33 కేంద్రాలను ప్రారంభించినట్టు కేంద్ర వ్యవసాయ మంత్రి డాక్టర్ రామ్ సుభగ్‌సింగ్ నిన్న చెప్పారు.

మొత్తం దేశంలో ఒక లక్ష ఎకరాలకు పైగా భూమి ప్రత్తి సాంద్ర వ్యవసాయం కిందకు తీసికొనివచ్చినట్టు కూడా ఆయన తెలియజేశారు.

మంత్రి డాక్టర్ రామ్ సుభగ్‌సింగ్ ఇక్కడ ప్రత్తి ఉత్పత్తిదారుల సమావేశాన్ని ప్రారంభిస్తూ, ప్రత్తి ధరలను ఆలస్యంగా ప్రకటించినందుకు గడచిన కొన్ని సంవత్సరాలలో ఫిర్యాదులు వచ్చాయని. తాను టెక్స్‌టైల్ కమిషనర్‌తో ఈ విషయాన్ని గురించి చర్చించానని, కిందటి పత్తి పంట కాలంనుంచి ఉత్తరాదిలో పత్తి పంటవేసే ముందు మార్చి లేదా ఏప్రిల్ మాసంలోనే ధరలు ప్రకటిస్తున్నారని తెలిపారు.

ఇదే పద్ధతిని భవిష్యత్తులో కూడా అనుసరించగలరని తాను ఆశిస్తున్నానని మంత్రి చెప్పారు.

శ్రీ జి. పార్థసారథి న్యూఢిల్లీ రాక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 —పాకిస్తాన్‌లో భారత హై కమిషనర్ శ్రీ జి. పార్థసారథి రేపటి నుంచి ఇక్కడ ప్రారంభం కానున్న ఇండో-పాక్ హోం మంత్రుల సమావేశంలో పాల్గొనే నిమిత్తం నిన్న ఇక్కడకు వచ్చారు.

ఆయన ఇక్కడకు వచ్చిన వెంటనే హోం మంత్రి శ్రీ నందాను కలుసుకున్నారు.

మైసూరు ఆర్థిక మంత్రి శ్రీ బి. డి. జెట్టి ఏప్రిల్ అయిదవ తేదీ సాయంకాలం వాణిజ్య, పారిశ్రామిక మండలి సమావేశంలో ప్రసంగిస్తూ తమ సంస్థల పురోభివృద్ధి సాధనలో పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయం లభించగలదని హామీ నిచ్చినట్టు మైసూరు వార్త.

డిలక్స్
ఫ్యాన్సీ & కంగన్
సెంటర్
ఏలూరు రోడ్ – విజయవాడ.2

ప్రకటన
కొందరు వ్యక్తులు నా ద్వారా West Bengal రిజిస్ట్రేషన్ చేయించుదురా మని ప్రచారం చేయుచున్నట్లు తెలియుచున్నది. వారిని నమ్మి మోసపోక నేరుగా నా ద్వారా పొందవచ్చును. (W.B.) Govt. వారు ఆయుర్వేద ప్రాక్టీషనర్లను రిజిస్ట్రేషన్ చేయుచున్నారు. వివరములకు రు. 2/- పంపండి. డా॥ డి. హనుమంతరావు, R.M.P. 1767, మహంకాళి స్ట్రీట్, సికింద్రాబాద్, Phone ; 74693

రీ-టెండరు నోటీసు

వాల్తేరు గవర్నమెంటు మెంటల్ హాస్పిటల్ రోగుల అవసర నిమిత్తము 1-5-1964 నుండి 31-3-1965 వరకు "మాంసము-గ్రుడ్లు" సప్లై చేయుటకు సదరు హాస్పిటల్ సూపరింటెండెంటు వారి ఆఫీసునందు మంగళవారము 14-4-1964 మధ్యాహ్నం 2 గంటల వరకు సీలు వేసిన టెండర్లు తీసుకొనబడును.

కావలసిన పై రెండు వస్తువులు ఒక గ్రూపుగా వివరింపబడినవి. ఈ గ్రూపుకు కావలసిన టెండరు ఫారములుగాను రు 5/- (ఐదు రూపాయలు మాత్రము) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమునకు "XXIII. Medical Miscellaneous" అను హెడ్ ఆఫ్ ఎకౌంటునకు ప్రభుత్వ ట్రెజరీలో జమకట్టి చలానా ఫారములు సూపరింటెండెంటువారి ఆఫీసులో దాఖలు చేయవలయును. మరియు ఒక్కొక్క టెండరు సెట్టునకు రు. 0-10 న. పై. (పది నయాపైసలు మాత్రము) సేల్సు టాక్సు సూపరింటెండెంటువారి ఆఫీసునందు చెల్లించవలెను. అలా జమ కట్టిన వారికి ఒక్కొక్క సెట్టు టెండరు ఫారములు, టెండరు షరతులు ఇవ్వబడును.

ప్రతి టెండరు 1-1-1964 వ తేదీననుగాని, ఆ తర్వాత గాని పొందిన సాల్వెన్సీ సర్టిఫికేటుతో పొందుపరచబడి యుండవలెను. అట్టి సాల్వెన్సీ సర్టిఫికేటు తహశీల్దారుగారిచేగాని, దాని సరియైన నకలు మరియే గెజిటెడ్ ఆఫీసరుచేగాని, సంతకముపై యుండవలెను. మరియు రాబడి పన్ను. అమ్మకపు పన్ను సర్టిఫికేట్లు కూడా ప్రతి టెండరుతోనూ జతపరచవలెను.

సూపరింటెండెంటు.
గవర్నమెంటు మెంటల్ హాస్పిటల్,
వాల్తేర్, ది. 30-3-64.

భూటాన్ ప్రధాని శ్రీ దోర్జి దారుణ హత్య

ఫున్ట్సోలింగ్ పట్టణంలో అజ్ఞాత వ్యక్తి ఆయనను తుపాకితో కాల్చివేసినట్టు వార్త

గాంగ్‌టక్, ఏప్రిల్ 5—

భూటాన్ ప్రధాన మంత్రి శ్రీ జిగ్మెడోర్జీ ఒక అజ్ఞాత వ్యక్తి తుపాకి కాల్పులకు గురిఅయి నేటి రాత్రి మరణించారు.

కాల్పులు జరిగిన రెండుగంటల తర్వాత శ్రీదోర్జీ మరణించారు.

భూటాన్‌లో భారతీయ రాజకీయాధికారి శ్రీ అవతార్ సింగ్‌కు వీడ్కోలు చెప్పి తిరిగి వస్తున్న సమయంలో ఈ కాల్పుల సంఘటన జరిగింది.

శ్రీ అవతార్ సింగ్, ప్రధాని శ్రీ దోర్జీని సౌహార్ద పూర్వకంగా కలుసుకొనడానికి భూటాన్ వచ్చారు.

పశ్చిమ బెంగాల్ సరిహద్దులలో వున్న సాంచి పట్టణం వద్ద శ్రీ అవతార్ సింగ్‌ను కలుసుకొన్న తర్వాత కలకత్తా నుంచి వచ్చిన తన భార్యతో కలసి ఫుండ్సోలింగ్ వెళ్ళారని. ఆయన అక్కడ కాల్చివేయబడినారని కొన్ని వార్తలవల్ల తెలుస్తున్నది.

దోర్జీ దంపతులు ఇరువురూ కూర్చుని వున్న గదిలోకి కిటికీ గుండా ఒక బుల్లెట్ దోర్జీకి తగిలిందని ఆ వార్తలు తెలియజేస్తున్నవి.

శ్రీ అవతార్‌సింగ్ సంతాపం

భూటాన్‌లో భారత రాజకీయాధికారి శ్రీ అవతార్‌సింగ్ నేటి సాయంత్రం గాంగ్‌టక్ చేరుకున్నారు.

ప్రధాని శ్రీ దోర్జీ హత్యవార్త వినగానే శ్రీ అవతార్ సింగ్ పి. టి. ఐ. విలేకరితో మాట్లాడుతూ భారతదేశం ఒక గొప్ప మిత్రుని కోల్పోయిందని అన్నారు.

ఈ విషాద సంఘటన జరిగినందుకు తానెంతో విచారిస్తున్నానని, తాను నేటి ఉదయం ఇక్కడకు బయలుదేరేముందు శ్రీ దోర్జీ ఉల్లాసంగా వున్నారని శ్రీ అవతార్ సింగ్ తెలియజేశారు.

శ్రీ దోర్జీ సతీమణికి, ఆయన కుటుంబ సభ్యులకు శ్రీ అవతార్ సింగ్ తన సంతాపం తెలుపుతూ సందేశం పంపారు.

శ్రీ దోర్జీ నిన్న ఉదయం పశ్చిమ బెంగాల్ సరిహద్దులో వున్న భూటాన్ గ్రామం సాంచీ వద్ద శ్రీ అవతార్‌సింగ్‌ను కలుసుకొన్నారు. ఆ తర్వాత ఆయన తన సతీమణితో కలసి ఫంట్‌సోలింగ్ వెళ్ళారు. శ్రీ అవతార్‌సింగ్ గాంగ్‌టక్ వచ్చారు.

ప్రస్తుతం యూరపులో చికిత్స పొందుతున్న భూటాన్ మహారాజు అతి త్వరలోనే స్వదేశానికి తిరిగి రాగలరని భావిస్తున్నారు.

శ్రీ దోర్జీపట్ల గౌరవసూచకంగా గాంగ్‌టక్‌లోని భారత రాజకీయ అధికార కార్యాలయాన్ని నేడుకూడా మూసివేసే వుంచుతారు.

శ్రీ దోర్జీకి అంతిమ శ్రద్ధాంజలి ఘటించే నిమిత్తం భారత రాజకీయ అధికారి శ్రీ అవతార్ సింగ్ నేడు గాంగ్‌టక్‌నుంచి ఫంట్ సోలింగ్ వెడతారు.

శ్రీ దోర్జీ భౌతిక కాయాన్ని ఏప్రిల్ ఏడవ తేదీన భూటాన్ రాజధాని అయిన థంపూ తీసికొని వెడతారని శ్రీ సింగ్ చెప్పారు.

శ్రీ దోర్జీ మరణవార్తను లండన్‌లోవున్న ఆయన కుమారుడు పాల్జోర్ దోర్జీకి తెలియజేశారు. ఆయన నేడు స్వదేశానికి తిరిగి వస్తారు.

గాంగ్‌టక్‌లో సంతాపం

గాంగ్‌టక్, ఏప్రిల్ 6—భూటాన్ ప్రధాని శ్రీ జిగ్మి దోర్జీ స్మృతికి సంతాప సూచకంగా ఇక్కడి దర్బారు కార్యాలయాలన్నింటిపై సిక్కిం పతాకాన్ని సగం వరకు దించివేశారు.

భూటాన్ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రస్తుతం సిక్కిం దర్బార్ సలహాదారుడు రాజ్ బహదూర్ తాషీ దెన్సాపా, సిక్కిం ప్రధాన పరిపాలనాధికారి శ్రీ రామదాస్ నారాయణ్ హల్దీపూర్‌లు నేడు ఫన్‌ట్సోలింగ్ వెళ్ళారు.

జమ్మూ సమీపంలో భారత గస్తీ దళాలపై పాక్ సేనల కాల్పులు

ఇద్దరు మరణం

జమ్మూ, ఏప్రిల్ 6—

యుద్ధ విరమణ శ్రేణిపై ఇక్కడకు 56 మైళ్ళ దూరంలో గల మోయిల్ అనే గ్రామం వద్ద పాక్ సైనికులు 2 వ తేదీ రాత్రి దాడిచేసి భారత గస్తీ దళానికి చెందిన ఇద్దరిని కాల్చి వేసినట్టు నేడిక్కడ తెలియవచ్చింది.

భారత గస్తీ సైనికులు కూడా తిరిగి కాల్పులు జరిపారని, ఈ కాల్పులు రెండు గంటలపాటు జరిగాయని తెలియవచ్చింది.

పాకిస్తాన్ సైనికులకు ఎంత నష్టం వాటిల్లినదీ వివరాలు ఇంకా లభ్యం కాలేదు.

జనరల్ మెకార్థర్ మృతి

వాషింగ్టన్, ఏప్రిల్ 5—

కడచిన రెండు ప్రపంచ యుద్ధాలలో అమెరికా సేనానిగా పనిచేసిన జనరల్ డగ్లస్ మెకార్థర్ నేటి రాత్రి ఇక్కడ మరణించారు.

ఆయన వయస్సు 84 సంవత్సరాలు.

విజయవాడలో జాతీయ సత్యాగ్రహ సమితి సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 5—సత్యాగ్రహ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా నిర్వహించడానికి కార్యక్రమం రూపొందించడానికి ఎనిమిదవ తేదీన విజయవాడలో జాతీయ సత్యాగ్రహ సమితి కార్యకర్తల సమావేశం జరుగుతుందని శ్రీ గౌతు లచ్చన్న ఢిల్లీ నుంచి ఇక్కడకు రాగానే తెలియజేశారు.

ఎమెసి పోర్టుపై ఇటీవల బ్రిటిష్ విమానాలు జరిపినదాడి అమానుషమైనదని నిరసిస్తూ భద్రతా సంఘానికి ఏడెన్ రాజకీయవేత్తల బృందంవారు ఏప్రిల్ అయిదవ తేదీన ఒక కేబుల్‌ను పంపారు.

పి. ఎస్. పి., సోషలిస్టుపార్టీల లీనీకరణ

అమలు జరిపే దశలో కలదని శ్రీ పీటర్ ఆల్వారిస్ ప్రకటన

అమృతసర్, ఏప్రిల్ 5—ప్రజా సోషలిస్టు పార్టీ, సోషలిస్టుపార్టీల విలీనంకానికి సంబంధించిన కార్యక్రమాన్ని అమలు జరిపే దశలో ప్రస్తుతం కలదని పి. ఎస్. పి. జాతీయ కార్యవర్గం సభ్యుడు శ్రీ పీటర్ ఆల్వారిస్ నేడిక్కడ తెలియజేశారు.

దేశంలో సోషలిస్టు ఉద్యమం పురోగతికి నిజమైన సోషలిస్టు శక్తులు సమైక్యం కావడానికి ఈ రెండు పార్టీలు విలీనం కావడం ఆవసరమని ఆయన ఇక్కడ జరిపిన పత్రికా గోష్ఠిలో చెప్పారు.

దేశంలో పరిపాలనా యంత్రాంగంలో అన్ని విధాగాలలోను అవినీతి బాగా వ్యాపించినదని ఈ పరిస్థితిని రూపుమాపడానికి వెంటనే తగు చర్యలు తీసుకొనాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పాకిస్తాన్ వెళ్లిన నాగ విద్రోహులు

తిరిగి భారత భూభాగంలో ప్రవేశించకుండా నిరోధం

షిల్లాంగ్, ఏప్రిల్ 5—నాగాలాండ్ సరిహద్దు ప్రాంతాలలో గస్తీ తిరుగుతున్న భారతదళాలు ఆయుధాలకోసం తూర్పుపాకిస్తాన్ వెళ్ళిన నాగ దుండగులు తిరిగి భారత భూభాగంలో ప్రవేశించకుండా నిరోధిస్తున్నారని ఇక్కడకు వచ్చిన అధికార వార్తల ద్వారా తెలుస్తున్నది.

ఈ నాగ దుండగులు పాకిస్తాన్‌లో నూరు మరతుపాకులు, నాలుగు వందల ఆటోమాటిక్ రైఫిల్సు, చేతిబాంబులు సంపాదించారని తెలుస్తున్నది.

నాగభూమి సరిహద్దు పొడవునా రక్షణ దళాలు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నట్టు వార్తలు వచ్చాయి.

శ్రీ ఎ. ఆర్. వాడియా నాయకత్వాన గల యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ పర్యటన బృందం మద్రాసునుంచి ఈ నెల అయిదవ తేదీన బయలుదేరి ఢిల్లీ వెళ్ళినట్టు మద్రాసు వార్త.

వర్గ సామరస్య పంథాను చేపట్టాలని డాంగే యత్నం

కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యవర్గంలో 9 మంది అతివాద సభ్యుల ప్రత్యారోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5—

భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర సెక్రటేరియట్, శ్రీ ఎస్. ఎ. డాంగేలు, కమ్యూనిస్టుపార్టీని వర్గ సామరస్యం పంథాలోకి బలవంతంగా లాగుతున్నారని, పార్టీని చీల దీయాలన్న దృష్టితో వున్నట్టు కనిపిస్తున్నదని, కేంద్ర కార్యవర్గంలో వామపక్షానికి చెందిన తొమ్మిది మంది సభ్యులు నేడిక్కడ ప్రత్యారోపణ చేశారు.

నేడిక్కడ జరిగిన పార్టీ వామపక్షీయుల సమావేశానికి కేంద్ర కార్యవర్గం సభ్యులు తొమ్మిదిమంది హాజరైనారు,

ఈ సభ్యులు చేసిన ప్రకటన 900 పదాలతో వున్నది.

పార్టీ జాతీయ సమితితో సంబంధం లేకుండా సమస్యలపై నిర్ణయాలు చేయరాదన్న విషయాన్ని సెక్రటేరియట్, డాంగేలు విస్మరించినట్టుగా కనిపిస్తున్నవని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

వామపక్షీయుల సమావేశాన్ని "విచ్ఛిన్నకుల సమావేశంగా" పేర్కొంటూ గత శుక్రవారంనాడు కేంద్ర సెక్రటేరియట్ చేసిన ప్రకటనకు సమాధానంగా నేడీ ప్రకటన వెలువడింది.

"వాస్తవిక సమస్యలను" పెడత్రోవ పట్టించడానికి అధికారవర్గం "ప్రయత్నిస్తున్నదని, సెక్రటేరియట్‌లోని కొంత మంది సభ్యులు. సెక్రటేరియట్ సమావేశాలకు హాజరు కావడానికి నిరాకరిస్తున్న విషయం గమనార్హమని ఈ ప్రకటనలో పేర్కొన్నారు (ఈ సభ్యులు భూపేష్‌గుప్తా, పి. సి. జోషీలని తెలుస్తున్నది.) భూపేష్‌గుప్తా గత శుక్రవారంనాడు జరిగిన సెక్రటేరియట్ సమావేశానికి హాజరు కాలేదు. శ్రీ పి. సి. జోషి హాజరు కావడానికి కొన్ని షరతులు పెట్టారని తెలుస్తున్నది.

ఈ ప్రకటనపై క్రింది వారు సంతకాలు చేశారు. వీరు శ్రీయుతులు ఎ. కె, గోపాలన్, జ్యోతిబాసు, పి. రామమూర్తి, ఎమ్. బసవపున్నయ్య, పి. సుందరయ్య, ప్రమోద్‌దాస్ గుప్తా, జగ్‌జిత్‌సింగ్ లాయల్పురి, హరేకృష్ణ కోనార్, హరికిషన్ సింగ్ సూర్జిత్‌లు.

భారత కమ్యూనిస్టు పార్టీలో అతివాదులు, చైనా కమ్యూనిస్టులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వారు డాంగేనుబహిరంగంగా నిందిస్తున్నారని సెక్రటేరియట్ చేసిన ఆరోపణలకు సమాధాన మిస్తూ, పార్టీ అధ్యక్షుడైన డాంగేకు సంబంధించిన తీవ్రమైన సమస్యలను ప్రక్కకు నెట్టి వేయడానికి చేస్తున్న ప్రయత్నమని వామపక్ష సభ్యులు పేర్కొన్నారు.

40 సంవత్సరాల క్రితం అప్పటి వైస్రాయికి డాంగే వ్రాసినట్టు చెప్పబడుతున్న లేఖలు, మారు పేరుతో (డాంగే) ఢిల్లీలోని ఒక పత్రికలో 30 వేల రూపాయల విలువగల వాటాలను కలిగివున్న విషయాలను, పార్టీలోని అంతరంగిక విభేదాలకు లేదా రాజకీయ విధానాలలో గల భేదాలకు ఎట్టి సంబంధం లేదని. డాంగేపై వచ్చిన వ్యక్తిగతమైన ఆరోపణలను రాజకీయ సమస్యలకు ముడిపెట్టరాదని ఈ ప్రకటనలో వివరించారు.

శ్రీమతి రేణు చక్రవర్తి హోమిదాజీల ప్రకటన

పార్లమెంటు సభ్యులు (కమ్యూనిస్టు) శ్రీమతి రేణుచక్రవర్తి, శ్రీ హోమిదాజీలు నేడిక్కడ ప్రత్యేక ప్రకటన చేశారు. అప్రకటనలో క్రిందివిధంగా పేర్కొన్నారు.

"శ్రీ డాంగే లేఖలకు సంబంధించిన ఫైళ్లు రికార్డులు, అసలు లేఖలను మేము పరిశీలించాము, వీటిలో అనేకమైన అస్తవ్యస్త విషయాలు వున్న కారణంగా అనేక అనుమానాలు కలుగుతున్నవి. శ్రీ బసవ పున్నయ్య బయట పెట్టిన లేఖలకు మేముచూచిన లేఖలకు ఇతర డాక్యుమెంట్లకు భేదం కనిపిస్తున్నది.

"ఇంటివంటి తీవ్రమైన సమస్యను సాధనంగా తీసుకుని పార్టీని, దేశాన్ని తప్పుత్రోవ పట్టించడానికి ప్రయత్నించడం పూర్తిగా అనుచితమని భావిస్తున్నాము. మేము వివరమైన నివేదికను పార్టీకి అందజేస్తున్నాము."

డాక్టర్ లోహియా అమెరికా పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5— అమెరికా తదితర దేశాలలో పర్యటించడానికి సోషలిస్టు పార్టీ నాయకుడు డాక్టర్ రామమనోహర లోహియా 16 వ తేదీన ఇక్కడ నుంచి బయలుదేరుతున్నారు.

ఆయన ముందుగా అమెరికా వెడతారు.

ఏప్రిల్ రెండవ తేదీన వైమానిక దళ వార్షికోత్సవం ముగింపు సందర్భంలో సీనియర్ నాన్-కమిషన్డ్ ఆఫీసర్ల గౌరవార్థం జరిపిన విందుకు హాజరైన కొంతమంది అతిథులతో వైమానిక దళ ప్రధానాధికారి ఎయిర్ మార్షల్ ఇంజినీర్

రానున్న పంచవర్ష ప్రణాళికల స్వరూపం

ఉన్నత ప్రమాణంలో వుండగలవని ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుని సూచన

మద్రాసు, ఏప్రిల్ 5—

మొదటి మూడు ప్రణాళికల కంటే, రానున్న 4, 5, 6 ప్రణాళికలు ఉన్నత ప్రమాణంలో వుండగలవని, వాటిని అమలు జరపడానికి ఇతోధికంగా కృషి చేయవలసి వుంటుందని ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు శ్రీ అశోక మెహతా నేడిక్కడ చెప్పారు.

శ్రీ అశోక మెహతా నేడిక్కడ జరిపిన పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ పై విధంగా చెప్పారు.

ప్లానింగ్ అంటే పర్వతాన్ని అధిరోహించడమని. మనం ఇప్పుడు ప్లానింగ్ అనే పర్వతాన్ని అధిరోహిస్తున్న దశలో వున్నామని ఏడవ ప్రణాళిక వచ్చేనాటికి మనం సూర్య కిరణాలు పడే పీఠ భూమికి చేరుకొన్నట్టు కాగలదని ఆయన అభివర్ణించారు.

ప్రణాళికలను రూపొందించేటప్పుడు సమాజంలోని అన్నివర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనాలని, ప్రణాళికా చైతన్యాన్ని ప్రజలలో పెంపొందించడానికి యూనివర్సిటీలు, వ్యాపారకుల సంఘాలు, ట్రేడ్ యూనియన్‌లు కృషి చేయాలని ఆయన అన్నారు.

ప్రణాళికా చైతన్యాన్ని ప్రభుత్వం మాత్రమే కలుగజేయ జాలదని, దేశంలోని అన్ని వర్గాలవారు ఇందుకు బాధ్యత వహించాలని ఆయన చెప్పారు.

ప్రతి రాష్ట్రంలోను ప్లానింగుబోర్డు ఏర్పాటు చేసే సమస్య ఆ యా రాష్ట్రాలకు సంబంధించినదైనప్పటికీ అటువంటి బోర్డులను నెలకొల్పడం సముచితమేనని శ్రీ మెహతా సూచించారు.

నాల్గవ ప్రణాళిక విజయవంతం కావడానికి వీలుగా ప్రజలు సమైక్యంతో కృషి చేయగల మార్గాలను అన్ని రాష్ట్రాల వారు అన్వేషించాలని ఆయన కోరారు.

నాల్గవ ప్రణాళిక ఏ రూపంలో వుండగలదో మీరు సూచించగలరా అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు శ్రీ మెహతా సమాధానమిస్తూ, అది ఇప్పుడే "సాధ్యం కాదని" చెప్పారు.

నాల్గవ ప్రణాళికకు సంబంధించిన ప్రాథమిక అంచనాలు గల ఒక నివేదికను ప్లానింగ్ కమిషన్ జాతీయాభివృద్ధి మండలికి సమర్పించ గలదని తెలియజేశారు. ఆ తర్వాత ప్రణాళిక స్వరూపం రూపొందించ బడగలదని, అనంతరం తుది ప్రణాళిక తయారు కాగలదని పేర్కొన్నారు,

ప్రణాళికను అమలు జరిపే ప్రతిదశలోను ప్లానింగ్ కమిషన్ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొన గలదని చెప్పారు.

దేశం ఒక ప్రణాళికను ముగించి మరొక ప్రణాళికలో ప్రవేశిస్తున్నప్పుడు ప్రణాళికల స్వరూపం విస్తృతం కాగలదని ఆయన చెప్పారు.

మైసూరు కాంగ్రెస్‌లో "సదాచార సమితి"

మైసూరు, ఏప్రిల్ 5—మాజీ మంత్రులు, అసంతృప్తి చెందిన కొందరు కాంగ్రెసువాదులూ కలిసి, మైసూరులో "కాంగ్రెస్ సదాచార సమితి"ని స్థాపించారు.

వీరిలో ప్రదేశ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శ్రీ యస్. చెన్నయ్య కూడా ఉన్నారు. మాజీ మంత్రులలో శ్రీయుతులు హెచ్. ఎం. చెన్నబసప్ప, ఎ. జి. రామచంద్రరావు, మాలి మరియప్ప, ఎన్. రాచయ్య, హెచ్. సిద్ద వీరప్పవున్నారు.

వీరందరిపైనా క్రమశిక్షణ గైకొనవలెనని ప్రదేశ్ కాంగ్రెసు సమితి నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

ఆహార ధాన్యాల లైసెన్సింగు ఉత్తర్వులు

సవరించని పక్షంలో వ్యాపారం నిలిపివేయడానికి వర్తకుల నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 6—

ఆహారధాన్యాల వర్తకుల లైసెన్సింగు ఉత్తర్వును సవరించాలని ఆంధ్రప్రదేశ్ ఆహారధాన్యాల వర్తకుల సంఘం నిన్న ఇక్కడ జరిపిన సమావేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

రాష్ట్ర ఆహార ధాన్యాల వర్తకుల లైసెన్సింగ్ ఉత్తర్వులో వర్తకులకు ఇబ్బంది కలిగించే క్లాజులు తొలగిస్తూ, ప్రభుత్వం ఈ ఉత్తర్వును సవరించేవరకు ఆహార ధాన్యాల వాణిజ్యం మూసివేయాలని నిన్న ఇక్కడ సమావేశమైన ఆంధ్ర ప్రదేశ్ ఆహార ధాన్యం వర్తకుల అడ్‌హాక్ కమిటీ తీర్మానించింది, ఏప్రిల్ 21 నుంచి ఈ పనికి పూనుకొనాలని కూడా కమిటీ నిర్ణయించింది.

ఈ సభకు రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సహాయ కార్యదర్శి శ్రీ కె. రోశయ్య అధ్యక్షత వహించారు.

ప్రభుత్వం ఈ విషయంలో హామీ ఇచ్చినా, సెక్యూరిటీ డిపాజిట్ మొత్తం కొద్దిగా తగ్గించడం మినహాగా లైసెన్సింగ్ ఉత్తర్వులో ఎట్టి మార్పు చేయలేదని ఈ కమిటీ తన తీర్మానంలో పేర్కొన్నది.

వర్తకులవద్ద తీసుకునే సెక్యూరిటీ డిపాజిట్‌కు సంబంధించిన క్లాజును కూడా తీసివేయాలని, అలా చేయడం సాధ్యపడని పక్షంలో ఆ డిపాజిట్ రుసుమును టోకు వర్తకుల విషయంలో 500, చిల్లర వర్తకుల విషయంలో 100 రూపాయలవరకు తగ్గించాలని అడ్‌హాక్ కమిటీ కోరింది.

ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా రేపు 20 వ తేదీనుంచి తమ దుకాణాలను మూసివేయాలని వర్తకులు నిర్ణయించుకొన్నారు.

ప్రత్యక్ష చర్యలో బియ్యం వర్తకులకు తోడ్పాటు

మిల్లర్లు కూడా అందజేసే అవకాశం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విజయవాడ, ఏప్రిల్ 6 — ఆంధ్రప్రదేశ్ ఆహార వస్తువుల వర్తకుల లైసెన్సింగ్ ఉత్తర్వులోని కొన్ని నిబంధనలను తొలగించాలని కోరుతూ రేపు 20 వ తేదీన వర్తకులు తలపెట్టిన ప్రత్యక్ష చర్యకు రాష్ట్రంలోని మిల్లర్లు చేయూత నివ్వగలరని నేడిక్కడ రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధి తెలిపారు.

ఉస్మానియా యూనివర్శిటీ ప్రాచ్య ప్రచురణల సంస్థ

కృషికి కేంద్రమంత్రి శ్రీ చాగ్లా సంతృప్తి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 6 —కేంద్ర విద్యాశాఖమంత్రి శ్రీ ఎం. సి. చాగ్లా నిన్న సాయంత్రం ఇక్కడ ఉస్మానియా యూనివర్శిటీ వారి ప్రాచ్య ప్రచురణల బ్యూరోను సందర్శించి, అక్కడ జరుగుతున్న కృషికి సంతృప్తి వెలిబుచ్చారు.

బ్యూరో ప్రచురణలు మధ్యప్రాచ్య దేశాలలో విక్రయించగా 80 వేల రూపాయల విదేశమారక ద్రవ్యం లభించినది బ్యూరో రాజకీయ ప్రాముఖ్యాన్ని గురించి శ్రీ చాగ్లా ప్రస్తావించి అరబ్బీ, పర్షియన్ పండితులను ప్రోత్సహించవలసిన అవసరాన్ని వక్కాణించారు. తద్వారా ఇండియా, అరబ్ దేశాల మధ్య సౌహార్ద్ర సంబంధాలను మెరుగు పరచుకో వచ్చని వివరించారు.

బ్యూరో విషయంలో ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. ఎస్. రెడ్డి చూపుతున్న ఆసక్తికి శ్రీ చాగ్లా జోహార్లర్పించారు. సరియైన నాయకత్వం లేనట్టయితే ఏ యూనివర్శిటీ అభ్యున్నతి సాధించజాలదని ఆయన పేర్కొన్నారు.

డాక్టర్ రెడ్డి హయాంలో పెక్కు కార్యక్రమాలు సఫలమయినవని, తద్వారా భారత విద్యా పటంలో యూనివర్శిటీని ఉన్నత స్థానంలో వుంచగలదని శ్రీ చాగ్లా ఆశాభావం వెలిబుచ్చారు.

తాడేపల్లిగూడెంలో ఎడ్లబండి, జీప్ ఢీ: ముగ్గురికి గాయాలు

తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 6 — గత నెల 30 వ తేదీన ఇక్కడ పోలీస్ స్టేషన్ సమీపంలో ఒక ఎడ్ల బండిని ఒక జీప్ ఢీకొనగా బండిలోవున్న తాలూకా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ వెలగల దానిరెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. బండి తోలుతున్న వ్యక్తికీ, మరొక వ్యక్తికీ తీవ్రంగా గాయాలు తగలగా వారిని ఆసుపత్రిలో చేర్చారు. శ్రీ దానిరెడ్డి నర్సింగ్ హోమ్‌లో కోలుకున్నారు. లైసెన్సులేని ఒక వ్యక్తి ఆ జీప్ నడుపుతున్నట్టు చెప్పబడుతున్నది.

సైప్రస్ సంక్షోభం:

టర్కిష్ గ్రామంపై గ్రీకుల ద్విముఖ దాడి

మరి పెక్కు చోట్ల కూడా పెద్ద ఎత్తున కాల్పులు జరుగుతున్నట్టు వార్త

నికోసియా, ఏప్రిల్ 6—

వాయువ్య సైప్రస్‌లోని టర్కిష్ సైప్రియాట్ జాతీయుల గ్రామమైన మన్సోరాపై గ్రీక్ సైప్రియాట్ వర్గంవారు ద్విముఖమైన దాడిని జరిపారని సమితి ప్రతినిధి గత అర్ధ రాత్రి వేళ ప్రకటించారు.

సైప్రస్‌లో చెలరేగినమతకలహాలలో రాత్రి వేళ పోరాటం జరగడం ఇదే మొదటిసారని ఆయన అన్నారు.

గ్రీక్ సైప్రియాట్ జాతీయులు తూర్పు, దక్షిణ దిశలనుంచి మన్సోరాపై దాడి చేశారని, ఆ గ్రామంలో సమితి గస్తీ కేంద్రం కూడా ఒకటి వున్నదని ఆయన చెప్పారు.

ఈ ప్రాంతంలో గ్రీక్, టర్కిష్, సైప్రియాట్ జాతీయులు కాల్పులు జరపకుండా చేయడానికి సమితి అధికారులు తీవ్రంగా ప్రయత్నించారని ఆయన అన్నారు.

వాయువ్య సైప్రస్‌లోని మరి అయిదు గ్రామాలలో కూడా పెద్ద ఎత్తున కాల్పులు ప్రారంభమైనవని ఆయన తెలిపారు.

మన్సోరా గ్రామంలో సమితికి చెందిన బ్రిటిష్ సైనికులు ఆత్మ రక్షణకు ఎదురు కాల్పులు జరిపారని, గ్రీక్ సైప్రియాట్లు గ్రామం ప్రక్కనే వున్న కొండ ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నారని ఆయన చెప్పారు.

కొక్కినా, పఖమస్ గ్రామాలలోకూడా అప్పుడప్పుడూ కాల్పులు జరుగుతున్నవని ఆయన అన్నారు.

నిన్న రాత్రి బ్రిటిష్ పారాచూట్ దళాన్ని ఆరలింగ పుమెనియాలో కూడా పోరాటం సంభవించినట్టు తెలుస్తున్నది. బ్రిటిష్ సైనికాధికారి జనరల్ మైకేల్ కార్వెల్ హెలికాప్టర్‌లో అక్కడకు వెళ్లారు.

సైప్రస్, టర్కీల రక్షణ సంధి రద్దు: లండన్‌కు నికోసియా వర్తమానం

టర్కీతో కుదుర్చుకొన్న రక్షణ సంధిని రద్దు చేస్తూ ప్రెసిడెంట్ మకారియోస్ టర్కీ ప్రధానికివ్రాసిన లేఖ ప్రతిని బ్రిటన్‌కు కూడా అందజేసినట్టు అధికార వర్గాలవారు నిన్న యిక్కడ తెలియజేశారు.

ఈ లేఖను బ్రిటిష్ ప్రభుత్వం పరిశీలిస్తున్నదని వారు అన్నారు.

టర్కీచే సైప్రస్ నిర్ణయం త్రోసి వేత

అంకారా ఏప్రిల్ 6—సైప్రస్, గ్రీస్, టర్కీల మధ్య 1960 లో కుదిరిన రక్షణ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దుచేయడానికి ప్రెసిడెంట్ మకారియోస్ చేస్తున్న ప్రయత్నం పూర్తిగా విలువలేనిదని టర్కీ ప్రభుత్వం నేడు త్రోసిపుచ్చింది.

సమితి సైనికుల అరెస్టులు!

నికోసియా, ఏప్రిల్ 6—ఈశాన్య సైప్రస్‌లోని కాటోపిర్గోస్ గ్రామంలో గ్రీక్ సైప్రియాట్ సైనికులు నిన్న కొంతమంది సమితి సైనికులను అరెస్టు చేసి, నిరాయుధులను కావించారు.

సైప్రస్ సంక్షోభం ప్రారంభమైన తర్వాత ఇలాంటి సంఘటన జరగడం ఇదే మొదటి సారి.

సైప్రస్‌లోని పాత బ్రిటిష్ హైకమిషనర్ సర్ ఆర్థర్ క్లార్క్ గత రాత్రి ఓడలో స్వదేశానికి బయల్దేరి వెళ్ళారు.

మిగ్ విమానాల ఉత్పత్తి

కార్యక్రమం వివరాలపై రష్యన్ నిపుణులు చర్చలు జరుపుతున్నట్టు మంత్రి వెల్లడి

జబల్పూరులో 30 ఎం. ఎం. ఆయుధ సామగ్రి ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి అయినట్టు శ్రీ రఘురామయ్య ప్రకటన

జబల్పూర్, ఏప్రిల్ 6—

దేశంలో మిగ్-21 జెట్ ఫైటర్ విమానాల ఉత్పత్తి కార్యక్రమం సత్వర నిర్వహణకు ప్రయత్నాలు జరుగుతున్నవని, సోవియెట్ నిపుణుల బృందం ఈవారమే ఇండియా వచ్చిందని, వారు భారత సాంకేతిక నిపుణులతో కార్యక్రమ వివరాలపై చర్చలు జరుపుతున్నారని రక్షణోత్పత్తిశాఖా మంత్రి శ్రీ కొత్త రఘురామయ్య నిన్న ఇక్కడ చెప్పారు.

శ్రీ రఘురామయ్య పత్రికా విలేకరుల సమావేశంలో ఇంకా ఇలా అన్నారు:

"ఇక్కడ 30-ఎం.ఎం. ఆయుధపరిపరాల ఫ్యాక్టరీ నిర్మాణం నేడు పూర్తి అయింది. దాన్ని ప్రారంభించిన తర్వాత మూడు మాసాలలోనే స్థాపించగలగడం గమనార్హమైన విషయం.

"ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి రెండుకోట్లు ఖర్చు అయింది, బ్రిటిష్ రాయల్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ లైసెన్స్ ఒప్పందాన్ని అనుసరించి ఈ పథకాన్ని నిర్వహించాము.

"దేశంలో స్థాపించిన ఈమాదిరి ఫ్యాక్టరీలలో ఇదే మొదటిది. భారతీయ సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లు ఈ ఫ్యాక్టరీని పూర్తిగా నెలకొల్పారు.

"చైనా దురాక్రమణ జరిపిన తర్వాత 30 కొత్త రకాల ఆయుధాలను ఉత్పత్తి చేయడానికి నిర్ణయించాము. చైనా ముట్టడి జరిపినప్పుడు మనకు లేకపోయిన పరికరాల అభివృద్ధికి పరిశోధన కృషిని కూడా ప్రారంభించాము. ఎత్తయిన ప్రాంతాలలో ఉపయోగించడానికి అవసరమైన పరికరాలను, ఆహార పదార్థాలను సమకూర్చుకొనడానికి ప్రాధాన్యమిస్తున్నాము."

రాకెట్ల అభివృద్ధికి అనుసరిస్తున్న విధానాన్ని గురించి తెలియజేయాలని కోరగా, మూడు దశలతో కూడిన రాకెట్ నిర్మాణానికి కృషి జరుగుతున్నదని మంత్రి చెప్పారు.

సూపర్ సానిక్ ఫైటర్ల ఉత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి సాధించామని కూడా శ్రీ రఘురామయ్య ప్రకటించారు.

హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, ఏప్రిల్ 6—హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీ ఎస్. చెన్నారెడ్డి ఈ క్రింది వారిని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంగా నియమించారు.

వారు శ్రీయుతులు, అరిగె రామస్వామి (ఎం. ఎల్. ఎ.), కె. జగన్మోహనరెడ్డి (ఉపాధ్యక్షులు), శ్రీ ఎస్. నారాయణ గౌడ్ (కోశాధికారి), ఎం. భోజరెడ్డి (ఎం. ఎల్.ఎ.), వి. నిర్సప్ప, సి. విశ్వనాథం, ఎం. వీరమల్లప్ప, ఎం. మాణిక్యారావు, [illegible] రెడ్డి, కె. నిర్సప్ప, ఎస్. వెంకట్రామిరెడ్డి, జస్వంతరెడ్డి, కె. సత్యనారాయణరెడ్డి, ఎన్. సీతారామరెడ్డి, ఎం. జనార్దనరావు. వి. నారాయణరెడ్డి, ప్రభాకరరెడ్డి, పార్లమెంటుసభ్యురాలు శ్రీమతి సంగం లక్ష్మీబాయమ్మ (సభ్యులు).

కార్యదర్శులుగా శ్రీయుతులు ఎం. వీరమల్లప్ప, కె. ప్రభాకరరెడ్డి గార్లను నియమించారు.

ఈ జిల్లా కాంగ్రెస్ కార్యవర్గం మొదటి సమావేశం ఏప్రిల్ 18వ తేదీన జరుగుతుందని ప్రకటించింది.

"అన్ని తరగతులకు ప్రాతినిధ్యం వహిస్తున్నది కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే"

వరంగల్ సభలో శ్రీ కామరాజ్ ఉద్ఘాటన

వరంగల్, ఏప్రిల్ 6—దేశంలో అన్ని తరగతుల ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూ వారి అభిప్రాయాలను ప్రతిబింబిస్తున్న జాతీయ పక్షం కాంగ్రెసు ఒక్కటేనని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్ నిన్న రాత్రి ఇక్కడ ఉద్ఘాటించారు.

మిగిలిన పార్టీలన్నీ ప్రజలలో ఒక వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ కాంగ్రెస్ స్థానాన్ని భర్తీ చేసే పటిష్ఠమైన ప్రజాస్వామ్య ప్రతిపక్షం ఏర్పడే వరకు కాంగ్రెస్ పార్టీయే అధికారంలో వుంట గలదని, దేశాభ్యుదయ సాధనకు కృషి చేయ గలదని ఆయన అన్నారు.

కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి తొలగించడమే ప్రతిపక్షాల లక్ష్యమని, ఈ విషయంలో వారి కృషి ఫలించినా వారు ఒక్క రోజు కూడా దేశాన్ని పాలించలేరని, ఎందువల్లనంటే దేశానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై వారికి భిన్నాభిప్రాయాలు కలవని శ్రీ కామరాజ్ అన్నారు.

జనసంఘం, కమ్యూనిస్టు, స్వతంత్ర పార్టీలు తమ స్వార్థాన్ని కోసం [illegible] దుష్ప్రచారం సాగిస్తున్నవని ఆయన విమర్శించారు.

గ్రామ కాంగ్రెస్ సంఘాలను పునరుద్ధరించడానికి ప్రజానీకంతో సన్నిహిత సంబంధాలను పెట్టుకొనడానికి కృషి చేయాలని ఆయన కాంగ్రెస్ వాదులకు విజ్ఞప్తిచేశారు.

కాంగ్రెస్ వాదులు తాలూకా, జిల్లా కేంద్రాలలో కనీసం నెలకు ఒక్క సమావేశం ఏర్పాటు చేయాలని. తద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకొనడం సాధ్యపడుతుందని శ్రీ కామరాజ్ చెప్పారు.

కాంగ్రెస్ లక్ష్యం సోషలిస్టు సమాజ సంస్థాపనే నని చెబుతూ పరిమితిని మించి సంపాదించడం నిరుపయోగమూ, హానికరమూ అని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లెజిస్లేచర్‌పార్టీ నాయకుడు శ్రీ నీలం సంజీవరెడ్డి, ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు. తమ విభేదాలను విస్మరించి సమైక్యంగా కృషి చేయాలని వారు కాంగ్రెస్ వాదులకు విజ్ఞప్తి చేశారు.

కొణకంచిలో కావ్యావిష్కరణ

శ్రీ చిర్రావూరి నాగభూషణాచార్యులుగారికి ఘన సన్మానం

కొణకంచి, ఏప్రిల్ 6—నిర్మాణ కార్య దీక్షాపరుడు, "పంచాయతీ రాజ్య" సంపాదకులు శ్రీ చిర్రావూరి నాగభూషణాచార్యులుగారికి, వారి జన్మస్థానమైన కృష్ణా జిల్లా కొణకంచి గ్రామంలో ఏప్రిల్ ఒకటవ తేదీన ఘన సన్మానం జరిగింది. శ్రీ చింతలపాటి బుచ్చి వెంకటేశ్వరశర్మ అధ్యక్షత వహించారు.

నందిగామ పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్, ఆచార్యులుగారి ఛాయా చిత్రమును కాంగ్రెసు భవనమునందు ఆవిష్కరించారు. దర్శనాచార్య శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు, శ్రీ నాగభూషణాచార్యులు రచించిన "విజయధ్వజి" అను దేశరక్షణ ప్రచార నాటికను ఆవిష్కరించారు.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ రేపాల బుచ్చిరామశేషయ్యశ్రేష్ఠి సన్మాన పత్రమును సమర్పిస్తూ, శ్రీ ఆచార్యులుగారి సేవలను ప్రస్తుతించి నూతన వస్త్రములతో సత్కరించారు. కొణకంచి గ్రామ పంచాయతీ బండిపాలెం గ్రామ పంచాయతీవారు ఆచార్యులవారికి పౌర సన్మానముచేసి సన్మాన పత్రములు సమర్పించారు. కొణకంచి కోపరేటివ్ సొసైటీ, బండిపాలెం కోపరేటివ్ సొసైటీ, మండలి కాంగ్రెసు, హరిజన విద్యార్థి సంఘం, కొణకంచి గ్రామ యువక మండలి, హైస్కూలు పాత విద్యార్థి సంఘం, నందిగామ తాలూకా స్వర్ణకారుల సంఘం. ఆచార్యులుగారికి సన్మాన పత్రములు సమర్పించారు.

అధ్యక్షులు ప్రసంగిస్తూ ఆచార్యులుగారు తమ వద్ద చదువుకున్నారని, ప్రశంసనీయమైన ప్రజాహిత జీవనం గడపుతున్నారని తెలిసికొనుటకు సంతసిస్తున్నానని, ఇతోధిక ప్రజాసేవ చేయవలెనని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

నందిగామ పంచాయతీ అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులవారు పంచాయతీ రాజ్య పరిపాలనలో దక్షులని, నిరాడంబరమైన నిజాయితీగల ఉద్యోగిగా పలువురి ప్రశంసలను అందుకొన్నారని అనేక సందర్భములలో అన్య రాష్ట్ర వాసుల మన్ననలను కూడా చూరగొన్న సంగతి తమకు తెలుసునని రెండు మూడుఘట్టములనువివరించారు. శ్రీకొండూరు వీరరాఘవాచార్యులు "విజయధ్వజి" నాటికను ఆవిష్కరిస్తూ ఈనాడు ప్రతి రంగంలో నైతిక పతనము కనబడుతున్నదని, ఇటువంటి విషమ సమయంలో గాంధీ మార్గగాములైన ఆచార్యులుగారి వంటి ఉత్తమ సేవకుల పవిత్ర సేవలు దేశానికెంతో అవసరమని చెప్పారు. శ్రీ కొణకంచి వెంకటేశ్వరరావు,గరికపాటి కృష్ణమూర్తి ప్రసంగించారు.

ఆహ్వాన సంఘ కార్యదర్శి శ్రీ కాకుమాను రామకోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. శ్రీ నలబోతు రామనాథం అతిథులకు విందు చేశారు. "విజయధ్వజి" నాటికలో సైనికుని ఏకపాత్రాభినయము సభవారి ప్రశంసల నందుకొన్నది.

చిట్యాలలో గ్రామీణ రేడియో గోష్ఠి

నల్గొండ, ఏప్రిల్ 5—నార్కట్‌పల్లి బ్లాకు ప్రాంతంలోని చిట్యాల గ్రామంలో ఏప్రిల్ ఒకటవ తేదీన "గ్రామీణ రేడియో గోష్ఠి" కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఇందుకు సంబంధించిన ఒక సంఘంలో సుమారు ఇరవై మంది సభ్యులు చేరారు. అధ్యక్షులు శ్రీ యిమ్మడి నర్సయ్య, ఉపాధ్యక్షులు శ్రీ పి. వి. నర్సింహారావు, సంచాలకుడు శ్రీ కె. లింగారెడ్డి ఎన్నికైనట్టుగా శ్రీ మోహన్ రెడ్డి (ఎస్. ఇ. ఒ) ప్రకటించారు.

ఈ సందర్భంగా యేర్పాటు చేయబడిన ఒక సమావేశంలో శ్రీ మోహన్‌రెడ్డి ప్రసంగిస్తూ అధికోత్పత్తిని సాధించడానికి వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతి అమలుకు గ్రామీణ రేడియో గోష్ఠి ప్రజలకెంతో దోహదకారి అవుతుందని పేర్కొన్నారు. ప్రప్రథమంగా గ్రామీణ రేడియో గోష్ఠి కార్యక్రమం డెన్మార్క్ దేశంలో ఆచరింపబడిందని, అక్కడ ఫలితాలు చాలా సంతృప్తికరంగా వున్నవని, మన ప్రభుత్వం కూడా గ్రామీణ రేడియో గోష్ఠులను ఏర్పాటుచేసి అభ్యున్నతికి కృషి చేస్తున్నదని, ఇటువంటి అవకాశాలు వినియోగించుకొని వ్యవసాయాభివృద్ధికి తీవ్రమైన కృషి సలపాలని ఆదేశించారు.

వల్లాపురం పంచాయతీ కార్యాలయం

కోదాడ పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ నాగేశ్వరరావు వల్లాపురం పంచాయతీ భవనానికి ఏప్రిల్ రెండవ తేదీన ప్రారంభోత్సవం జరిపారు.

సుమారు రు. 2500 ప్రజా విరాళంతో నిర్మించబడింది. ఈ సందర్భంలో కమిటీ అధ్యక్షులు ప్రసంగిస్తూ పంచాయతీ రాజ్యం పటిష్ఠం కావడానికి ప్రజల సహకారం అవసరమని అన్నారు.

నల్గొండలో ఖాదీ గ్రామోద్యోగ భండార్

జిల్లా కలెక్టర్ శ్రీ కె. బి. లాల్ నల్గొండ ఖాదీ గ్రామోద్యోగ భండారుకు ఏప్రిల్ రెండవ తేదీన ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంలో కలెక్టర్ ప్రసంగిస్తూ దేశాభివృద్ధికి కుటీర పరిశ్రమలు ఆవశ్యకములన్నారు.

పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ దయారాంప్రసాద్ ప్రసంగించారు.

గాంధీజీ కలలుకన్న రామరాజ్య లక్ష్యం

పంచాయతీరాజ్ పథకంద్వారా నెరవేర గలదని వరంగల్‌లో శ్రీ కామరాజ్ వివరణ

వరంగల్, ఏప్రిల్ 6—

దేశంలోని గ్రామాలను స్వయం పాలితం చేయాలన్న గాంధీజీ ఆశయానికి మనం ఇంకా చాలా దూరంలో వున్నప్పటికి పంచాయతీ రాజ్ పథకాన్ని చేపట్టడంద్వారా ఈ లక్ష్య సాధనకు మనం పెద్ద చర్యను తీసుకొన్నామని కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజ్ నిన్న ఇక్కడ వివరించారు.

నిన్న ఉదయం విజయవాడ నుంచి వరంగల్‌కు వచ్చిన శ్రీ కామరాజ్ ఇక్కడ మూడున్నర లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన జిల్లా పరిషత్ భవనానికి ప్రారంభోత్సవం చేస్తూ పై విధంగా అన్నారు.

గ్రామీణులను విద్యావంతులను చేయడం ద్వారా వారి మేధాశక్తిని పెంపొందింపచేయడంవల్లనే గాంధీజీ కలలుగన్న "రామరాజ్య" స్థాపన లక్ష్యం నెరవేరగలదని శ్రీ కామరాజ్ చెప్పారు.

పంచాయతీ రాజ్ సంస్థల ద్వారా అధికార వికేంద్రీకరణకు తీవ్ర కృషి జరిగినపుడు ఇది సాధ్యం కాగలదని ఆయన వివరించారు.

గ్రామ పంచాయతీలవంటి చిన్న సంస్థలకు బాధ్యతలు ఒప్పగించి, తద్వారా గ్రామీణులు సంక్షేమ పథకాలను స్వయంగా రూపొందించుకొని, వాటి నిర్మాణం సాగించుకొనేటట్టు చేయడంద్వారా ప్రజలు వారి సమస్యలని గ్రహించేటట్టు చేయగలమని ఆయన చెప్పారు.

పంచాయతీ రాజ్ పథకాన్ని దేశంలో మొదటిసారిగా అమలుజరిపిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని శ్రీ కామరాజ్ అభినందిస్తూ, ఈ విషయంలో మద్రాసు రాష్ట్రం ఆంధ్ర నుంచి చాలా నేర్చుకొనవలసి వున్నదని అన్నారు.

మద్రాసు రాష్ట్రంకూడా త్వరలోనే ఈ పథకాన్ని అమలుజరపగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి, కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకుడు సంజీవరెడ్డి కూడా ఈ సభలో మాట్లాడారు.

వారు తమ ఉపన్యాసాలలో రాష్ట్రంలో ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న అదనపు భూమి శిస్తు సత్యాగ్రహాన్ని గురించి ప్రస్తావించి, సత్యాగ్రహానికి తగిన మద్దతులేదని అన్నారు.

శాసనసభలో తీసుకొన్న నిర్ణయం బయట సత్యాగ్రహంవల్ల మార్పు చెందబోదన్న విషయాన్ని వారు గుర్తించుకోవాలని హెచ్చరించారు.

నంద్యాలలో కుటుంబ నియంత్రణ శిక్షణ శిబిరం

నంద్యాల, ఏప్రిల్ 6—స్థానిక గ్రామ సేవక్ శిక్షణ కేంద్రంలో గత 31 వ తేదీన జిల్లా సేవక్ సమాజ్‌వారి ఆధ్వర్యాన నడుపబడుతున్న "కుటుంబ నియంత్రణ" శిక్షణ శిబిరానికి డాక్టర్ శ్రీ పి. ఆర్. రామచంద్రుడు ప్రారంభోత్సవం చేశారు.

అంతకుముందు శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య (యం.ఎల్.సి.) జాతీయ పతాకావిష్కరణ గావించారు.

ఈ సందర్భంలో ఏర్పాటు చేయబడిన సభకు శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించారు. స్థానిక గ్రామ సేవక శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీ జి. నరసింహమూర్తి సభను ప్రారంభించారు.

శ్రీయుతులు రామచంద్రుడు, నివర్తి వెంకటసుబ్బయ్య, జి. నరసింహమూర్తి, ఆర్. రామలింగారెడ్డి, తిరుమలరావు గారలు ప్రసంగిస్తూ,సంతానోత్పత్తిని నిరోధించడానికి కుటుంబ నియంత్రణ శిక్షణ శిబిరాలు ఎంతైనా అవసరమని వివరించారు.

కుటుంబ నియంత్రణ ప్రచార శిక్షకులుగా విద్యార్థులు, గ్రామ సేవకులు, పంచాయతీ సభ్యులు, తదితర వ్యక్తులు సుమారు 60మంది చేరారు.

శ్రీ ఎన్. లక్ష్మీనారాయణ (ప్రధాన కార్యదర్శి) వందన సమర్పణతో సభ ముగిసింది.

దుద్దుకూరులో స్వర్ణకారుల సభ

కొయ్యలగూడెం, ఏప్రిల్ 6—దుద్దుకూరు గ్రామంలో స్వర్ణకారుల సభ శ్రీ లింగోజు సత్యనారాయణ అధ్యక్షతను జరిగింది.

శ్రీ వెదురువాడ సూర్యనారాయణ సభను ప్రారంభిస్తూ, స్వర్ణకారుల కుటుంబాలకు ప్రభుత్వం చేస్తున్న సదుపాయాలకు హర్షం వెల్లడించారు. పలువురు ఉపన్యసించారు.

చిట్యాలలో శ్రీ ఎం. చలమయ్యాచార్యులు అధ్యక్షతను స్వర్ణకారుల సమావేశం జరిగినది. పలువురు ఉపన్యసించారు.

తాడేపల్లిగూడెంలో సత్యాగ్రహం

తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 6—అదనపు భూమి శిస్తు చట్టమును రద్దు చేయాలని కోడుతూ గత బుధవారంనాడు ఇక్కడ ఉప్పాకపాడు గ్రామస్థులు 29 మంది సత్యాగ్రహం చేశారు.

కట్టుదిట్టంగా మద్య నిషేధ చట్టం అమలు

టెక్కలి సభలో సూచనలు

టెక్కలి, ఏప్రిల్ 5—మార్చి 30 వ తేదీన టెక్కలిలోగల శ్రీకాకుళం జిల్లా హరిజనసేవక్ సంఘం కార్యాలయ ఆవరణలో టెక్కలి తాలూకా మద్య విషేధ ప్రచారక సమితి అధ్యక్షుడు శ్రీ బి. ఎం. రెడ్డిగారి అధ్యక్షతన టెక్కలి తాలూకా మద్య నిషేధ ప్రచారక కార్యకర్తల ద్వితీయ మహాసభ జరిగింది. దాదాపు రెండు వందల మంది కార్యకర్తలు సభలో పాల్గొన్నారు. ఈ దిగువ తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ప్రజారోగ్య రక్షణకు మద్యనిషేధ చట్టం అమలుపరచబడింది. దాని ఆవరణలో అది కొన్ని అవాంఛనీయ పరిణామాలకు దారితీసింది. రసాయనపు ఎరువులలో ఉత్పత్తి కాబడుతున్న కాపుసారాయి త్రాగుతున్న ప్రజలు కుష్ఠు, క్షయ మొదలగు ప్రమాదకరమగు జబ్బులకు లోనై అకాల మరణములకు గురి అవుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మద్యనిషేధ చట్టం కట్టుదిట్టంగా అమలు పరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవలెనని యీ సభవారు ఏకగ్రీవంగా అభ్యర్థిస్తున్నారు.

మద్యనిషేధ ప్రచారం నిమిత్తం సరిపైన్ల గౌరవ వేతనములపై అనుభవముగల సంఘసేవకులను రెవిన్యూ డివిజన్ స్థాయిలో రాష్ట్ర హరిజన సేవక్ సంఘ యాజమాన్యాన నియమించవలెనని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

గ్రామ పంచాయతీ స్థాయిలో అధికార మద్యనిషేధ సంఘాలు ఏర్పరచాలి,

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయిలో మద్యనిషేధ సలహా సంఘాలు ఏర్పరచాలి.

టెక్కలి తాలూకాను మద్యనిషేధ ప్రయోగాత్మక కేంద్రంగా పరిగణించి అందుకు అవసరమైన కార్యక్రమాల అమలుపరచాలి.

నూతన సంవత్సరానికి టెక్కలి తాలూకా మద్యనిషేధ ప్రచారక సమితి కార్యవర్గానికి అధ్యక్షులు శ్రీ బి. ఎం. రెడ్డి. ఉపాధ్యక్షులుగా శ్రీ జొన్న దుర్యోధననాయుడు (హర్షనాథ) ప్రధాన కార్యదర్శిగా శ్రీ గొంటు అప్పారావు (సంతబొమ్మాళి) సహాయ కార్యదర్శులుగా శ్రీయుతులు సాధు తవిటయ్య (సున్నాపల్లి), జనపానరెడ్డి (బూరగాం) మరి కొంత మంది సభ్యులను ఎన్నుకొన్నారు.

సమితి జనరల్ బాడీ సభ్యులను కో ఆప్ట్ చేసే అధికారాలు అధ్యక్షునకు ఇచ్చారు.

బందరు ఇండో - అమెరికన్ మైత్రీ సంఘం సమావేశం

బందరు, ఏప్రిల్ 6-స్థానిక ఇండో-అమెరికన్‌మైత్రీ సంఘం సభ్యులు శ్రీ కోకా నారాయణస్వామినాయుడు గారి భవన ప్రాంగణంలో సంఘం అధ్యక్షులు శ్రీ ముదునూరి శేషగిరిరావు అధ్యక్షతను సమావేశమైనారు.

స్థానిక ఇనగుదురుపేట పోలీసు స్టేషన్ నుంచి కలెక్టర్ బంగళావరకు వున్న రోడ్డుకు "కెనెడీరోడ్డు" అని నామకరణం చేయవలసిందిగా ఈ సంఘం పురపాలక సంఘాన్ని కోరిన మేరకు పురపాలక సంఘం "కెనెడీ రోడ్డు" అని నామకరణం చేయడానికి ఏకగ్రీవంగా తీర్మానించిన కారణంగా పురపాలక సంఘ సభ్యులను, అధ్యక్షులను, అధికారులను ఆహ్వానించి వారిని అభినందించుటకు ఈ సమావేశం ఏర్పాటుచేశారు. ప్రత్యేక అతిథిగా చైర్మన్ శ్రీ సన్నాల వేణుగోపాలరావు, ఇతర అతిథులుగా కొందరు కౌన్సిలర్లు, అధికారులు ఈ సమావేశమునకు హాజరైనారు. సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. కె. మాధవ్ స్వాగతం చెప్పారు.

సభ ప్రారంభంలో శ్రీ పి. వి. నారాయణరాజు ప్రార్థనచేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. కె. మాధవ్ "కెనెడీ" చిత్రపటమును పురపాలక సంఘాధ్యక్షులకు బహూకరించారు.

పురపాలక సంఘాధ్యక్షులు శ్రీ సన్నాల వేణుగోపాలరావు ప్రసంగిస్తూ తమను, తమ సభ్యులను ఆహ్వానించి అభినందించినందుకు కృతజ్ఞతను తెలిపారు. పట్టణాభివృద్ధికిఅందరు సమైక్యంతో పాటుపడాలన్నారు.

సంఘాభివృద్ధిని కాంక్షిస్తూ శ్రీయుతులు కోళ్ళపర్తి నరసింహారావు,డాక్టర్ కోకా నరసింహారావు గార్లు ప్రసంగించారు. తేనీటివిందు అనంతరం శ్రీ కోకా నారాయణస్వామి నాయుడు వందన సమర్పణ గావించారు.

ఈ సమావేశానికి శ్రీ మండలి వెంకట స్వామినాయుడు, (ఎం.పి.), శ్రీ ఎస్. ఆర్. వై. దుర్గా ప్రసాద్ ప్రభృతులు హాజరైనారు.

ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ అధ్యక్షులుగా నియమితులైన శ్రీ పసల సూర్యచంద్రరావుగారికి ఏప్రిల్ 5 వ తేదీన గుడివాడలో సన్మానం జరిపినప్పటి చిత్రం

కూనవరంలో ఘోర అగ్నిప్రమాదం

30 ఇండ్లు దగ్ధం: లక్ష దాకా ఆస్తి నష్టం

("ఆంధ్రజ్యోతి" విలేకరి) భద్రాచలం, ఏప్రిల్ 6—

ఇక్కడకు 35 మైళ్ళలోల కూనవరంలో నిన్న అగ్ని ప్రమాదం సంభవించగా డాబాతోసహా 30 ఇండ్లు, ఓియ్యం, అపరాలు, నగదు దగ్ధమయినవి. నష్టం లక్ష రూపాయలకు పైబడి వుంటుందని అంచనా.

మంటలు పోస్టాఫీస్ భవనం వరకు వ్యాపించాయి. పోస్టాఫీసులోని నగదు. విలువయిన వస్తువులు సురక్షిత ప్రాంతానికి చేర్చారు. పోస్టాఫీసుకు అగ్ని ప్రమాదం సంభవించలేదు. ప్రాణనష్టం వార్తలు ఏమీ అందలేదు. శ్రీ కొత్త రామారావు స్వల్పంగా గాయపడ్డారు.

మూడు గంటలపాటు పోరాడి మంటలను అదుపులో పెట్టారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శబరి దాటడానికి ఏర్పాటు చేయబడిన వాహనాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాదాపు 50 కుటుంబాలవారు నిరాశ్రయులయినారు.

కానాల గ్రామంలో అగ్ని ప్రమాదం

18 గడ్డివాములు దగ్ధం; రు. 14 వేల ఆస్తి నష్టం

నంద్యాల, ఏప్రిల్ 6—కర్నూలు జిల్లా కోయిలకుంట్ల తాలూకా కానాల గ్రామంలో గత రెండవ తేదీ రాత్రి అకస్మాత్తుగా సంభవించిన అగ్ని ప్రమాదంలో 58 పెద్ద గడ్డివాములు భస్మీపటలమైనవి. రెండు మిద్దె ఇండ్లు కూడా ఈ ప్రమాదమునకు లోనైనవి.

అగ్నిప్రమాదం వార్త తెలియగానే స్థానిక అగ్ని మాపక దళంవారు శ్రీ రంగస్వామి ఆధ్వర్యాన అక్కడకు వెళ్ళి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంవల్ల నష్టం సుమారు 14 వేల రూపాయలుంటుందని అంచనా వేయబడింది.

గోపాలపురంలో పబ్లిక్ కాల్ ఆఫీసుకు ప్రారంభోత్సవం

కొయ్యలగూడెం, ఏప్రిల్ 6— పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు తాలూకా గోపాలపురంలో గత 31వ తేదీన పబ్లిక్ కాల్ ఆఫీసు ప్రారంభింపబడినది. సబ్ డివిజనల్ ఆఫీసర్ టెలిగ్రాఫ్స్ (విజయవాడ) శ్రీ ఎమ్. జగన్నాథరావు స్థానిక సబ్ పోస్ట్‌మాస్టర్‌తో మాట్లాడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైనది.

ఈ పబ్లిక్ కాల్ ఆఫీస్ (ఫోన్ నెం. 20)ను కొవ్వూరు మేన్యుయల్ ఎక్స్చేంజ్‌తోను, వేగేశ్వరపురం ఎక్స్చేంజ్‌తోను కలిపారు. స్థానిక ప్రజలకు, పరిసర ప్రాంతాల ప్రజలకు యిది ఎంతో సహాయకారిగా వున్నది.

చిలకలూరిపేటలో టవర్‌క్లాక్ ప్రారంభోత్సవం

చిలకలూరిపేట, ఏప్రిల్ 6— గత 31 వ తేదీన ఉదయం ఇక్కడ పెద్ద రథశాలవద్ద 11 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన మునిసిపల్ గడియార స్తంభానికి గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ వి. శ్రీనివాసాచారి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సభకు శ్రీ కాసు వెంగళరెడ్డి అధ్యక్షత వహించారు.

పలువురు పురప్రముఖులు, మాజీ పంచాయతీ సభ్యులు ఉచితరీతిని ప్రసంగించినారు. తరువాత శ్రీ సిహెచ్. విశ్వనాథం అతిథులందరికి విందుచేసి సత్కరించారు.

శ్రీరామ నవమి సెలవు దినంగా ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 5— శ్రీరామనవమి ఉత్సవ సందర్భంగా ఈ నెల 19 వ తేదీని సెలవుదినంగా ప్రకటించారు.

చిలకలూరిపేటలో "విజ్ఞాన భాస్కరం" కృతి సమర్పణ

చిలకలూరిపేట, ఏప్రిల్ 6— శ్రీ కాసు వెంగళరెడ్డికి "విజ్ఞాన భాస్కరం" గ్రంథాన్ని అంకిత మిచ్చిన సందర్భంలో ఇటీవల స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ గ్రంథాలయంలో గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ వి. శ్రీనివాసాచారి అధ్యక్షతన సభ జరిగింది. గ్రంథాలయ కార్యదర్శి శ్రీ కె. కోటేశ్వరరావు స్వాగతపత్రం సమర్పించారు.శ్రీ పి. అంజనేయులు, శ్రీ పి. నరసింహారావు, శ్రీ బచ్చు సత్యం, ముద్రణ పోషకులు శ్రీ బచ్చు రామలింగం తదితర పెద్దలు ఉచిత రీతిని ప్రసంగించారు.

తరువాత కృతికర్త శ్రీ కాసు వెంగళరెడ్డి కవి శ్రీ ఎస్. సిద్ధయ్యను పట్టుబట్టలు, పండ్లు శాలువాతో సత్కరించారు. కవి ప్రతిభా విశేషాలను శ్రీ కాసు వెంగళరెడ్డి వివరించారు. అధ్యక్షులు శ్రీ వి. శ్రీనివాసాచారి ఉచితరీతిని సమాధాన మిచ్చారు. మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీ బచ్చు రామలింగం వందన సమర్పణలో సభ ముగిసింది.

గూడూరులో సత్రం నిర్మాణం

టి. టి. దేవస్థానం ట్రస్టీల బోర్డు నిర్ణయం

తిరుపతి, ఏప్రిల్ 6— తిరుమల-తిరుపతి దేవస్థానం ట్రస్టీల బోర్డు సమావేశం ఒకటవ తేదీన శ్రీ కల్లూరి చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది.

గూడూరులో సత్రం నిర్మించడానికి, అక్కడ నుంచి తిరుమలకు బస్ వేయడానికి తీర్మానించారు.

గుడివాడలో కోగంటి వారి షష్టిపూర్తి ఉత్సవం

గుడివాడ, ఏప్రిల్ 6— మొన్న ఇక్కడ స్థానిక టవున్ హైస్కూలులో విద్వాన్ శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావు గారి షష్టిపూర్తి మహోత్సవం జరిగింది. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ వి. సూర్యప్రకాశరావు సభకు అధ్యక్షత వహించారు. మాధురి, రాణి అను బాలికలు దైవప్రార్థన చేశారు. శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావు కవి, పండితుడు. ఆదర్శోపాధ్యాయులని అధ్యక్షులు తమ ప్రసంగంలో వివరించారు.

శ్రీ జి. రామాచార్యులు సన్మాన పత్రమును సమర్పించారు. ఉపాధ్యాయ సంఘం తరపున చందన తాంబూల ఫలములను, ఖద్దరు వస్త్రములను, ఖద్దరు దోవతిని అధ్యక్షుడు శ్రీ మల్లికార్జునరావుగారికి సమర్పించారు. శ్రీ దోమలోటి ఏపేషా ప్రశంసా పద్యములను పఠించారు.

శ్రీయుతులు పి. సాంబశివరావు, నండూరి వెంకటాచార్యులు, బొప్పన మధుసూదనరావు, ఆర్. ఎస్. ఆర్. ఆంజనేయులు, కె. డి. సూర్యనారాయణ, జి.శ్రీరామాచార్యులుగారలు శ్రీ దుర్గా మల్లికార్జునరావుగారి భాషా సేవను కొనియాడారు.

శ్రీ దుర్గామల్లికార్జునరావు కృతజ్ఞతను తెలియ చేశారు. శ్రీ జె. ప్రకాశరావు వందన సమర్పణ చేశారు. సభకు పూర్వం తేనీటి విందు చేశారు

చిలకలూరిపేట మునిసిపాలిటీకి ప్రారంభోత్సవం

చిలకలూరిపేట, ఏప్రిల్ 6—పురుషోత్తమపట్టణ పంచాయతీతో కలిపి నూతనంగా ఏర్పడిన చిలకలూరిపేట మునిసిపాలిటీకి ఒకటవ తేదీన నర్సారావుపేట ఆర్. డి. ఓ. శ్రీ విశ్వనాథం ప్రారంభోత్సవం చేశారు.

నూతనంగా ఏర్పడిన ఈ మునిసిపాలిటీకి శ్రీ ఇ. రామచంద్రన్ స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చియున్నారు. శ్రీ వి. వెంకట్రాయుడు, శ్రీ షేక్ కాలేషా గారలు శ్రీ విశ్వనాథం, కమిషనర్ శ్రీ ఇ. రామచంద్రన్ ప్రభృతులకు పూలమాలలువేసి సత్కరించారు.

శ్రీ గట్టా సూర్యనారాయణ పరిచయ వాక్యాలు పలికారు.

శ్రీ విశ్వనాథం (ఆర్. డి. ఓ.) అధ్యక్షతన సభ జరిగింది. పంచాయతీ సభ్యులు, శ్రీయుతులు గోయిందు దాసయ్య, తోట భరతుడు,శ్రీకృష్ణం వెంకటేశ్వర్లు,పి. నరసింహారావు, పి. శ్రీరాములు ప్రసంగించారు.

కమిషనర్ శ్రీ ఇ. రామచంద్రన్ మాట్లాడుతూ పట్టణ సత్వర అభివృద్ధికి కావలసిన పనులను సభికుల దృష్టికి తెచ్చారు.

శ్రీ విశ్వనాథం (ఆర్. డి. ఓ.) ఉచితరీతిని సమాధానం మిచ్చారు. మాజీ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ ఎ. వెంకటసుబ్బయ్య వందన సమర్పణచేశారు. తరువాత సభికులందరికి తేనీరు ఇచ్చారు.

కొత్తగూడెంలో ఆరోగ్య ప్రదర్శన

ముగింపు సందర్భంలో వివిధ వర్గాలకు బహుమతి ప్రదానం

కొత్తగూడెం, ఏప్రిల్ 6—గతనెల 15 వ తేదీన ప్రారంభించిన వార్షిక ఆరోగ్య వారోత్సవ ప్రదర్శనం ఇటీవల ముగిసింది. సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ శ్రీ ఎస్. కె. నర్గుండ్‌కర్ వివిధ ప్రాంతాలలో నెగ్గిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ప్రభుత్వ శాఖలు నెలకొల్పిన స్టాల్స్‌లో, సిగరేణి కాలరీస్ ప్రణాళికా ప్రచారం స్టాలు ప్రథమ బహుమతి నందుకొన్నది. వాణిజ్య అంగళ్ళలో శ్రీ చోటీలాల్ మదన్‌లాల్ అంగడి మొదటి బహుమతి పొందింది. శ్రీ నర్గుండ్‌కర్ ఆరోగ్య వారోత్సవం సంఘం కృషిని అభినందించారు.

వేలాది ప్రజలు పరిసర గ్రామాల నుంచి ప్రతిరోజూ ఈ ప్రదర్శనకు హాజరయ్యారు.

అన్ని రోజులలోను యోగాసనాలపై శ్రీ యోగాసన రత్న యస్వంత్ సిన్హా, మద్య నిషేధంపై ప్రభాకర్‌జీ గారలు ఉపన్యాసాలిచ్చారు.

ఈ సందర్భంలో వేలాది కార్మిక గృహాలు పరిశీలించి పారిశుధ్యంలో గెలుపొందిన వారికి బహుమతులిచ్చారు. 346మంది శిశువులను పరీక్షించి 115 మంది శిశువులకు బహుమతు లందజేశారు.

"మిస్టర్". "మిస్" ఎన్నిక పోటీలలో శ్రీ రాజలింగం (మిస్టర్ కొత్తగూడెం), కుమారి హేమలత (మిస్ కొత్తగూడెం) నిర్ణయించబడ్డారు.

వివిధ సాంస్కృతిక ప్రదర్శనల పోటీలు కూడా నిర్వహించారు."గొల్లొడి పెళ్ళి" (అంజనేయులు బృందం), "గోంగూర బిరియాని" (లిటిల్ ఆర్ట్ థియేటర్స్), "స్వార్థ త్యాగాలు" (నటరాజా ఆర్టు థియేటర్), "ఒకనాడు" (7. ఇంక్లయిన్ కార్మికులు), "దేశం కోసం సందేశం" (జాతీయ కళాసమితి) ఉత్తమనాటికలుగా బహుమతి పొందాయి. నృత్యంలో సెంట్ మేరీస్ బాలికల హైస్కూల్ పిల్లలకు. ఏక పాత్రాభినయంలో శ్రీ ఎస్. నాయుడుకు ప్రథమ బహుమతు లిచ్చారు, ఫొటోగ్రఫీలో శ్రీ రామశర్మ (ఆర్. హెచ్. ఎస్. స్కూలు) శ్రీ ఎం. వాసుదేవన్‌లు ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. సంగీతంలో శ్రీయుతులు అర్. ప్రభాకర్, ఎం. బి. ఎం. రాజు, డెద్రా, కుమారి సరళ బహుమతులు గెలుచుకొన్నారు.

డాక్టర్ దాస్ వందన సమర్పణ చేశారు.

ఆకాశవాణి

బుధవారం, ఏప్రిల్ 8

(శక 1886 చైత్ర 19)

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6_30 శుభోదయం, 6_35 ప్రసార విశేషాలు, 6_40 అంగ్లంలో వార్తలు, 6_45 భక్తి రంజని (హైదరాబాద్ నుంచి రిలే), 6_55 సూక్తి ముక్తావళి, 7_00 తెలుగులో వార్తలు, 7_15 చతురంగం కదంబ కార్యక్రమం, 7_30 కె. తిరుమలాచార్యులు : వయొలిన్, 8_00 అంగ్లంలో వార్తలు, 8_15 హైదరాబాద్ వలె 8_30 హైదరాబాద్ వలె. మ॥ 12_30 కార్మికుల కార్యక్రమం, 1_00 మహిళా సమాజం (హైదరాబాద్ నుంచి రిలే), 1_30 ఫిల్మ్ సంగీతం, 1_50 తెలుగులో వార్తలు, సా॥ 6_00 స్థానిక ప్రకటనలు, 6_05 ప్రాంతీయ వార్తలు, 6_15 నేటి విశేషం, 6_20 గ్రామస్థుల కార్యక్రమం, 7_00 తెలుగులో వార్తలు, 7_15 గ్రామస్థుల కార్యక్రమం, 7_45 లలిత సంగీతం, 8_00 విజయశ్రీ పద్య నాటిక రచన : జంధ్యాల పాపయ్యశాస్త్రి "కరుణశ్రీ", 8_40 వాద్య బృందం. 8_55 నేటి విశేషాలు. 9_00 అంగ్లంలో వార్తలు, 9_25 మణిమాల, 10_00 కె. తిరుమలాచార్యులు : వీణ. 10_30 అంగ్లంలో వార్తలు, 10_35 వాతావరణ సూచన, జన గణ మన; ప్రసార సమాప్తి.

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6_30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ, 6_40 అంగ్లంలో వార్తలు, 6_45 భక్తిరంజని : విష్ణుపల్లికి సేవాకీర్తనలు, 6_55 సూక్తి ముక్తావళి : ఆంధ్ర మహాభారతం, 7_00 తెలుగులో వార్తలు, 7_15 ఎ. ఎమ్. మాణిక్యశర్మ, వీణ, 7_45 జవీద్‌లతీఫ్ : 8_00 అంగ్లంలో వార్తలు, 8_15 లలిత సంగీతం : సీత, అనసూయ : బృందగానం, 8_30 ఎస్. పద్మ, ఎస్. రాజకుమారి, మ॥ 12_30 కార్మికుల కార్యక్రమం (విజయవాడ నుంచి రిలే), 1_00 మహిళా సమాజం, 1_30 జవీద్ లతీఫ్ : సితార్, 1_50 తెలుగులో వార్తలు, 2_00 హైదరాబాద్ బి వలె, 2_20 హైదరాబాద్ బి వలె. సా॥ 6_00 స్థానిక ప్రకటనలు, 6_05 ప్రాంతీయ వార్తలు, 6_15 ప్రస్తుతాంశం, 7_00 తెలుగులోవార్తలు, 7_30 హైదరాబాద్ బి వలె, 8_00 నాటిక (విజయవాడ నుంచి రిలే), 8_45 హీరాబాద్ బరోదేకర్, 8_50 నేడు పార్లమెంటులో, 8_55 నేటి విశేషాలు, 9_00 అంగ్లంలో వార్తలు, 10_00 జవీద్ లతీఫ్ : సితార్, 10_30 అంగ్లంలో వార్తలు, 10_35 వాతావరణ సూచన, జన గణ మన; ప్రసార సమాప్తి.

హైదరాబాద్-బి

89.42 మీ (3355 కిలోసై)

ఉ॥ 6_30 హైదరాబాద్ ఎ వలె. 8_00 హైదరాబాద్ ఎ వలె. మ॥ 12_30 హైదరాబాద్ ఎ వలె, 2_00 ఎ. ఎమ్. మాణిక్యశర్మ : వీణ. సా॥ 6_00 హైదరాబాద్ ఎ వలె. 6_20 గ్రామస్థుల కార్యక్రమం, 7_00 తెలుగులో వార్తలు, 7_15 గ్రామస్థుల కార్యక్రమం, 7_30 వాద్యగోష్ఠి 8_00 హైదరాబాద్ ఎ వలె 8_45 విరామ సంగీతం, 8_50 హైదరాబాద్ ఎ వలె, 9_25 విరామ సంగీతం, 9_30 హైదరాబాద్ ఎ వలె, 10_00 ఎస్. పద్మ, ఎస్. రాజకుమారి, 10_30 హైదరాబాద్ ఎ వలె, 10_35 వాతావరణ సూచన, జన గణ మన. ప్రసార సమాప్తి.

మద్రాస్-ఎ

416.7 మీ (720 కిలోసై)

ఉ॥ 6_45 మంగళగానం, 7_30 రామ్నాద్ కృష్ణన్, 8_00 మధురగీతం, మ॥ 1_30 గాన మంజరి, 1_50 గీతమంజరి, 2_10 వృత్తి విద్యాశిక్షణ, సా॥ 5_30 డి. కిట్టప్ప : గోటు వాద్యం. 8_00 కె. ఎస్. రుక్మిణీ వెంకటాచలం, 8_45 వాద్యగోష్ఠి, 9_00 కె. ఎస్. రుక్మిణీ వెంకటాచలం, 9_45 నాదస్వరం, 10_30 వాతావరణ సూచన, జన గణ మన; ప్రసార సమాప్తి.

మద్రాస్-బి

211.3 మీ (1420 కిలోసై)

ఉ॥ 6_40 అంగ్లంలో వార్తలు, 6_45 మద్రాస్ ఎ వలె, 7_00 తెలుగులో వార్తలు. 7_15 వాద్యగోష్ఠి, 7_30 మద్రాస్ ఎ వలె, 8_00 అంగ్లంలో వార్తలు. మ॥ 12_00 కార్మికుల కార్యక్రమం, 1_00 కదంబం, 1_15 వాద్యగోష్ఠి, 1_30 అంగ్లంలో వార్తలు, 1_40 గీతమంజరి 1_50 తెలుగులో వార్తలు, 2_00 మధురగీతం, 2_10 మద్రాస్ ఎ వలె. సా॥ 5_30 పాశ్చాత్య సంగీతం, 6_00 అంగ్లములో వార్తలు, 6_05 మద్రాస్ ఎ వలె, 6_20 స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (అంగ్లం), 6_50 కదంబం, 7_00 తెలుగులో వార్తలు, 7_15 చిత్రగానం. 7_30 మాక్కుడి పి. వైద్యనాధన్ 7_45 "సాంఘికనీతి" అర్. అర్. దివాకర్ అంగ్ల ప్రసంగ మునకు తెలుగు, 7_55 శ్రోతల పరిచయం, 8_00 విజయశ్రీ పద్యనాటిక రచన : జంధ్యాల పాపయ్యశాస్త్రి "కరుణశ్రీ", 8_30 మాక్కుడి పి. వైద్యనాధన్, 8_50 నేడు పార్లమెంటులో, 8_55 నేటి విశేషాలు, 9_00 అంగ్లంలో వార్తలు, 9_45 పాశ్చాత్య సంగీతం, 10_35 జన గణ మన, ప్రసార సమాప్తి.

చీరాల ప్రాంతంలో శిస్తు బకాయిలు

రు 75 వేలు వసూలు అయినట్టు వార్త

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

చీరాల, ఏప్రిల్ 6—గత రెండు నెలలుగా శిస్తు బకాయిల వసూళ్ళలో నిమగ్నమై వున్న చీరాల డిప్యూటీ తహశీల్దారు శ్రీ కె. శ్రీరామచంద్రమూర్తి మొన్న ఇక్కడకు వచ్చారు. డిప్యూటీ తహశీల్దారు లెక్క ప్రకారం రెవిన్యూ శిస్తులు పాత బకాయిలు మొత్తం రెండు లక్షల రూపాయలకుగాను రు. 75,463లు, ఈ సంవత్సరం మొత్తం డవులు 10 లక్షలలో రెమిషన్ సుమారు రెండు లక్షలు పోను మిగిలిన 8 లక్షలకుగాను ఇప్పటికి రు. 6,45,235లు వసూలు చేయబడినట్టు తెలుస్తున్నది.

ఈ ప్రాంతం వరదలకు గురికావడం, పంటలు సరిగా పండకపోవడంవల్ల వసూలు కొంచెం ఆలస్యంగా జరిగినా సంతృప్తికరంగానే జరిగిందని భావించబడుతున్నది. శిస్తు వసూళ్ళ ప్రత్యేక ఉద్యమాన్ని మరొక నెల పొడిగించినట్టుకూడా తెలుస్తున్నది.

పొదిలిలో సత్యాగ్రహం

జాతీయ సత్యాగ్రహ సమితి ఆధ్వర్యాన

పొదిలి, ఏప్రిల్ 6— జాతీయ సత్యాగ్రహ సమితి ఆధ్వర్యాన నాల్గవ తేదీన పొదిలిలో పెద్ద పూరేగింపు జరిగింది. సుమారు 590 మంది రైతులు, జనసంఘం కార్యకర్తలు. స్వతంత్ర పార్టీ కార్యకర్తలు శ్రీ ముప్పాల శ్రీహరిరావు నాయకత్వాన పూరేగింపు జరిపారు.

సత్యాగ్రహులు ఎంతోసేపు తాలూకా కార్యాలయం ముందు మండుటెండలో కూర్చొని నినాదాలతో తమ కోర్కెలను ప్రకటించారు. తర్వాత తహశీల్దారుకు విజ్ఞప్తి పత్రం సమర్పించారు.

భద్రాచలం యాత్రికులకు బ్లాకు అధికారి విజ్ఞప్తి

భద్రాచలం, ఏప్రిల్ 6— పదకొండవ తేదీ నుంచి 24 వ తేదీవరకు జరుగు శ్రీరామనవమి ఉత్సవాలలో పాల్గొనడానికి ఇక్కడకు వచ్చే యాత్రికులు కలరా, మశూచి మొదలగు వ్యాధులు సోకకుండా భద్రాచలం చేరగానే ఏదో ఒక ఆసుపత్రిలో ఉచితంగా సూదులు, టీకాలు వేయించుకొనవలసినదిగా స్పెషల్ గ్రేడు బ్లాకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీ అవసరాల సూర్యారావు మృతికి ఖమ్మంలో సంతాపం

ఖమ్మం, ఏప్రిల్ 6— ఖమ్మం జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీవారి పక్షాన గత 27 వ తేదీన కేంద్ర గ్రంథాలయంలో శ్రీ అవసరాల సూర్యారావు మృతికి సంతాప సభ జరుపబడింది. ఈ సభకు శ్రీ గెల్లా కేశవరావు అధ్యక్షత వహించారు.

జిల్లా రచయితల సంఘం కార్యదర్శి శ్రీ కొలిపాక మధుసూదనరావు స్వర్గీయ సూర్యారావు సాహిత్య సేవను ఉగ్గడిస్తూ కాళిదాసు కావ్యాలకు మల్లినాథ సూరి వన్నె తెచ్చినట్లే, శ్రీ అవసరాల గురజాడ వారి సాహిత్యానికి వినూత్న విలువలను చేకూర్చిపెట్టి గురజాడ అమూల్య సాహిత్య సంపదను వెలికి దీసి చిరస్మరణీయులైనారని అన్నారు.

సాహిత్య భూషణ శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు శ్రీ సూర్యారావు మరణం ఆధునిక సాహిత్యానికి నష్టదాయకమని తమ విచారాన్ని వ్యక్తం చేశారు.

అనంతరం శ్రీ సూర్యారావు మృతికి సంతాప తీర్మానం ప్రవేశ పెట్టబడింది.

వర్గీకృత ప్రకటన

కావలెను

సాలూరు మునిసిపాలిటీ

సాలూరు మునిసిపల్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్‌లో మంజూరయిన జీతం స్కేలు, అలవెన్సులతో ఫ్రీ - వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా నియామకానికి అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి. దరఖాస్తులు ఈ దిగువ సంతకదారునకు పూర్తి వివరములతో 15-4-64 వ తేదీన కాని, అంతకుముందుగాని చేరాలి.

కే. వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు,
మునిసిపల్ కమిషనర్.
మునిసిపల్ ఆఫీస్, సాలూరు 3-4-64

ప్రకటన

ఈ క్రింద ఉదహరింపబడినవారు తమ స్వంత బాధ్యతపై "ఆంధ్రజ్యోతి" దిన పత్రికను విక్రయించుటకు ఏజెంట్లుగా నియమింపబడినారు.

1-4-64 వ తేదీ నుంచి మీసాల రామబ్రహ్మం గారి స్థానే మారం సత్యనారాయణ గారు, జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా.

7-4-64 వ తేదీ నుంచి సి. నారాయణమూర్తి గారు నర్సీపట్నం, విశాఖపట్నంజిల్లా

సర్క్యులేషన్ మేనేజర్.



విజయవాడ పురపాలక సంఘం వజ్రోత్సవాల సోమవారం కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ ఎస్. ఆర్. వై. శివరామ ప్రసాద్ ప్రసంగిస్తున్నప్పటి దృశ్యం

జంట నగరాలలో చౌక డిపోలు

ప్రభుత్వం ఆధ్వర్యాన నిర్వహించనున్నట్టు వార్త

హైదరాబాద్, ఏప్రిల్ 6 — ప్రస్తుతం జంట నగరాలలో కార్పొరేషన్‌వారి ఆధ్వర్యాన నిర్వహించబడుతున్న చౌక డిపోలను ఎత్తివేసి వాటిస్థానే ప్రభుత్వం అజమాయిషీలో వుండే చౌక డిపోలను నెలకొల్పగలరని నిన్న ఇక్కడ తెలియవచ్చింది.

ఈ కొత్త చౌక డిపోలు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కంట్రోలు క్రింద వుండగలవని తెలుస్తున్నది.

ప్రస్తుతం కార్పొరేషన్‌వారి ఆధ్వర్యాన జంట నగరాలలో 55 చౌక డిపోలు నిర్వహించబడుతున్నవి.

కల్వపూడి ఖూనీ కేసు

ఆరుగురు అరెస్టు

భీమవరం, ఏప్రిల్ 6 — గత మార్చి 29వ తేదీన కల్వపూడిలో ఖూనీ చేయబడిన పొన్నమిల్లి సుబ్బారావు హత్య కేసు సందర్భంలో పోలీసువారు కల్వపూడి కాపురస్థులు శ్రీ మంతెన సూరపరాజు కుమారులు తాతరాజు, సత్తిరాజు, మూర్రాజు, వెంకట్రాజు, కృష్ణంరాజులను శ్రీ కానూరి రామరాజుగారి కుమారుడు సూరపరాజును అరెస్టు చేశారు.

ముద్దాయిలు ఆరుగురిని మేజస్ట్రేటు రిమాండు చేశారు. ఈ కేసు సందర్భంలో అడిషనల్ డిస్ట్రిక్టు మునసబు మేజస్ట్రేట్ శ్రీ కె. వి. రాఘవరావు 14 మంది సాక్షుల వద్దనుంచి 164 సెక్షన్ క్రింద స్టేట్ మెంట్లు రికార్డుచేసినట్టు తెలుస్తున్నది.

అమ్మకం ప్రకటన

రేంప్‌డ్ కార్గోలైటర్స్

ముందు ప్రకటనలోని రెండవ పేరాకు సవరణ

పాటదారులు ప్రతీ ఇంజనుకు రూ. 500/- ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవచ్చును, పాట పాడలేకపోయినవారికి ధరావత్తులు అక్కడికక్కడే తిరిగి వాపసివ్వబడును. ప్రతీ సెట్‌కు ప్రారంభ పాట రూ. 2000/- ఉంటుంది.

(సం.) ఎస్. ఎస్. శాస్త్రి
డివిజనల్ ఇంజనీర్ (హైవేస్)
టి. అండ్ ఎం. డివిజన్ విజయవాడ.

టెండరు నోటీసు

తెనాలి డ్రైనేజి స్కీము బ్లాకు-1-నిర్మాణానికి సంబంధించిన పనులను: మట్టిపని, తిరిగి కప్పే పనులను కలుపుకొని, కాలర్స్‌తో రీయిన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీటు పైపులను జాయింటింగ్ మరియు లేయింగ్ చేసి పనులను నిర్వహించే నిమిత్తం

ఎల్. ఎస్. కాంట్రాక్టుపై గుంటూరు_1 ఈస్ట్ సర్కిల్, పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వారిచే సీలువేసిన టెండర్లు కోరబడుతున్నవి.

టెండర్లు ఆఖరుతేదీ 1_5_64 సాయంత్రం 3 గంటలవరకు స్వీకరించబడి, అదే తేదీ సాయంత్రం 4 గంటలకు తెరువబడును.

వివరములతోకూడిన టెండరు నోటీసు, షెడ్యూల్సు వివరణలు, ప్లానులు దిగువ సంతకం చేసినవారి కార్యాలయంనుంచి లిఖిత పూర్వకమైన దరఖాస్తుపై పొందవచ్చును. గుంటూరు ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ (పబ్లిక్ హెల్త్)పేరున "పి. డబ్ల్యు. iii ఒ. ఆర్. రెమిటెన్సెస్" పద్దుక్రింద డిపాజిట్ చేసిన ఎస్. టి. డిపాజిట్‌ను కలుపుకొని షెడ్యూల్సు వగైరా వెల (వాపసు చేయబడదు.) క్రింద ప్రభుత్వ ట్రెజరీలో రూ. 15_30 చెల్లించిన చలానాను దరఖాస్తుకు జతచేసి పంపవలెను.

చలానా లేకుండా పంపిన దరఖాస్తులు పరిశీలించబడవు.

మని ఆర్డర్లు, డ్రాఫ్టులు, చెక్కులు లేక నగదు అంగీకరించబడవు.

పై విధముగా పొందిన నిర్ణీత దరఖాస్తు ఫారములపై సమర్పించిన టెండర్లు మాత్రమే స్వీకరించబడును.

పై టెండరు పత్రాలు సరఫరాచేయడానికి దరఖాస్తులు 21_4_1964 తేదీకి ముందుగ ఈ కార్యాలయానికి చేరాలి. పై తేదీ దాటిన తరువాత వచ్చిన దరఖాస్తులు సాధారణంగ పరిశీలించబడవు. టెండరు పత్రాలు 8_4_1964 తేదీ నుంచి లభ్యమవుతాయి.

పై పనిని నిర్వహించే నిమిత్తం వివరములతో కూడిన టెండరు నోటీసులో నిర్దేశించిన విధంగా, ఇ. ఎం. డి. పరంగా రూ. 2360/- (రెండువేల మూడువందల అరవైరూపాయల మాత్రం) కట్టిన చలానా, టెండర్లతోపాటు జతచేసి పంపవలెను. నిర్ణయించిన విధంగ నిర్ణీత ఇ.ఎం.డి. లేకుండా పంపిన టెండర్లు త్రోసివేయబడును.

మొహమ్మద్ ఉస్మాన్,
సూపరింటెండింగ్ ఇంజనీర్,
పి. హెచ్. ఈస్ట్ సర్కిల్,
గుంటూరు_1.

తెనాలి మునిసిపల్ ఉప ఎన్నిక

11వ వార్డుకు శ్రీ షేక్ ఇబ్రహీం ఏకగ్రీవంగా ఎన్నిక

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

తెనాలి, ఏప్రిల్ 6— స్థానిక మునిసిపల్ కౌన్సిల్ 11 వ వార్డు సభ్యుడుగా శ్రీ షేక్ ఇబ్రహీం పోటీలేకుండా ఎన్నికయినట్టు మునిసిపల్ కమిషనర్, రిటర్నింగ్ అఫీసర్ శ్రీ ఎస్.ఎం. ముర్తుజా రెండవ తేదీన ప్రకటించారు. శ్రీ ఎస్.ఎ. సత్తార్ తన సభ్యత్వానికి రాజీనామా చేసినందున ఈ ఉప ఎన్నిక అవసరమయినది.

శ్రీ ఇబ్రహీం (47) 11 వ వార్డులోని మసీదుకు లోగడ ట్రస్టీగా పనిచేశారు.

ఎన్. సి. సి. ఆఫీసర్లు

హైదరాబాద్‌లో పునశ్చరణ తరగతుల ఏర్పాటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6— ఎన్. సి. సి. ఆఫీసర్లకు హైదరాబాద్‌లో ఏప్రిల్ 13 నుంచి 25 వ తేదీ వరకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారు.

అన్ని విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో నిర్బంధ సైనిక శిక్షణ ప్రవేశపెట్టారు. దాని ఫలితంగా దేశంలో ఎన్. సి. సి. దళాలు పెద్ద ఎత్తున ఏర్పాటైనవి. అందుచేత ఆఫీసర్లకు పునశ్చరణ తరగతులను ఏర్పాటుచేస్తున్నారు.

గుంటూరు జిల్లా హైర్ వర్కింగ్ రైస్ మిల్స్ అసోసియేషన్

తెనాలి, ఏప్రిల్ 6— తొమ్మిదవ తేదీ వుదయం 7 గంటలకు స్థానిక శ్రీ స్వరాజ్ టాకీస్‌లో గుంటూరు జిల్లా అద్దె వర్కింగ్ రైస్ మిల్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని అధ్యక్షులు శ్రీ ఈదర లక్ష్మీనారాయణ తెలియజేస్తున్నారు.

శ్రీ కపిల కాశీపతికి వీడ్కోలు

కలకత్తా ఆంధ్ర పరిషత్తు ఆధ్వర్యాన సభ ఏర్పాటు

కలకత్తా, ఏప్రిల్ 6— స్థానిక ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధ్యక్షులు శ్రీ కపిల కాశీపతి దక్షిణ భారత ఫిలిం సెన్సారు బోర్డు అధ్యక్షులుగా నియమితులై మద్రాసు నగరానికి వెళ్ళనున్న సందర్భంలో పరిషత్తు వారు వారి గౌరవార్థమై వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు, భారతీ తమిళ సంఘం ఆవరణలో జరిగిన ఈ సభకు పరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీ బొమ్మన విశ్వనాథం అధ్యక్షత వహించారు. పరిషత్తు సభ్యులు, నగరంలో గల ఇతర ప్రముఖులు సమావేశానికి హాజరైనారు.

పరిషత్తు కార్యదర్శి శ్రీ రావినూతల సత్యనారాయణ. శ్రీ కాశీపతి సాహిత్య రంగానికి గావించిన సేవను, వారి బహుముఖ ప్రజ్ఞాపాటవాలను వివరించారు. గత మూడు సంవత్సరాలుగా శ్రీ కాశీపతి ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు, తద్వారా ఆంధ్ర ప్రజానీకానికి చేసిన సేవను ప్రస్తుతించి, వారి ఆధ్వర్యాన కలకత్తా ఆంధ్ర సాహిత్య పరిషత్తు అఖిల భారత స్థాయి సాహిత్య సంస్థగా రూపొందిన దన్నారు.

సభాధ్యక్షులు శ్రీ బొమ్మన విశ్వనాథం పరిషత్తు సభ్యుల పక్షాన "వివేకానందుని సంపూర్ణ గ్రంథావళి"ని శ్రీ కాశీపతి కి బహూకరించారు.

శ్రీ కాశీపతి మాట్లాడుతూ. సాహిత్యసేవ, రచనా వ్యాసంగం తపస్సువంటివని రచనలో ఉన్నత ప్రమాణాల నందుకొనవలయునని మిక్కిలి నిష్ఠతో కృషిచేయవలయునని అన్నారు. పరిషత్తు సభ్యులు తమ పట్ల వ్యక్తపరచిన గౌరవాదరములకు కృతజ్ఞత తెలియజేస్తూ, తామెచ్చట నున్నను తమ సహకార, సహాయములను పరిషత్తుకు అందజేయగలమని హామీ నిచ్చారు.

కోరుకొండ హయ్యర్ ఎలిమెంటరీస్కూల్

సమితికి అప్పగింత

రాజానగరం, ఏప్రిల్ 6 — జీవిత శేషాన్ని దైవ ధ్యానంలో గడపడానికిగాను దాదాపు నాలుగు దశాబ్దాలనుంచి కోరుకొండలో తాను ఎంతో సమర్థంగా నిర్వహిస్తున్న ఎయిడెడ్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూలును శ్రీ మరంగంటి వెంకటాచార్యులు, ఏప్రిల్ ఒకటవ తేదీన కోరుకొండ పంచాయతీ సమితికి అప్పగించారు.

ఈ సందర్భంగా జరిగిన సమర్పణ సభకు కోరుకొండ సమితి అధ్యక్షులు శ్రీ పుల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు,

స్థానిక ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ వి. యన్. ఆర్. కృష్ణమూర్తి, విద్యా విస్తరణాధికారి శ్రీ బొబ్బిలి జనార్ధనరావు, కోరుకొండ బ్లాక్ ఉపాధ్యాయ యూనియన్ అధ్యక్షులు శ్రీ చేకాల గోవిందరాజులు, హైస్కూల్ కమిటీ కార్యదర్శి శ్రీ పుస్సంరాజు రాధాకృష్ణమూర్తి, డాక్టర్ పెద్దింటి సీతారామభార్గవ ప్రభృతులు ప్రసంగిస్తూ నాలుగు దశాబ్దాల పాటు బిడ్డలా పెంచి, పోషించిన ఈ పాఠశాలను నేటికి సమితికి సమర్పించడాన్ని హృదయ సమర్పణగా అభివర్ణించారు. అభివృద్ధి పథంలో మహోన్నత స్థానాలలోవున్న తమ శిష్యులను ఇతరులు ప్రశంసించినప్పుడే ఉపాధ్యాయుని జన్మ సార్థకమౌతుందని; అట్టి ఆత్మానందభూతిని పొందిన బహు కొద్ది మందిలో శ్రీ మరంగంటి వెంకటాచార్యులు ప్రముఖులనికూడా వక్తలు ఆయనను ప్రశంసించారు.

శ్రీ వెంకటాచార్యులు వక్తల ప్రశంసలకు కృతజ్ఞత తెలియజేశారు.

డాక్టర్ పెద్దింటి రామకృష్ణమాచార్యులు వందన సమర్పణ చేశారు.

ఇచ్ఛాపురం సమితి ప్రాథమికోపాధ్యాయ మహాసభ

రాజాపురం, ఏప్రిల్ 6 — ఇచ్ఛాపురం తాలూకా ప్రాథమికోపాధ్యాయ మహాసభ ఇటీవల రాజాపురంలో సమితి అధ్యక్షుల శ్రీ డి. పీతాంబరరెడ్డి అధ్యక్షతన జరిగింది. బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసర్ శ్రీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ పుల్లట వాసుదేవ నాయుడు జాతీయ పతాకమును ఆవిష్కరించారు. బొరివంక పంచాయతీ అధ్యక్షులు శ్రీ బెందాళం వేంకటేశ్వర శర్మ ప్రతినిధుల సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యదర్శి నివేదిక. జమా ఖర్చులు ఆమోదింపబడినవి.

ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసు 60 ఏండ్లకు పెంచాలని, కరువు బత్తెము రు 10 లు; రు 20 లు 1963 జులై ఒకటవ తేదీ నుంచి అదనంగా యివ్వాలని, రెండవ పే కమిటీ నియమించ వలెనని, ఉపాధ్యాయులకు వినిమయ సహకార సంఘం ఏర్పరచాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. శ్రీ పి. సీతారామమూర్తి అధ్యక్షులుగాను, శ్రీ జి. డి. సత్యానందరావు కార్యదర్శిగాను. శ్రీ వి. రామస్వామి కోశాధికారిగాను ఎన్నుకొన్నారు. సంఘం ఆవశ్యకతను గురించి పలువురు ప్రసంగించారు. సమితిలోని ఉపాధ్యాయుల సమస్యలను శ్రీ పి. సీతారామమూర్తి వివరించారు.

బందరులో దొంగతనాలు

బందరు, ఏప్రిల్ 6 — ఈ మధ్య బందరులో చోరీ నేరాలు జరుగుతున్నాయి, రామానాయుడుపేటలోని శ్రీ అద్దేపల్లి నాగభూషణంగారి యింటికిటికీచువ్వలు వంచి సుమారు 700 కిమ్మతుచేసే సామాగ్రి ఎత్తుకుపోయారు.

ఇంగ్లీషుపాలెంలో శ్రీ మతుకుమల్లి నాగభూషణంగారి ఇంట్లో నాలుగువందల రూపాయల రొఖం, 400 రూపాయల విలువగల బంగారు వెండి సామానూ పోయినట్టు చిలకలపూడి పోలీసువారికి రిపోర్టు చేయబడింది. పోలీసు దర్యాప్తు జరుగుతున్నది.



కలకత్తా ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధ్యక్షులు శ్రీ కపిల కాశీపతి దక్షిణ భారత ఫిలిం సెన్సార్ బోర్డు అధ్యక్షులుగా నియమితులై మద్రాసు వెడుతున్న సందర్భంలో వారికి ఇటీవల వీడ్కోలు చెప్పారు. ఆ సందర్భంలో ఆయనకు పరిషత్తు పక్షాన ఉపాధ్యక్షులు శ్రీ బొమ్మన విశ్వనాథం ''వివేకానంద సంపూర్ణ గ్రంథావళి''ని బహూకరిస్తున్న దృశ్యం

విజయవాడలో ప్రభుత్వం ఆసుపత్రి

నెలకొల్పాలని శ్రీ ఖుద్దుస్ ప్రభృతుల అభ్యర్థన

విజయవాడ, ఏప్రిల్ 6— ప్రజా సంక్షేమ కృషిలో మహిళలు తమవంతు పాత్రను నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి శ్రీ ఎస్. ఆర్. వై. శివరామప్రసాద్ నిన్న సాయంత్రం ఇక్కడ విజయవాడ పురపాలక సంఘం వజ్రోత్సవాల సందర్భంలో రెండవ రోజు కార్యక్రమంలో పాల్గొంటూ పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని, అయినా ఇతర దేశాలతో పోల్చినప్పుడు మన దేశం వెనకబడి వున్నదని ఆయన అన్నారు.

జనాభా పెరుగుదల నిరోధానికి కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను ఆయన వివరించారు. ఈ విషయంలో మహిళా సంఘాలు ఎంతైనా కృషిచేయవచ్చునని ఆయన పేర్కొన్నారు, పిల్లలను చక్కగ పెంచడం విషయంలో ప్రజలలో ప్రచారం చేయాలని ఆయన సూచించారు.

మునిసిపల్ చైర్మన్ శ్రీ ఎస్. ఎం. ఎ. ఖుద్దుస్ మంత్రికి స్వాగతం చెబుతూ, విజయవాడలో అయిదువందల పడకలతో ఆసుపత్రిని నెలకొల్పాలని అభ్యర్థించారు.

మాజీ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కె. అచ్చమాంబ మాట్లాడుతూ పిల్లలను చక్కని వాతావరణంలో పెంచాలని అన్నారు.

డాక్టర్ జనాబాయి మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ ప్రాధాన్యం వివరించారు.

డాక్టర్ టి. వి. ఎస్. చలపతిరావు (ఎం ఎల్. ఎ) మాట్లాడుతూ వజ్రోత్సవాల చిహ్నంగా కృష్ణానదీ తీరంలో మైసూరులోని బృందావనం నమూనాపై పార్కును వేయాలని సూచించారు. పట్టణంలో యాచకుల బెడదను తొలగించాలని ఆయన సూచించారు. విజయవాడలో ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిని నెలకొల్పే ప్రతిపాదనను అమలుజరపడానికి మంత్రి శ్రీ శివరామ ప్రసాద్ తోడ్పడాలని ఆయన అభ్యర్థించారు,

డాక్టర్ కె. ఎస్. సాంబశివరావు మాట్లాడుతూ పిల్లలకు అంటు వ్యాధులు రాకుండా నిరోధించడానికి టీకాలు మున్నగు వాటిని వేయించాలని సూచించారు.

మునిసిపల్ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. వి. వి. రాజామణి వందన సమర్పణ చేశారు.

ఈ సందర్భంలో శిశు ప్రదర్శన జరిగింది. మాంటిస్సోరీ పాఠశాల విద్యార్థినిలు నృత్య ప్రదర్శన యిచ్చారు, మునిసిపల్ ఆరోగ్య శాఖ సిబ్బంది "సిఫారసు" అనే నాటికను ప్రదర్శించారు. "పాండవ ఉద్యోగ విజయం" నాటకాన్ని శ్రీ పీసపాటి నరసింహమూర్తి ప్రభృతులు ప్రదర్శించారు.

గ్రామ ప్రాంతాలలో దారిద్ర్య నిర్మూలనకు గ్రామదానోద్యమం ఒక్కటే శరణ్యమని ఆచార్య వినోబా భావే ఏప్రిల్ అయిదవ తేదీన చెప్పినట్టు వార్ధాగంజ్ వార్త.

స్త్రీలలో ప్రణాళికల పథకాలపట్ల చైతన్యం

కలుగజేయాలని విజయవాడలో కృష్ణాజిల్లా ముఖ్యసేవికల సదస్సులో మంత్రి వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) విజయవాడ, ఏప్రిల్ 6—

ప్రణాళికా పథకాల ద్వారా చేకూరే సంక్షేమ కార్యక్రమ ప్రయోజనాలు గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకొనడంలో ముఖ్య సేవికలు, గ్రామ సేవికలు గణనీయమైన పాత్రను నిర్వహించాలని, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎం. ఆర్. అప్పారావు సూచించారు.

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎం. ఆర్. అప్పారావు నిన్న ఇక్కడ కృష్ణా జిల్లా ముఖ్య సేవికల, గ్రామ సేవికల సదస్సుకు ప్రారంభోత్సవం చేస్తూ గ్రామీణ ప్రాంతంలో కుటీర పరిశ్రమలు స్థాపించి తద్వారా కుటుంబాల ఆదాయ వనరుల ఇతోధికాభివృద్ధికి తోడ్పడాలని. కుటీర పరిశ్రమలలో స్త్రీలు ప్రముఖ పాత్ర నిర్వహించేటట్టు ప్రోత్సహించాలని అన్నారు.

కుటీర పరిశ్రమలలో సాంకేతికంగా ఎదురయ్యే చిక్కులను తొలగించి పరిశ్రమ అభివృద్ధికి విఘాతం కలుగకుండా తోడ్పడాలని ముఖ్య సేవికలకు, గ్రామ సేవికలకు ఆయన సూచించారు.

సంక్షేమ కార్యక్రమాలకు తగిన నిధులు కేటాయించడం లేదనే విమర్శ అవాస్తవమైనదని, దీనికి తృతీయ ప్రణాళికలో సముచిత ప్రాధాన్యం యివ్వడం జరిగిందని ఆయన వివరించారు.

శ్రీ సంక్షేమ శాఖ ఉద్యోగులపై వస్తున్న ఆరోపణలను ఆయన ప్రస్తావించి, మొత్తం మీద ఉద్యోగులు తమ కర్తవ్యాలను జయప్రదంగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

తొలుత మహిళా సంక్షేమ శాఖ ప్రాంతీయ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి కృష్ణకుమారి, ఎన్. రావు స్వాగతం చెప్పారు.

సదస్సుకు జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీ మాగంటి అంకినీడు (ఎం.పి) అధ్యక్షత వహిస్తూ, గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం, ప్రజారోగ్యం మున్నగు కార్యక్రమాల అమలు జేయడంలో గ్రామ సేవికలు నిర్వహించవలసిన కర్తవ్యం ఎంతైనా వున్నదని ముఖ్యంగా గ్రామీణ స్త్రీలలో ప్రజాశ్రేయస్సుకు, సమష్టి సంక్షేమానికి ఉద్దేశించిన పథకాల విషయంలో చైతన్యయుతమైన ప్రచారాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు,

జిల్లా కలెక్టర్ శ్రీ కె. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ, సంక్షేమ కార్యక్రమాల అమలులో తాము ఎదుర్కొనవలసిన ఇబ్బందులను గురించి చర్చించి వాటి పరిష్కారానికి సహేతుకమైన సూచనలను తీర్మానాల రూపంలో సదస్సు రూపొందించాలని వాటిని ప్రభుత్వం శ్రద్ధాసక్తులతో పరిశీలించగలదని హామీ నిచ్చారు.

ఆత్యయిక పరిస్థితిలో మహిళల పాత్ర

నేడు జరిగిన సదస్సు కార్యక్రమాలకు కుమారి సుగుణ కుమారి అధ్యక్షత వహించారు.

జాతీయ పొదుపు ఉద్యమం ప్రాంతీయ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ టి. భుజంగరావు పొదుపు ఉద్యమం గురించి వివరించారు.

పొదుపు ఉద్యమాన్ని గురించి గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా స్త్రీలలో ప్రచారంచేసి, వారిలో పొదుపు చేయవలసిన ఆవశ్యకతను వివరించడంలో మహిళా ఉద్యోగులు గణనీయమైన సేవ చేయవచ్చునని, గ్రామీణ మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, వాటిద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సులభతరం అని ఆయన వివరించారు.

పిదప కృష్ణా జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి శ్రీ కె. నాగభూషణరెడ్డి "అత్యయిక పరిస్థితిలో స్త్రీలపాత్ర" అనే అంశంపై ప్రసంగిస్తూ, ఆధునిక యుద్ధ తంత్రంలో యుద్ధ రంగంతో పాటు. ఇతర రంగాలలో కూడా దాదాపు సమర రంగం పరిస్థితి వుంటుందని అన్నారు.

కాగా యుద్ధంలో విజయం సాధించడానికి దేశంలోని పౌరులంతా సమైక్యతతో యుద్ధ సన్నాహాలకు చేయూత నివ్వాలని, అన్ని రంగాలలోను ఉత్పత్తిని హెచ్చించాలని ఆయన పేర్కొన్నారు.

శ్రీమతి కే. మేరీ వందన సమర్పణ చేశారు.

పిదప సదస్సుకు హాజరయిన ప్రతినిధులు వివిధ బృందాలుగా విడిపోయి ఆయా అంశాలపై చర్చను జరిపారు.

కొత్తగూడెంలో ఆర్ట్స్, సైన్స్ కళాశాల

ప్రారంభించడానికి ఉస్మానియా యూనివర్సిటీ అనుమతి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

కొత్తగూడెం, ఏప్రిల్ 6 — 1964_65 విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ శ్రీ రామచంద్ర హయ్యర్ సెకండరీ స్కూల్ ఆవరణలో సైన్స్, ఆర్ట్స్ కళాశాల ప్రారంభించడానికి ఉస్మానియా యూనివర్శిటీ అధికారులు అంగీకరించారు. ఉస్మానియా యూనివర్శిటీ ఇన్‌స్పెక్షన్ కమిషన్‌వారు 1963 జూన్ 22 వ తేదీన పై పాఠశాలను సందర్శించి, తమ సిఫారసులను సమర్పించిన విషయం విదితమే.

ఫిజికల్. బయొలాజికల్ సైన్సెస్‌తో పి. యు. సి. తరగతులతో ఈ కళాశాల ప్రారంభించబడుతుంది. రామచంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌వారు ఆర్ట్స్ తరగతుల అనుబంధానికి కూడా దరఖాస్తు చేశారు. అనుబంధం ఉత్తర్వులు అందిన వెంటనే ఆర్ట్సు కోర్సులు కూడా ప్రారంభించబడతాయి.

ఈ కళాశాల శ్రీ రామచంద్ర ఆర్ట్స్, సైన్స్ కళాశాల, కొత్తగూడెం అనే పేరుతో వ్యవహరించబడుతుంది. పి. యు. సి. (సైన్సెస్) రెగ్యులర్ తరగతులు వచ్చే జూన్‌లో ప్రారంభమవుతాయి.

ధరవరలు

కొబ్బరికాయలు [1000]

విజయవాడ, ఏప్రిల్ 6—

విజయవాడలో కొత్తవి	155_00
పాతవి	200_00
రాజమండ్రిలో కొత్తవి	135_00
పాతవి	175_00
అమలాపురంలో కొత్తవి	135_00
పాతవి	170_00
పాలకొల్లులో కొత్తవి	135_00
పాతవి	180_00

బులియన్ మార్కెట్

వెండి 1 కి॥ గ్రా॥	254_00
10 గ్రా.	2_65

బొంబాయి మార్కెట్

ఆముదం	172_37
వేరుశనగ	287_62
అవిసె గింజలు	41_69
పత్తిగింజలు	104_00

"విజయవాడలో చౌక డిపోలు స్థాపించాలి"

లాగుడు బండ్ల డైవర్ల సంఘం సమావేశంలో అభ్యర్థన

విజయవాడ, ఏప్రిల్ 6— ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగినందున పేద ప్రజానీకం స్థితి దుర్భరంగా వున్నదని, కావున పట్టణంలో అన్ని ప్రాంతాలలోను సత్వరమే చౌక డిపోలు స్థాపించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ స్థానిక జాతీయ లాగుడు బండ్ల డ్రైవర్ల సంఘం సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

స్థానిక జాతీయ లాగుడు బండ్ల డైవర్ల సంఘ సర్వసభ్య సమావేశం పట్టణ కాంగ్రెసు కార్యాలయంలో మొన్న సంఘం అధ్యక్షుల శ్రీ పోతిన చిన్నా అధ్యక్షతన జరిగింది. రెండవ మండల కాంగ్రెసు కమిటీ అధ్యక్షుల శ్రీ పైడిపాటి అప్పలస్వామి, శ్రీయుతులు వజ్రె రాములు, పగిడిపల్లి శ్రీరాములు, చొక్కర పెదసింహాచలంగార్లు సంఘం ప్రాముఖ్యాన్ని గురించి ఉపన్యసించారు. సమావేశం అనంతరం 400 మంది లాగుడు బండ్ల డ్రైవర్లతో ఊరేగింపు జరిగింది.

సంఘాన్ని పటిష్ఠం చేయడానికి. కావలసిన ఏర్పాట్లు చేయడానికి అధ్యక్షులు శ్రీ పోతిన చిన్నాగారికి అధికార మిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

సంఘం ఆర్గనైజర్ శ్రీ దాడి అప్పన్న వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

వ్యవసాయాభివృద్ధికి యువకుల కృషి

పడమర విప్పర్రులో శ్రీ మూర్తిరాజు వివరణ

తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 6 — ఇతోధికంగా లభిస్తున్న వ్యవసాయ శాస్త్ర పరిశోధనా ప్రయోగ ఫలితాలు ఆకళించుకుంటూ ఆధునిక పద్ధతులను అమలుచేసి పంట రాబడి ద్విగుణీకృతం చేసేందుకున్న అవకాశాలను శాసనసభ్యుడు శ్రీ చింతలపాటి ప్రసాదమూర్తిరాజు యువకులకు వివరించారు. యువజనుల వ్యవసాయకోత్సాహం ఆవశ్యకతను ఆయన వివరించారు.

పెంటపాడు సమితికి చెందిన పడమర విప్పర్రులో మూడు రోజులు జరిగిన యువజన సంఘ వార్షికోత్సవాలకు అధ్యక్షత వహించిన శ్రీ మూర్తిరాజు నేటి వ్యవసాయక పరిస్థితులు, భూస్వామ్యం, పన్నులు గురించి కూడా ప్రసంగించారు.

తాలూకా రైతుసంఘంకార్యదర్శి శ్రీ ఇందుకూరి సుబ్బరాజు రైతుల ఇబ్బందులను గురించి ప్రసంగించారు.

శ్రీ ఎ. వెంకటేశ్వరరావు (బ్లాకుడెవలెప్‌మెంట్ ఆఫీసరు) కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు. శ్రీ వసల సూర్యనారాయణ పతాకావిష్కరణ చేశారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శ్రీ వసల వెంకటచలం వివిధ పోటీల్లో విజేతలకు బహుమానాలు పంచి పెట్టారు.

అనకాపల్లిలో సంతాప సభ

శ్రీ బి. అచ్చన్నాయుడుకు శ్రద్ధాంజలి

అనకాపల్లి, ఏప్రిల్ 6— స్థానిక కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు శ్రీ దొడ్డేడ అచ్చన్నాయుడు మృతికి సంతాపం తెలుపడానికి ఇటీవల ఇక్కడ శ్రీ గౌరీ సేవా సంఘం హాలులో శ్రీ వి. వి. రమణ అధ్యక్షతన సభ జరిగింది.

కీర్తిశేషులు శ్రీ అచ్చన్నాయుడు స్థానిక కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి. సహకారోద్యమ వ్యాప్తికి చేసిన సేవలను ప్రస్తుతించి, ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలియ జేయడానికి తీర్మానించారు.

స్వర్గీయుని స్మారక చిహ్నాలను అనకాపల్లి. చోడవరం సహకార సొసైటీల ఆవరణలలో నెలకొల్పడానికి నిర్ణయించి అందుకు నిధి సేకరించడానికి తీర్మానించారు.

క్రీడాభిరామం :

ఆలిండియా ఫుట్ బాల్ టోర్నమెంట్స్

ఏప్రిల్ 19 వ తేదీనుంచి అనంతపురంలో ప్రారంభం

అనంతపురం, ఏప్రిల్ 6— అఖిల భారత ఫుట్‌బాల్ టోర్నమెంట్సు, ఇక్కడ కొత్తగా నిర్మించబడిన స్టేడియంలో 19 వ తేదీ నుంచి నిర్వహించబడునని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ జి. ఎ. లక్ష్మీనారాయణ తెలియజేస్తున్నారు.

ప్రఖ్యాత ఫుట్‌బాల్ టీములు హైదరాబాద్, మైసూరు, కలకత్తా, బొంబాయి మొదలగు ప్రదేశాలనుంచి వస్తున్నవట. నిజామ్ గోల్డు కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్సు పేరిట పోటీలు జరుగుతాయట. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ ముజరుల్‌హక్ (జిల్లా కలెక్టరు) ఉపాధ్యక్షులు శ్రీ కె. యస్. సాల్డానా (పోలీసు సూపరింటెండెంటు) ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు.

అదనపు శిస్తు చట్టం

రైతును క్రుంగదీస్తున్నదని భీమవరం సభలో శ్రీ తెన్నేటి విమర్శ

భీమవరం, ఏప్రిల్ 6— స్థానిక న్యాయవాదుల సమావేశంలో అఖిలపక్ష కార్యాచరణ సంఘం అధ్యక్షుడు ప్రసంగిస్తూ అదనపు భూమి శిస్తు చట్టం సామాన్య రైతును దివాళా తీయించే పరిస్థితిని కల్పిస్తున్నదని నిశితంగా విమర్శించారు.

ఆరంభంలో శ్రీ జి. అచ్యుతరామయ్య (అధ్యక్షుడు), శ్రీ ఎస్. ఆర్. సీతారామభద్రరాజు (కార్యదర్శి) ప్రభృతులు శ్రీ విశ్వనాథం గారికి స్వాగతం చెప్పారు.

సాధారణ రైతు పన్ను చెల్లించగల శక్తిని పరిశీలించకుండా కొంతమంది ధనిక రైతులను దృష్టిలో పెట్టుకొని ప్లానింగ్ కమిషన్ సిఫార్సుల ననుసరించి వ్యవసాయాభివృద్ధి పేరుతో పన్ను అధికం చేశారని శ్రీ విశ్వనాథం పేర్కొన్నారు.

రైతుల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడంగాని, ఉత్పత్తి శక్తిని పరిశీలించడం గాని జరగలేదని ఆయన అన్నారు.

అదనపు భూమి శిస్తు చట్టాన్ని కొంతమంది కాంగ్రెస్ సభ్యులు వ్యతిరేకించినప్పటికి, పార్టీ క్రమశిక్షణకు వారు బద్ధులు కావలసి వచ్చినందున ఈ చట్టం ఆమోదించబడినదని శ్రీ తెన్నేటి విశదపరచారు.

అదనపు భూమి శిస్తు చట్టం సామాన్య రైతును దివాళా తీయిస్తుందని ఆయన చెప్పారు.

రైతుల పరిస్థితులను, వారి ఆర్థిక వ్యవస్థను పరిశీలించే నిమిత్తం కనీసం ఒక సంఘాన్ని నియమించాలని అఖిల పక్ష మహాసభ అభ్యర్థించగా ప్రభుత్వం నిరాకరించడం చేత పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభించాలని నిశ్చయించామని శ్రీ విశ్వనాథం వెల్లడించారు.

ఈ విషయంలో ప్రజలు దృఢ వైఖరి నవలంబించాలని, న్యాయవాదుల సంఘం ఈ ఉద్యమాన్ని నడపడానికి పూర్తి మద్దత్తు నిచ్చి విజయవంతం చేయాలని ఆయన ఉద్బోధించారు.

శ్రీ వై. వి. కృష్ణారావు మాట్లాడుతూ సత్యాగ్రహోద్యమం రాజకీయ దృక్పథంతో కాక, సామాన్య రైతులు అధిక పన్నుల భారంతో క్రుంగిపోతున్నారని ప్రభుత్వానికి తెలియజేయడానికే ప్రారంభించామని తెలిపారు.

సత్యాగ్రహం విజయవంత మైనప్పటికీ ప్రభుత్వం శిస్తు ఉపసంహరించకపోవడం వల్ల గ్రామాలవారీగా ఈ ఉద్యమాన్ని ప్రచారం చేసి సమర్థవంతంగా, శాంతియుతంగా పికెటింగ్ జరిపామని ఆయన అన్నారు.

గుజరాత్‌లోని అంకలేశ్వర్ పెట్రోలు గనులు అద్భుతమైన పురోగతిని సాధించి పెట్రోల్ రంగంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకొన్నవని పి. టి. ఐ. ప్రత్యేక విలేకరి వ్రాస్తున్నారు.

టెండరు నోటీసు

పులిగడ్డ పంచాయతీ

ది 10_4_64 వ తేదీ సాయంత్రం 3½ గంటల లోపల ఈ క్రింద ఉదహరించిన పనులకు సీలువేసిన టెండర్లు ఈ దిగువ సంతకము చేసిన వారిచే స్వీకరించబడును. అదే తేదీ 4 గంటలకు టెండర్లు తెరువబడును. టెండరు షరతులు, ఇతర వివరములు ఆఫీసు పనిచేయు కాలములో తెలుసుకొనవలెను.

పని పేరు	ఎస్టిమేటు మొత్తం	డిపాజిట్
1. రజక దల్వాష్టు వద్ద నుంచి వంతెన వరకు గల రోడ్డుకు గ్రానిట్ మెటలు వేయుట	రు. 3500/-	రు. 175/-
2. ధర్మచెరువు వద్ద నుంచి చెన్న బుల్లియ్య ఇంటి వరకు గల రోడ్డుకు క్వారీ రబ్బిష్ వేయుట	రు. 750/-	రు. 40/-
3. ఆఫీసు బిల్డింగు రిపేరు చేయుట	రు 550/-	రు. 30/-
4. పంచాయతీ ఏరియాలోని 1½" గొట్టపు బావులు 9 వేయుట, ఒక్కొక్కటి ఎస్టిమేటు	రు. 190/-	రు. 10/-

1_4_64 మండలి వెంకటసుబ్బారావు. ప్రెసిడెంటు.

Printed and Published by K. L. N. Prasad at
Andhra Printers Ltd., Vijayawada-2.
Editor: Narla Venkateswara Rao.